# పాత రేషన్ కార్డులు తొలగించాం



-కొత్త కార్డులను 26 నుంచి ఇవ్వబోతున్నాం
-విపక్షాల దుష్ప్రచారం నమ్మకండి
-మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టీకరణ

2వ పేజీలో...

సింగపూర్ యూనివర్సిటీతో ఎంఓయూ
సీఎం రేవంత్ సమక్షంలో కీలక ఒప్పందం

# స్కిల్ వర్సిటీకి టెక్నికల్ సహకారం



2వ పేజీలో...

# ఆరు గ్యారెంటీలని.. అర గ్యారెంటీ అమలు



2వ పేజీలో...

-సర్పంచ్ ఎన్నికల్లో ఎక్కడిక్కడ నిలదీయండి
-బాకీలు అడిగినట్లుగా కాంగ్రెస్ నేతలను అడగండి
-తులం బంగారం సహా హామీలపై ప్రశ్నించండి
-చేవెళ్లలో ఉప ఎన్నిక రావడం ఖాయం
-హామీలను అమలు చేసేదాకా నిలదీస్తూనే ఉంటా
-శంషాబాద్ బిఆర్ఎస్ రైతు ధర్నా సభలో కెటిఆర్



పారదర్శకంగా గ్రామసభల్లో లబ్దిదారుల ఎంపిక
త్వరలో సర్వేయర్ల, గ్రామాధికారుల నియామకం
రెవెన్యూ, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు

2వ పేజీలో...

హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, జనవరి17: ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం నిరంతర పక్రియ అని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇచ్చే బాధ్యత ఈ ప్రభుత్వానిదేనని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మొదటి విడతలో ఇండ్ల స్థలం ఉన్నవారికి ,రెండవ విడతలో ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లును నిర్మించి ఇస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, గ్రామాలలో రెవెన్యూ వ్యవస్థ, సర్వేయర్ల నియామకంపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో శుక్రవారంనాడు చీఫ్ సెక్రటరీ శాంతికుమారితో కలిసి సమీక్షించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ , హౌసింగ్ సెక్రటరీ జ్యోతి బుద్ధ ప్రకాష్, హౌసింగ్ కార్పోరేషన్ ఎండీ వి.పి. గౌతమ్,జిహెచ్ ఎం సీ కమిషనర్ ఇలంబర్తి, సిఎంఆర్వో డైరెక్టర్ మకరంద్ తదితరులు పాల్గొన్నారు.

# 31నుంచి బడ్జెట్ సమావేశాలు



జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు తొలి విడత, మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 వరకు రెండో విడత సమావేశాలు జరగనున్నాయి. 2వ పేజీలో...

# కర్నాటకలో మరో దోపిడీ ఘటన

-బ్యాంకులో తుపాకులతో బెదిరించి నగదు దోపిడీ

మంగళూరు, యదార్థవాది ప్రతినిధి, జనవరి 17 : కర్ణాటకలోని బీదర్‌లో దోపిడీకి పాల్పడి అక్కడ ఇద్దరిపై కాల్పులు జరిపిన ఘటన మరువకముందే కర్ణాటకలో శుక్రవారం మధ్యాహ్నం మరో దోపిడీ జరిగింది. దక్షిన కన్నడ జిల్లాలోని ఉల్లాల్ కేసీ రోడ్డులో ఉన్న ఓ బ్యాంకులోకి పట్టపగలే దోపిడీ ముఠా ప్రవేశించింది. బ్యాంకు ఉద్యోగులు, ఖాతాదారులను తుపాకులతో బెదిరించిన ముఠా సభ్యులు.. భారీ మొత్తంలో నగదు, బంగారం దోచుకొని పరారయ్యారు. ఫియట్ కారులో వచ్చిన ఐదుగురు దుండగులు ఈ దోపిడీకి పాల్పడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దోపిడీ తర్వాత దుండగులు మంగళూరు వైపు పరారైనట్లు తెలుస్తోంది.

# మేనకోడలితో శారీరక సంబంధం



-బ్లాక్‌మెయిల్‌తో యువతి ఆత్మహత్య
-నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

సాఫ్ట్ వేర్ ఉద్యోగిని(24) హోటల్ గదిలోనే నిప్పంటించుకుంది.

3వ పేజీలో...






-జీవ ఇంధనాల అభివృద్ధిపై భారతదేశం దృష్టి
-భారత్ మొబిలిటీ ఎక్స్ పో 2025'
ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ

# దేశంలో ఎలక్ట్రిక్ మొబిలిటీ విస్తరణకు చర్యలు

3వ పేజీలో...

# విశాఖ స్టీల్ ప్లాంట్‌కు భారీ ఆర్థిక చేయూత




-రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీని ప్రకటించిన కేంద్రం
-కేంద్రానికి కృతజ్ఞతలు చెబుతూ మంత్రి రామ్మోహన్ ట్వీట్



మంత్రి శ్రీధర్ బాబు, స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్‌ల సమక్షంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సుబ్బారావు, ఐటీఈ డిప్యూటీ డైరెక్టర్ ఫాబియన్ చియాంగ్ శుక్రవారం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. సింగపూర్ ఐటీఈ పదో తరగతి చదివే విద్యార్థుల స్థాయి నుంచి చదువు పూర్తి చేసిన యువత, ఆసక్తి ఉన్న ఏ వయసు వారికైనా.. పరిశ్రమలు, ఐటీ సంస్థల సహకారంతో జాబ్ రెడీ శిక్షణను ఇస్తుంది. 'స్కిల్స్ ఫర్ ఫూచర్, స్కిల్స్ ఫర్ లైఫ్' అనే నినాదంతో పనిచేస్తున్న ఐటీఈలో ప్రస్తుతం 28 వేల మంది శిక్షణ పొందుతున్నారు. మొత్తం వంద ఫుల్ టైమ్ కోర్సులకు ఆన్‌లైన్, క్యాంపస్ శిక్షణ ఇక్కడ అందుబాటులో ఉంటుంది. ఐటీఈకి ఐదు వేల పరిశ్రమలతో భాగస్వామ్యం ఉంది. పరిశ్రమలు తమకు అవసరమైన మానవ వనరులకు ఐటీఈలో నేరుగా శిక్షణనిచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయి. అదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటైన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ తన శిక్షకులకు ఐటీఈతో ట్రెయినింగ్ (ట్రెయినింగ్ ఫర్ ట్రెయినర్స్) ఇప్పించేలా ఒప్పందరం కుదుర్చుకుంది. తాజా ఎంఓయు వల్ల సింగపూర్ ఐటీఈ పాఠ్యాంశాలను మనం ఉపయోగించుకునే వీలు కలుగుతుంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సింగపూర్‌లో పర్యటిస్తున్నారు. ముఖ్యమంత్రి తొలిరోజు పర్యటనలోనే ఈ కీలక ఒప్పందం జరిగింది. ముఖ్యమంత్రి సింగపూర్ పర్యటనలో తొలిరోజు విశేష స్పందన లభించింది. పర్యటనలో భాగంగా సింగపూర్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటీఈ) క్యాంపస్‌ను సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు సందర్శించారు. అక్కడ నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు, అధునాతన సదుపాయాలను పరిశీలించారు. అక్కడ శిక్షణను అందిస్తున్న దాదాపు 20 రంగాలకు చెందిన నిపుణులు, కాలేజీ సిబ్బందిని కలిసి మాట్లాడారు. అనంతరం ఐటీఈ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి బృందం చర్చలు జరిపింది. హైదరాబాదులోని ఫోర్త్ సిటీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి




సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. వివిధ రంగాల్లో యువతకు ఉపాధి కల్పించేందుకు మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా వివిధ కోర్సులు నిర్వహిస్తున్న తీరును ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. నైపుణ్యాల అభివృద్ధి (స్కిల్ డెవెలప్మెంట్) శిక్షణలో భాగస్వామ్యం కోసం పరస్పర సహకారం అందించాలని కోరారు. దీనిపై ఐటీఈ ప్రతినిధి బృందం సానుకూలంగా స్పందించింది. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో కలిసి పని చేసేందుకు సంసిద్ధతను వ్యక్తం చేసింది. చర్చల అనంతరం నైపుణ్యాల అభివృద్ధిలో కలిసి పని చేసేందుకు ఐటీఈ, స్కిల్ యూనివర్సిటీ పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. త్వరలోనే ఐటీఈ ప్రతినిధి బృందం హైదరాబాద్‌ను సందర్శించనుంది. కాగా.. ఉదయం సింగపూర్ విదేశాంగ మంత్రి వీవీఎన్ బాలకృష్ణతో రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. గ్రీన్ ఎనర్జీ, మూసీ పునరుజ్జీవనం, పర్యాటకం, విద్య, ఐటీ, నైపుణ్య నిర్మాణంపై వారు చర్చించారు. సీఎంతో పాటు ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్‌రంజన్ భేటీలో పాల్గొన్నారు.




మందికి ఇప్పటికే తెలంగాణలో 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, పాత రేషన్ కార్డులు తొలగించడం లేదని స్పష్టం చేశారు. అర్హత ఉండి కొత్త రేషన్ కార్డులు రాని వారికి జనవరి 26 నుండి కొత్త కార్డులు ప్రభుత్వం ఇస్తుందని, ప్రతిపక్షాలు కావాలని రాజకీయం చేసి రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. రేషన్ కార్డు అర్హత ఉండి రాకుంటే.. సంబంధిత అధికారికి, ప్రజాప్రతినిధులకు విజ్ఞాపన పత్రాలు ఇవ్వచ్చని మంత్రి పొన్నం చెప్పారు. కరీంనగర్ జిల్లా చిగురు మామిడి మండలం ఇందుర్తి మండలంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ? 'జనవరి 26 నుండి కొత్త రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ కోసం గ్రామాల్లో సర్వే జరుగుతుంది. తెలంగాణ ప్రజలకు కొన్ని అంశాలు చెప్పే ప్రయత్నం చేస్తున్నా. 2 కోట్ల 81 లక్షల మందికి ఇప్పటికే తెలంగాణలో 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. ఇప్పుడు పాత 90 లక్షల రేషన్ కార్డులు చర్చ కాదు. గత 10 సంవత్సరాలుగా రేషన్ కార్డులు లేకుండా, కొత్తగా పెళ్లి అయిన వారికి, కొత్త కుటుంబాలు, మార్పులు చేర్పులు, అర్హత ఉండి కొత్త రేషన్ కార్డులు రాని వారికి శుభవార్త చెబుతున్నా. అర్హత ఉన్న వారికి జనవరి 26 నుండి రేషన్ కార్డులు ఈ ప్రభుత్వం ఇస్తుంది. ప్రతిపక్షాలు కావాలని రాజకీయం చేసి రాద్ధాంతం చేస్తున్నాయి. రేషన్ కార్డు అర్హత ఉండి రాకుంటే సంబంధిత అధికారి, ప్రజా ప్రతినిధులకు విజ్ఞాపన పత్రాలు ఇవ్వవచ్చని తెలిపారు. 'పాత రేషన్ కార్డులు తొలగించడం లేదు. ఇందులో ఎలాంటి అనుమానం లేదు. ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే నమ్మవద్దు. కుల సర్వే ఆధారంగా అప్లికేషన్ల సమాచారంతో కొత్త రేషన్ కార్డులు వస్తున్నాయి. ఇందుర్తిలో 71 కొత్త రేషన్ కార్డులు వచ్చాయి. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు వస్తున్నాయి. 2 లక్షల లోపు రైతు రుణమాఫీ చేశాం. రైతు భరోసా 12 వేలు ఇస్తున్నాం. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇస్తున్నాం. భూమి లేని రైతు కూలీలకు 12 వేలు ఇస్తున్నాం. ఇందుర్తి మండల ప్రతిపాదనలు పంపాం. రాష్ట్రంలో కొత్త మండలాలు ఏర్పడినప్పుడు ఇందుర్తి మండలం ఏర్పడుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. కాగా.. ఆరు గ్యారెంటీలను రేవంత్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తుంది. ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇప్పటికే పలు హామీలను రేవంత్ ప్రభుత్వం అమలు చేసింది. ఈ మేరకు రేషన్ కార్డులపై రేవంత్ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. కొత్త రేషన్ కార్డులను ఈ నెల26 నుంచి జారీ చేస్తున్నట్లు ప్రకటించింది. కులగణన సర్వే ఆధారంగా తయారు చేసిన రేషన్ కార్డులు లేని కుటుంబాల జాబితాను జిల్లా కలెక్టర్లతోపాటు జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు క్షేత్రస్థాయి పరిశీలన కోసం పంపనుంది. మండల స్థాయిలో ఎంపీడీఓతోపాటు యూఎల్‌బీలో మున్సిపల్ కమిషనర్ ఈ మొత్తం ప్రక్రియకు బాధ్యులుగా చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లేదా జీసీఎస్ఓ పర్యవేక్షకులుగా ఉండేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

# ఆరు గ్యారెంటీలని..అర గ్యారెంటీ అమలు



**మొదటిపేజీ తరువాయి...**

రంగారెడ్డి, యదార్థవాది ప్రతినిధి, జనవరి 17 : కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారెంటీలని చెప్పి.. అర గ్యారెంటీ మాత్రమే అమలు చేశారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. కేవలం ఉచిత బస్సు ప్రయాణంతో సరిపెట్టారని ఆరోపించారు. చేవెళ్ల నియోజకవర్గం శంషాబాద్‌లో నిర్వహించిన రైతు దీక్షలో ఆయన ప్రసంగించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్నారు. ఈ రాష్ట్రంలో ఉన్న 1.67 కోట్ల మంది ఆడబిడ్డలకు ఒక్కొక్కరికి నెలకు రూ.2,500 చొప్పున రూ.30వేలు సీఎం రేవంత్‌రెడ్డి బాకీ ఉన్నారు. ఒక్కో రైతుకు ఎకరానికి రూ.17,500 బాకీ పడ్డారు. రైతులందరికీ రుణమాఫీ చేశామని నిరూపిస్తే రాజీనామా చేస్తా. గతంలో రైతుబంధుకు అడ్డుగా పిటిషన్ వేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు వచ్చిన కాంగ్రెస్ నేతలను ఎక్కడికక్కడ మహిళలు, రైతులు నిలదీయాలని ఈ సందర్భంగా కెటిఆర్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రుణమాఫీ వంద శాతం పూర్తయిందని నిరూపిస్తే.. నేను, మా ఎమ్మెల్యేలంతా రాజీనామా చేస్తాం' అంటూ సవాల్ విసిరారు. ఆరు గ్యారెంటీలు ఇచ్చి.. అర గ్యారెంటీ మాత్రమే అమలు చేస్తున్నారన్నారు. కేవలం ఫ్రీ బస్సుతో సరిపెట్టారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలను రైతులు నిలదీయాలన్నారు. రైతు భరోసా రూ.15 వేలు ఇస్తామని చెప్పి.. మోసం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రతి మహిళకు రేవంత్ రూ.30 వేలు బాకీ పడ్డారని.. రూ.30 వేలు ఇస్తేనే ఓటేస్తామని మహిళలు నిలదీయాలని మాజీ మంత్రి అన్నారు. ఎన్నికలప్పుడు రూ.7600 కోట్లు రైతుబంధు వేసేందుకు తాము సిద్ధమైతే ఈసీకి లేఖ రాసి రైతు బంధును వేయనీయకుండా అడ్డుకున్నారన్నారు. యాసంగి పంట సమయంలో రైతుల కోసం రూ.7600 కోట్లు పెడితే.. రేవంత్ ప్రభుత్వం వచ్చాక నాట్లు వేసే సమయంలో కాకుండా.. పార్లమెంటు ఎన్నికల సమయంలో ఓట్ల కోసం రైతుల ఖాతాలో వేశారని విమర్శించారు. ఒక్కసారి మాత్రమే కేసీఆర్ ఇచ్చిన డబ్బులను రైతు భరోసా కింద వేశారని.. ఆ తరువాత రైతు భరోసా ముచ్చటే లేదన్నారు. ఖచ్చితంగా జనవరి 26న రైతులకు ఇస్తానన్న రైతు భరోసాను ఇవ్వాల్సిందే అని స్పష్టం చేశారు. అది కూడా రూ.12 వేలు కాదు.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.15 వేలను రైతుల ఖాతాలో జమ చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. వానాకాలం పంటకు ఎగ్గొట్టిన రైతు బంధును కూడా రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు ఓటేయమని అడిగితే.. ముందు బాకీ తీర్చాకే ఓటు వేస్తామని గట్టిగా చెప్పాలని రైతులకు చెప్పారు. రైతులకు ఎకరానికి రూ.17500 బాకీ ఉంటే.. మహిళలకు సంవత్సరానికి రూ.30 వేల మేర రేవంత్ రెడ్డి బాకీ ఉన్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి పచ్చి మోసగాడు అంటూ కేటీఆర్ తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారు. 37 రోజులు కాదు దమ్ముంటే 370 రోజులు జైల్లో పెట్టుకో.. భయపడేటోడు ఎవడూ లేడు అని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ తేల్చిచెప్పారు. కానీ ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకో. నిలబెట్టుకోకపోతే వెంటాడుతాం.. అడుగూతనే ఉంటాం. పేదల తరపున కొట్లాడుతూనే ఉంటాం అని కేటీఆర్ స్పష్టం చేశారు. సర్పంచ్, జడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెసోళ్లు వస్తారు.. చేయి గుర్తుకు ఓటేయండి అని అడుగుతారు. మీ సీఎం రైతుభరోసా కింద ఎకరానికి 17500 చొప్పున బాకీ ఉన్నాడు.. ఆ డబ్బులు చెల్లిస్తే ఓట్లు వేస్తామని చెప్పండి. బాకీ ఉన్నోన్ని అడిగినట్టు గల్లా పట్టుకుని అడగాలి.. అభయ హస్తం భస్మాసుర హస్తం అయిపోయిందని నిలదీయాలని ఆడబిడ్డలకు, రైతులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని మహిళలకు చిలుకకు చెప్పినట్టు చెప్పిండు కేసీఆర్. కాంగ్రెసోళ్లను నమ్మకండి అని చెప్పిండు. నెలకు 2500 వడ్డాయా..? 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు అయ్యాయా.? సర్పంచ్ ఎన్నికలప్పుడు వేస్తడు.. మళ్లీ నాలుగేండ్ల వరకు కనిపించడు. కాబట్టి రైతుబీమా, రైతు రుణమాఫీ, రైతు భరోసా ఎక్కడ అని నిలదీయండని రైతులకు, ఆడబిడ్డలకు కేటీఆర్ సూచించారు. ఈ ఏడాది కాలంలో నాలుగైదు లక్షల లగ్గాలు అయ్యాయి. రేవంత్ రెడ్డికి తులం బంగారం దొరకతలేదా ..? బంగారం షాపుడో నిన్ను నమ్మడం లేదా..? పెళ్ళైన ఆడబిడ్డలకు 80 వేల చొప్పున బాకీ ఉన్నాడు. సిలిండర్ ఫ్రీగా వస్తలేదు. కరెంట్ 200 యూనిట్ల ఫ్రీగా ఇవ్వడం లేదు. పచ్చి మోసగాడు.. పచ్చి అబద్ధాల కోరు సీఎం రేవంత్.. 420 కేసు పెట్టాలంటే రేవంత్ రెడ్డి మీద చీటింగ్ కేసు పెట్టాలి. మనం కేసులు పెట్టినా.. పోలీసులు దరఖాస్తు తీసుకోవడం లేదు. రేవంత్ రెడ్డి భయం పట్టుకుంది వాళ్లకు. అందుకే ఓట్లప్పుడే రేవంత్ రెడ్డికి చురుకు పెట్టాలని కేటీఆర్ చెప్పారు. చేవెళ్ల నియోజకవర్గంలో త్వరలోనే ఉప ఎన్నిక రాబోతుందని కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసాలను రైతులు, ఆడబిడ్డలు ఎండగట్టాలని కేటీఆర్ సూచించారు. కేసీఆర్‌కు ఓటేయడంతో ఇక్కడున్న ఎమ్మెల్యే గెలిచిండు. ఇప్పుడు రేవంత్ రెడ్డి సంకలో జొచ్చిండు. అభివృద్ధి కోసం పోయాను అని అంటుండు. ఈ ఏడాదిలో ఏం అభివృద్ధి జరిగింది..? రైతుబంధు, రుణమాఫీ, రైతుబీమా అమలైందా..? ఆడబిడ్డలకు తులం బంగారం, స్కూటీ ఇచ్చావా..? ఏం అభివృద్ధి అయింది.. ఉన్నది పీకింది. ఎన్నికలు వచ్చినప్పుడు చేవెళ్లలోనే కాదు..



పార్టీ మారిన ఎమ్మెల్యేల 10 నియోజకవర్గాల్లో బుద్ధి చెబుదాం. రైతు భరోసా వేయనందుకు, వానాకాలం రైతుబంధు ఎగ్గొట్టినందుకు, రుణమాఫీ మోసం చేసిందుకు, ఆడబిడ్డలకు రూ. 2500 ఇవ్వనందుకు, మా భూమి మాకే ఉండాలన్న పాపానికి 40 మంది రైతులను జైల్లో పెట్టి హింసించినందుకు.. కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుదాం. చివరకు వృద్ధులను కూడా మోసం చేసిండు. ఆసరా పెన్షన్లు 4 వేలు ఇవ్వడం లేదు అని కేటీఆర్ ధ్వజమెత్తారు.రేవంత్ రెడ్డి నోటికి హద్దు లేదు. మందికి పుట్టిన బిడ్డలను మా బిడ్డలు అని చెప్పుకుంటుండు. కేసీఆర్ ఇచ్చిన 44 వేల ఉద్యోగాలను నేను ఇచ్చిన అని చెప్పుకుంటూ మోసం చేస్తున్నాడు. ఇవాళ షాబాద్‌లో జరిగిన ధర్నా మొట్టమొదటి.. మిగతా చోట్ల కూడా ధర్నా చేస్తాం. 70 లక్షల మంది రైతుల పక్షాన, 22 లక్షల మంది కౌలు రైతుల పక్షాన, భూమి లేని నిరుపేదల పక్షాన అడుగుతున్నాం.. ఇచ్చిన మాట నిలబెట్టుకో.. అందరికీ రైతుభరోసా జమ చేయ్.. లేదంటే రేపు పంచాయతీ ఎన్నికల్లో నీ వీపు చింతపండు చేస్తారు మా ఆడబిడ్డలు, రైతులు. ఇది ఆరంభం మాత్రమే.. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడతూనే ఉంటాం.. ఎన్ని కేసులు పెట్టినా.. జైళ్లకు పంపించినా రైతుల పక్షాన పోరాడుతూనే ఉంటామని కేటీఆర్ తేల్చిచెప్పారు.ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, భారాస నేతలు శ్రీనివాస్‌గౌడ్, పట్నం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ ఇన్సూరెన్స్ ముఠా అరెస్ట్

హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, జనవరి17: శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ ఇన్సూరెన్స్ లు తయారుచేస్తున్న ముఠా సభ్యులను ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. ఈ ముఠా సభ్యులు విస్తృతంగా నకిలీ ఇన్సూరెన్స్ పాలసీలు తయారుచేసి అవి సరైన ధృవీకరణ లేకుండా అమాయకులకు విక్రయించి, భారీ మొత్తంలో దోచుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఓటి పోలీసులు వారిని చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ కేసులో పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పలువురు వ్యక్తుల నుంచి అనుమానాస్పద ఫిర్యాదులు అందిన తర్వాత వారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఎస్ఓటీ పోలీసులు ముఠా సభ్యులను కస్టడీలోకి తీసుకుని, వారి నుంచి కీలక సమాచారం సేకరించారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు

**మొదటిపేజీ తరువాయి...**



ఈ సమావేశంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇంజనీరింగ్ విభాగాన్ని సమకూర్చుకోవడం, ప్రతి రెవెన్యూ గ్రామానికి రెవెన్యూ అధికారి నియామకం, సర్వేయర్ల నియామకంపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లకు అర్హులైన లబ్దిదారులకు సంబంధించిన నివాస స్థలం ఉన్నవారి జాబితా, నివాస స్థలం లేని వారి జాబితా రెండు జాబితాలను గ్రామసభల్లో పెట్టాలని అధికారులకు సూచించారు. దశల వారీగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని తెలిపారు. ప్రస్తుతం హౌసింగ్ కార్పొరేషన్‌లో 274 మంది ఇంజనీర్లు మాత్రమే ఉన్నారని రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, పర్యవేక్షణకు మరో 400 మంది ఇంజనీర్లు అవసరమని ఈ సందర్భంగా అధికారులు మంత్రిగారి దృష్టికి తీసుకువచ్చారు. ఇతర ప్రభుత్వ విభాగాలలో ఇంజనీరింగ్ సిబ్బంది సేవలను ఏ విధంగా ఉపయోగించు కోవచ్చు వంటి అంశాలను పరిశీలించాలని ఈ సందర్భంగా మంత్రి సిఎస్ కి సూచించారు.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో ఇండ్ల నిర్మాణానికి సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. విలేజీ రెవెన్యూ వ్యవస్థకు సంబంధించి ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమిస్తామని ఇందుకోసం విఆర్వో, విఆర్ఏ నుంచి అర్హులైన వారిని ఎంపిక చేసి ప్రత్యేకంగా పరీక్ష నిర్వహించాలని, ఈ పరీక్షకు సంబంధించిన విధివిధానాలను తక్షణమే రూపొందించి పరీక్ష నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 450 మంది సర్వేయర్లు ఉన్నారని అదనంగా మరో వెయ్యి మంది సర్వేయర్లు అవసరమున్న నేపథ్యంలో సర్వేయర్ల ఎంపికకు కావలసిన ప్రణాళిక తయారు చేయాలని ఎంపిక విధానం పారదర్శకంగా ఉండాలని అధికారులకు సూచించారు.

# 31నుంచి బడ్జెట్ సమావేశాలు

**మొదటిపేజీ తరువాయి...**



న్యూఢిల్లీ, యదార్థవాది ప్రతినిధి, జనవరి 17: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తేదీలు ఖరారయ్యాయి. రెండు విడతల్లో ఈ సమావేశాలు నిర్వహించనున్నారు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు తొలి విడత, మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 వరకు రెండో విడత సమావేశాలు జరగనున్నాయి. ఈ నెల 31న పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగంతో సమావేశాలు ప్రారంభం కానున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు.

నిరుద్యోగం తీరడం లేదు. రూపాయి విలువను కాపాడే ప్రయత్నాలు జరగడం లేదు. కానీ బడ్జెట్‌లో దిగుమతి సుంకాలు పెంచే ప్రయత్నం చేస్తామని అంటున్నారు. ఇలా చేయడం వల్ల రూపాయి విలువ పెరుగుతుందనుకుంటే పొరపాటు. నేలవిడిచి సాము చేస్తున్న చందంగా కేంద్రం చర్యలు ఉంటున్నాయి. నిజానికి చైనాను చూసి మనం ఎంతో నేర్చుకోవాల్సి ఉంది. అధిక జనాభాను ఉపయోగిం చుకుని వస్తూత్పత్తిన పెంచుకుని ప్రపంచ మార్కెట్ పెంచుకునే ప్రయత్నాలు చేయడం లేదు. అలాగే గత పదేళ్లుగా మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఏనాడూ రూపాయిని నిలబెట్టే ప్రయత్నాలు చేయలేదు. అందుకే డాలర్ ముందు రూపాయి తేలిపోతోంది. రోజురోజుకూ విలువ కోల్పోతూ తన రికార్డును తానే బద్దలుకొడుతోంది. ఇటీవల రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే..రూ. 87కు చేరువలో ఉంది. సమిపకాలంలో రూపాయి విలువ మరింత పతనం కావచ్చునని ఆర్థికవేత్తలు అంచనావేస్తున్నారు. అయినా ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ మాత్రం కొత్తంగా ఏయే పన్నులు వేయవచ్చో..వేటిని జిఎస్టీ కిందకు తీసుకుని రావవచ్చో అన్న ఆలోచనలో ఉన్నట్లుగా ఉంది. 2014లో ఎన్నికల ప్రచారంలో నరేంద్ర మోదీ రూపాయి పతనం గురించి చేసిన వ్యాఖ్యలు అందరూ గుర్తుకు తెచ్చుకోవాల్సిన తరుణమిది. దేశ రక్షణ గురించి గానీ,రూపాయి పతనం గురించి గానీ మన్మోహన్‌సింగ్ ప్రభుత్వానికి పట్టింపు లేదని మోదీ అప్పట్లో ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఆయనతో పాటు, ఆయన ప్రధాని కావాలని కోరుకున్న ప్రముఖులంతా రూపాయి పతనం మీద చేసిన వ్యాఖ్యలు అప్పుడే మరచిపోలేం.ఎందుకంటే రూపాయి పతనం అప్పటి కన్నా వేగంగా పతనం అవుతోంది. అప్పట్లో రూపాయి గురించి గుండెలుబాదుకున్న వారంతా ఇప్పుడు ఎందుకో నోరువిప్పడం లేదు. ఇప్పుడు రూపాయి పతనం ఎంతగా పడిపోతున్నా ఎందుకనో మన మైనముని మోడీ మాత్రం నోరు విప్పడం లేదు. మన్మోహన్ సింగ్‌ను మౌనముని అంటూ దెప్పి పొడిచిన మోడీ ఇప్పుడు తాన అతిపెద్ద మౌనమునిగా మారారు. రూపాయి విలువ దారుణంగా పడిపోవడంతో ఆర్థిక నిపుణుల్లో ఆందోళన నెలకొంది. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా దిద్దుబాటు చర్యలేవీ ఫలితాలు ఇవ్వడం లేదు. సెప్టెంబర్ నెల నుండి రూపాయి పతనం స్పష్టంగానే కనిపిస్తోంది. సెప్టెంబర్ 12న డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రూ. 83.98కి పడిపోయింది. అప్పట్లో అదో రికార్డు. ఆ స్థాయికి రూపాయి విలువ పడి పోవడం అదే మొదటిసారి కావడంతో కలకలం రేగింది. మార్కెట్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మోదీ ప్రభుత్వానికి ఈ విషయమే పట్టని.. ఫలితంగా పతనంలో రూపాయి కొత్త రికార్డులు సృష్టించడం ప్రారంభమైంది. రూపాయి విలువ తగ్గిపోతోంది కాబట్టి మన జేబులో డబ్బు ఎక్కువగా ఖర్చు చెయ్యాల్సి వస్తోంది. అందువల్ల దిగుమతులపై సుంకాలు విధిస్తే సరిపోతుందన్న భావనలో మోడీ ప్రభుత్వం ఉంది. ఇదొక్కటే సరిపోదు. మనదేశ ఎగుమతులు పెరగాలి. మన మార్కెట్ పెరగాలి. మన వస్తువులు ప్రపంచాన్ని తాకాలి. అప్పుడే రూపాయికి బలం చేకూరుతుంది. మేకిన్ ఇండియా నినాదంగా మారడంతో వస్తూత్పత్తి పడిపోయింది. కార్మికులు పనులు లేకుండా పస్తులు ఉంటున్నారు. అందుకే గత పదేళ్ళలో డాలర్‌తో రూపాయి మారకపు విలువ 25 శాతం పతనమైంది. అప్పట్లో నెలకు రూ.10వేలు సంపాదించేవారు సంసరాన్ని ఈడ్చుకుని వచ్చేవారు. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో నెలకు దాదాపు రూ.50వేల దాకా సంపాదించాలి. ఆ స్థాయిలో సామాన్యుల వేతనాలు పెరుగుతున్నాయా అంటే లేదు. కాబట్టి రూపాయి పతనం వల్ల నష్టపోతున్నది పేదలు, మధ్య తరగతివారు, సామాన్యులే. పదేళ్ల కిందట ఒక డాలర్ కోసం మనం 63 రూపాయలు చెల్లించాల్సి వచ్చేది. మరి ఇప్పుడు 87 రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. ఇదివరకు కూరగాయలు కొంటే 100 రూపాయలకి సంచినిండేది, ఇప్పుడు 500 రూపాయలు పెట్టినా నిండట్లేదు. ఒక్క కూరగాయలే కాదు, ఇంట్లో వాడే ప్రతీ నిత్యావసరం ధరా పెరుగుతూనే ఉంటుంది. ఇప్పుడు నిత్యావసర వస్తువుల ధరలు కూడా దారుణంగా పెరిగాయి. పప్పుల ధరలు 250కి కిలోగా ఉన్నాయి. ధరలు మరింత పెరగడం ఖాయం. రూపాయి పతనం వల్ల పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు బాగా పెరుగుతాయి. మనం విదేశాల నుంచి చమురును ఎక్కువగా కొంటున్నాం, భారీగా చెల్లింపులు జరుపు తున్నాం కనుక విలువ ప్రభావం ఇక్కడ అధికంగా ఉంటుంది. కోడిగుడ్డు ఒక రూపాయి నుంచి గత సంవత్సరం 5 రూపాయలు అయ్యింది. ఈ సంవత్సరం 7 రూపాయలు అయ్యింది. కోళ్ల దాణా, కరెంటు ఖర్చు, కూలీ వేతనాలు, నిర్వహణ ఖర్చులు, రవాణా ఖర్చులు ఇలా అన్నీ పెరుగుతూ గుడ్డు ధర కూడా పెరిగింది. ఇలా ఒకదానిపై ఒకటి ఆధారపడుతూ ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా బలమైన అడుగులు పడకపోతే, భారతదేశం మరింతగా నష్టపోవడం ఖాయం. మన ఎగుమతులను, ఉత్పాదకత సామర్థ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఉన్నది. ఉద్యోగ కల్పన, మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాలి. దీంతో ఉత్పత్తి పెరిగి ఎగుమతుల ద్వారా విదేశీ మారక ద్రవ్యం ఆర్జించి రూపాయి స్థిరీకరణ చేయవచ్చు. దేశీయంగా ఎలక్ట్రానిక్స్ సంస్థలు నెలకొల్పి, ఉన్నవాటి సామర్థ్యాన్ని ఉత్పత్తిని పెంచి దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించాలి. దిగుమతుల్లో ప్రముఖపాత్ర వహిస్తున్న ఇంధన అవసరాల కోసం దేశీయ సంస్థల్ని పురికొల్పి, ఎక్కువ ఉత్పత్తిని సాధించాలి. ప్రత్యామ్నాయ ఇంధన వనరుల ఉత్పాదకతను పెంచడం ద్వారా స్వయం సమృద్ధి సాధించాలి. మనకు సహజవనరులతో పాటు, మానవ వనరులు విశేషంగా ఉన్నాయి. వాటిని ఉపయోగించుకుని వస్తూత్పత్తని పెంచుకుంటే తప్ప ముందుకు సాగలేం. ఇలాగే మీనమేషాలు లెక్కిస్తూ జిఎస్టీ పెంచడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని చూస్తే సామాన్యుల బతుకులు ఛిద్రం కాగలవని గుర్తించాలి.



న్యూఢిల్లీ, యదార్థవాది ప్రతినిధి, జనవరి17 : దేశంలో ఎలక్ట్రిక్ మొబిలిటీ విస్తరణకు ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. గ్రీన్ టెక్నాలజీ, ఈవీలు, హైడ్రోజన్ ఇంధనం, జీవ ఇంధనాల అభివృద్ధిపై భారతదేశం దృష్టిసారిస్తోందన్నారు. దిగ్గజ వ్యాపారవేత్తలు రతన్ టాటా, ఒసాము సుజుకీ భారతదేశ ఆటో రంగం వృద్ధికి.. మధ్యతరగతి ప్రజల కలను నెరవేర్చడానికి ఎంతో సహకారం అందించారని అన్నారు. భారత్ పెట్టుబడులకు స్వర్గధామమని.. మొబిలిటీ రంగంలో తమ భవిష్యత్తును రూపొందించుకోవాలని చూస్తున్న ప్రతీ పెట్టుబడిదారుడికి భారతదేశం అత్యుత్తమ గమ్యస్థానంగా నిలుస్తుందని అన్నారు. 'భారత్ మొబిలిటీ ఎక్స్ పో 2025'ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. పెరుగుతున్న మధ్యతరగతి, వేగవంతమైన పట్టణీకరణ, సరసమైన వాహనాలు భారతదేశంలో ఆటో రంగాన్ని ముందుకు తీసుకువెళుతున్నాయని ప్రధాని పేర్కొన్నారు. దాదాపు 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని, వీరు వాహనాలను కొనుగోలు చేయాలనుకుంటున్నారని ప్రధాని మోదీ చెప్పారు.



ఈవీలను ప్రోత్సహించడానికి వలు ప్రాంతాల్లో ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటుచేశామన్నారు.మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం దేశంలో ఆటో పరిశ్రమ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ దశాబ్దం చివరికి ఎలక్ట్రిక్ వాహనాల(ఇ÷ఎ)అమ్మకాలు ఎనిమిది రెట్లు పెరుగుతాయని అన్నారు. 5 ఏళ్ల క్రితం ప్రారంభించిన ఫ్రేమ్-2 పథకం కింద రూ.8000 కోట్లకు పైగా సబ్సిడీగా ఇచ్చామని ప్రధాని పేర్కొన్నారు. దీంతో 16 లక్షలకు పైగా ఎలక్ట్రిక్ బస్సులు ఏర్పాటుచేశామన్నారు. ఢిల్లీలోనే 1200 కంటే ఎక్కువ ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. ఒకప్పుడు భారతదేశంలో నాణ్యమైన రోడ్లు లేకపోవడంతో ప్రజలు కార్లు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపకపోయేవారని ప్రధాని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి మారుతుండటంతో కార్లకు డిమాండ్ పెరుగుతోందన్నారు. ఏడాదికి దాదాపు 2.5 కోట్ల కార్లు విక్రయమవుతున్నాయని తెలిపారు. దేశ రాజధానిలోని భారత మండపంలో నేడు ప్రారంభమైన 'భారత్ మొబిలిటీ ఎక్స్ పో.. 22వ తేదీ వరకు జరగనుంది. యశోభూమి, గ్రేటర్ నోయిడాలోని ఇండియా ఎక్స్‌పో సెంటర్/మార్ట్ వేదికల్లో ఎక్స్‌పో కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్‌కు భారీ ఆర్థిక చేయూత

న్యూఢిల్లీ, యదార్థవాది ప్రతినిధి, జనవరి 17: విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం శుభవార్త చెప్పింది. స్టీల్ ప్లాంట్‌కు రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీని కేంద్రం ప్రకటించింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ అధికారికంగా వెల్లడించారు. ఇటీవల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలిసినప్పుడు స్టీల్ ప్లాంట్‌కు ఆర్థిక ప్యాకేజ్ ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ఈ క్రమంలో స్టీల్ ప్లాంట్ ఆపరేషనల్ పేమెంట్స్ కోసం రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజ్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. వైజాగ్ స్టీల్ ఎ÷-లాంట్‌కు ఆర్థిక ప్యాకేజీని ప్రకటించినందుకు గాను ప్రధాని మోదీకి ఎక్స్ వేదికగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ధన్యవాదాలు తెలిపారు.'విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఊపిరి పోసేలా రివైవల్ ప్యాకేజీ కింద రూ.11,400 కోట్లు కేటాయించిన ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు. నష్టాలను అధిగమించి, ప్లాంట్ పూర్తి స్థాయి ఉత్పాదనతో లాభాల బాట పెట్టేందుకు ఈసాయం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి, ప్రజల ఆకాంక్షల పట్ల ఎన్డీయే ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనం' అంటూ కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ట్వీట్ చేశారు. నష్టాలను అధిగమించేందుకు, ప్లాంట్ పూర్తి ఉత్పాదనతో లాభాల బాట పట్టేందుకు కేంద్ర ప్యాకేజీ దోహద పడుతుందన్నారు. రాష్టాభ్రివృద్ధి, ప్రజల ఆకాంక్షల పట్ల కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు.

# మాజీ సిఐడి చీఫ్ సునీల్ కుమార్‌పై విచారణ

## అధారిటీని నియమించిన కూటమి ప్రభుత్వం

అమరావతి, యదార్థవాది ప్రతినిధి, జనవరి17 : పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏపీ సీనియర్ ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్ పై విచారణకు అథారిటీని ప్రభుత్వం నియమించింది. ఆయనపై గతంలో నమోదు అయిన అభియోగాలపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆయన ఇచ్చిన వివరణను తిరస్కరించిన ప్రభుత్వం ఎంక్వయిరీకి కూటమి సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. విచారణకు అథారిటీని వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అథారిటీలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, విజిలెన్స్ డీజీ హరీష్ కుమార్ గుప్తాలు ఉంటారు. సాధ్యమైనంత త్వరగా సునీల్ కుమార్‌పై ఉన్న అభియోగాలపై నివేదిక ఇవ్వాలని అథారిటీని ప్రభుత్వం ఆదేశించింది. సీనియర్ ఐపీఎస్ అధికారి అయిన పీవీ సునీల్ కుమార్ వైఎస్ఆర్‌సీపీ హయాంలో సీఐడీ చీఫ్ గా ఉన్నారు. ఆ సమయంలో ఆయన చాలా అవకతవకలకు పాల్పడ్డారని .. వైసీపీ అధినేత కోసం టీడీపీ నేతల్ని తప్పుడు కేసులతో వేధించారన్న ఆరోపణలు ఎదుర్కొంటూ వచ్చారు. ముఖ్యంగా రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ఆయనపై కేసు నమోదు అయింది. ఈ కేసు విషయంలో సోషల్ మీడియాలో చేసిన కామెంట్స్ కారణంగా ఆయనపై క్రమశిక్షణా చర్యలు కూడా తీసుకున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఆయనకు ఎక్కడా పోస్టింగ్ రాలేదు. రఘురామకృష్ణరాజుపై కస్టోడియల్ టార్చర్ కేసులో ఆయన కీలక పాత్రధారి అని ఫిర్యాదు దారు, డిప్యూటీ స్పీకర్ రఘురామ ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం రఘురామ పై కస్టోడియల్ టార్చర్ కేసులో అరెస్టు అయిన మాజీ ఓఎస్డీ విజయ్ పాల్, కామేపల్లి తులసీబాబు అనే వ్యక్తులు ఇద్దరూ సునీల్ కు సన్నిహితులని చెబుతున్నారు. కామేపల్లి తులసిబాబు సీఐడీకి లీగల్ అడ్వయిజర్ గా..సునీల్ నియమించారని ఆయనను అడ్డం పెట్టుకుని దందాలు చేశారని అంటున్నారు. తనను అరెస్టు చేసిన రోజున సీఐడీ ఆఫీసులో తనపై కూర్చుని.. తనకు ఊపిరి ఆడకుండా చేసి చంపే ఎ÷-లాన్ చశారని దానికి పీవీ సునీలే కారణమని రఘురామ ఆరోపిస్తున్నారు. అదే సమయంలో తులసీబాబును అడ్డం పెట్టుకుని అగ్రిగోల్డ్ కు బాధితులకు అందాల్సిన సొమ్మును పక్కదోవ పట్టించి దోచుకున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ అంశంపై ఇప్పటికే నివేదిక రెడీ అయినట్లుగా చెబుతున్నారు. అలాగే సునీల్ కుమార్ సర్వీసులో ఉంటూనే ఓ మతపరమైన సంస్థను నడుపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆయన హిందూత్వంపై గతంలో చేసిన వ్యాఖ్యల వీడియో వైరల్ అయింది. మత మార్పిళ్లకు పాల్పడుతున్నారని కొన్ని సంస్థలు కేంద్రానికి ఫిర్యాదు చేశాయి. పలుమార్లు కేంద్ర హోంశాఖ నుంచి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రానికి లేఖలు వచ్చాయి.

# మంచు బ్రదర్స్ ట్వీట్ వార్



హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, జనవరి17 : మంచు బ్రదర్స్ మరోసారి మీడియాకెక్కారు. సోషల్ మీడియా వేదికగా ఒకరినొకరు తిట్టుకున్నారు. ముందుగా మంచు విష్ణు ఎక్స్(ట్విట్టర్)లో ఓ సినిమా డైలాగ్ ను ట్వీట్ చేశాడు. పరోక్షంగా తననే అన్నట్లు భావించిన మనోజ్.. వెంటనే ఎక్స్ లో మరో కౌంటర్ ట్వీట్ పడేశాడు. అసలు వీరిద్దరు ఎక్స్ వేదికగా ఏమని తిట్టుకున్నారో చూద్దాం..ముందుగా ట్వీట్ వార్ ను మంచు విష్ణు స్టార్ట్ చేశాడు. 'సింహం అవ్వాలని ప్రతి కుక్కకు ఉంటుంది.. కానీ వీధిలో మొరగటానికి, అడవిలో గర్జించడానికి ఉన్న తేడా కనీసం వచ్చే జన్మలోనైనా తెలుసుకుంటావు' అని తన తండ్రి 'రౌడీ' సినిమాలోని డైలాగ్ ను ట్వీట్ చేశాడు. సోషల్ మీడియా లో ఈ ట్వీట్ మంచు మనోజ్ ను ఉద్దేశించే విష్ణు చేశాడని చర్చ జరుగుతోంది. విష్ణు ట్వీట్ చేసిన కాసేపటికే మనోజ్ మరో ట్వీట్ చేయడం సోషల్ మీడయాలో హీట్ పెంచింది. 'కన్నప్పలో రెబల్ స్టార్ కృష్ణం రాజు గారి లాగా సింహం అవ్వాలని ప్రతి ఫ్రాడ్ కుక్కకి ఉంటుంది, ఈ విషయం నువ్వు ఇదే జన్మలో తెలుసుకుంటావ్' అని మనోజ్ కౌంటర్ ట్వీట్ పోస్ట్ చేశాడు.

# మేనకోడలితో శారీరక సంబంధం

బెంగళూరు, యదార్థవాది ప్రతినిధి, జనవరి 17: బెంగళూరులో దారుణం జరిగింది. ప్రైవేట్ ఫోటోలు, వీడియోలు లీక్ చేస్తానని సొంత మేనమామ బ్లాక్ మెయిల్ చేయడంతో సాఫ్ట్ వేర్ ఉద్యోగిని(24) హోటల్ గదిలోనే నిప్పంటించుకుంది. జనవరి 12న ఈ ఘటన జరగ్గా 16న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం 24 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సుహాసి సింగ్ ఆరేళ్లుగా ఆమె తన మామ(ప్రవీణ్), అత్తతో కలిసి ఐఖీ పురంలోని ప్యారడైజ్ అపార్ట్‌మెంట్‌లో ఉంటోంది. కాలక్రమేణా సుహాసీ సింగ్ తన మేనమామ ప్రవీణ్ ఇద్దరూ తరచుగా కలిసి ప్రయాణించేవారు. ఈ క్రమంలో మేనమామ ప్రవీణ్ తో శారీరకంగా దగ్గరైంది. అయితే ఇద్దరు ఏకాంతంగా ఉన్న ప్పుడు ఆమెకు తెలియకుండా ప్రవీణ్ ఫోటోలు, వీడియోలు తీసి పెన్ డ్రైవ్ లో సేవ్ చేశాడు. అయితే కొన్ని రోజుల తర్వాత సుహాసి సింగ్ ప్రవీణ్ ను దూరం పెట్టింది. సుహాసీ వేరే వ్యక్తితో క్లోజ్ గా ఉంటున్న విషయాన్ని ప్రవీణ్ తెలుసుకున్నారు.ఆమె వాట్సప్ లో చాటింగ్ కూడా చదివాడు. ఇవన్నీ తెలిసి కూడా తనతో సంబంధం కొనసాగించాలని తన మేనకోడలు సుహాసి సింగ్ పై ఒత్తిడి తెచ్చాడు. ఐటీపీఎల్ మెయిన్ రోడ్డులో తాను బుక్ చేసుకున్న హోటల్ గదిలో సుహాసిని కలవాలని డిమాండ్ చేశాడు. రాకపోతే తనతో సన్నిహితంగా ఉన్న ఫోటోలు, వీడియోలను తన ఆమె తల్లిదండ్రులకు పంపిస్తానని బెదిరించాడు. దీంతో సుహాసి ఒక బాటిల్ లో పెట్రోల్ తీసుకుని హోటల్ గదికి వెళ్లింది. శారీరకంగా కలవాలని ఒత్తిడి తేవడంతో హోటల్ గదిలోనే తనను తాను నిప్పంటించుకుంది. ప్రవీణ్ ఆమెను బాత్రూమ్‌కి తీసుకెళ్లి షవర్ ఆన్ చేసి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించాడు.. కానీ అప్పటికే సుహాసికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను విక్టోరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు జనవరి 12న రాత్రి 10 గంటల సమయంలో మృతి చెందింది. నిందితుడు ప్రవీణ్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి దగ్గరి నుంచి మొబైల్, పెన్ డ్రైవ్ ను స్వాధీనం చేసుకున్నామని వైట్‌ఫీల్డ్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ శివకుమార్ గునార్ తెలిపారు. హెచ్ఏఎల్ పోలీస్ స్టేషన్‌లో బీఎన్ఎస్ సెక్షన్ల కింద ప్రవీణ్ అతని భార్యపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని చెప్పారు పోలీసులు.

# సెంటిమెంట్ దెబ్బ

## నష్టాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు



ముంబై, యదార్థవాది ప్రతినిధి, జనవరి 17 : దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. వరుసగా మూడు రోజుల పాటు లాభాలు చవిచూసిన సూచీలు.. ఐటీ, బ్యాంకింగ్ షేర్ల రూపంలో అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. మరికొన్ని రోజుల్లో ట్రంప్ అధికార పగ్గాలు చేపట్టనుండడం, అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు పెరుగుదల, విదేశీ మదుపర్ల అమ్మకాలు కొనసాగుతుండడం వంటివి సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఓ దశలో సెన్సెక్స్ 700 పాయింట్ల మేర నష్టపోగా.. తర్వాత కాస్త కోలుకుంది. నిఫ్టీ 23,200 స్థాయికి చేరింది. సెన్సెక్స్ ఉదయం 77,069.19 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 76,263.29 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 423.49 పాయింట్ల నష్టంతో 76,619.33 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 108.60 పాయింట్ల నష్టంతో 23,203.20 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.61 వద్ద ఎ÷-లాట్‌గా ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో గురువారం ఫలితాలు ప్రకటించిన ఇన్ఫోసిస్ అత్యధికంగా 6 శాతం మేర నష్టపోయింది. బలహీన త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన యాక్సిస్ బ్యాంక్ సైతం 5 శాతం మేర క్షీణించింది. దీని ప్రభావం ఇతర బ్యాంక్ షేర్లపైనా పడింది. కోటక్ మహీంద్రా బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, టీసీఎస్ సైతం నష్టాల్లో ముగిశాయి. జొమాటో, రిలయన్స్, నెస్లే ఇండియా, టాటా స్టీల్, ఏషియన్ పెయింట్స్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 81 డాలర్ల ఎగువన ట్రేడవుతుండగా.. బంగారం సైతం 2730 డాలర్ల వద్ద కొనసాగుతోంది.



## సుభాష్ చంద్రబోస్..

సిద్దిపేట, యదార్థవాది ప్రతినిధి, జనవరి 17 : సిద్దిపేట జిల్లా పెద్ద కోడూరు గ్రామ శివారులో ఉన్న సిఏఆర్ హెడ్ క్వార్టర్ లో ఏఆర్ అధికారులు సిబ్బంది, హెూంగార్డ్స్ కు సోషల్ మీడియా, ఆన్లైన్ బెట్టింగ్, ఆన్లైన్ గేమ్స్ తదితర అంశాల గురించి ఏఆర్ అడిషనల్ డీసీపీలు రామచంద్రరావు, సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏసిపి శ్రీనివాస్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ ఆర్ అడిషనల్ డీసీపీ రామచంద్రరావు మాట్లాడుతూ ఇంట్రాక్టివ్ సెషన్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఎంతో కష్టపడితే తప్ప ఈ రోజుల్లో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించడం చాలా కష్టం కష్టపడి సాధించుకున్న ఉద్యోగానికి సార్ధకత చేకూరే విధంగా క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. డిపార్ట్మెంట్లో క్రమశిక్షణ చాలా ముఖ్యమని తెలిపారు. ఆన్లైన్ గేమ్స్ ఆన్లైన్ బెట్టింగ్ ఆడి కుటుంబాన్ని రోడ్డున పడవేయొద్దని, డబ్బులు పోయిన తర్వాత మనిషి శారీరకంగా మానసికంగా కృంగిపోయి ఏం చేస్తున్నాడో విచక్షణ జ్ఞానం కోల్పోతాడని తెలిపారు. సెల్ఫోన్ ఉపయోగం చాలా ముఖ్యం సెల్ఫోన్ ను మంచి గురించి వినియోగించుకోవాలని సూచించారు. మనిషి స్వీయ నియంత్రణ కోల్పో వద్దని తెలిపారు, మన పైన మన భార్య పిల్లలు తల్లిదండ్రులు ఆధారపడి జీవిస్తున్నారు వారిని దృష్టిలో పెట్టుకుని విధులు నిర్వహించాలని తెలిపారు. క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తే డిపార్ట్మెంట్లో తప్పక గుర్తింపు ఉంటుందని తెలిపారు. క్రమశిక్షణ తప్పిన వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ పాటించాలన్నారు. తల్లిదండ్రులను కుటుంబాన్ని విధి నిర్వహణను సమానంగా చూసుకొని బ్యాలెన్స్ జీవితం గడపాలన్నారు. మనం మన కుటుంబం మన పిల్లలు సంతోషంగా జీవించడం చాలా ముఖ్యమన్నారు. మానవ జీవితంలో నలుగురు మెచ్చుకునేలా జీవించాలని, ఉద్యోగం సాధించడానికి ఎంతో కష్టపడి చిన్నప్పటినుండి చదువుకొని ఎంతో కష్టపడితే తప్ప ఈ ఉద్యోగం రాదన్నారు. ఎన్నో పరీక్షలలో నెగ్గిన తర్వాత ఉద్యోగం సాధించిన విషయం ప్రతి ఒక్కరికి తెలుసన్నారు. శిక్షణా కాలంలో మనసు శరీరం మైండ్ ఏకం చేసి మనకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పోలీస్ డిపార్ట్మెంట్లో క్రమశిక్షణకు పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. విధినిర్వహణలో కానీ జీవితంలో కానీ క్రమశిక్షణ తప్పితే జీవితం ఎలా మారుతుందో సమాజంలో ఎన్నో ఉదాహరణలు ఉన్నాయన్నారు. క్రమశిక్షణకు మారుపేరుగా పోలీస్ డిపార్ట్మెంట్ నిలుస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ రోల్ మోడల్ గా నలుగురికి ఆదర్శంగా జీవించాలని సూచించారు. తల్లిదండ్రులను భార్య పిల్లలను గురువులను ఎప్పుడూ ప్రేమించాలన్నారు. టెక్నాలజీ మంచి గురించి వినియోగించుకోవాలని తెలిపారు. మంచి చెడులు మన మనసుపై ఆధారపడి ఉంటాయని మనసును నిలకడగా ఉంచుకొని మంచి వైపు ప్రయాణించి నలుగురిలో ఆదర్శంగా ఉండాలని సూచించారు. జీవితం విలువ డబ్బు విలువ ప్రతి ఒక్కరికి తెలిసి ఉండాలన్నారు. టెక్నాలజీ మంచి గురించి వాడుకోవాలన్నారు. చిన్నప్పటినుండి అందరూ కష్టపడి చదివి ఉద్యోగం సాధించుకున్నామని గుర్తెరిగి ముందుకు సాగాలన్నారు. ఉద్యోగం రాకముందు మన జీవించిన జీవితం మనం కష్టపడ్డ ప్రతిక్షణం రోజుకు ఒకసారి ఆలోచించుకోవాలన్నారు. విధి నిర్వహణను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. ఈ రోజుల్లో ఒక్క సెల్ ఫోన్ నెంబర్ తో మనిషి యొక్క జాతకం మొత్తం బయటపడుతుందన్నారు. సెల్ఫోన్ ద్వారా ఏం చేస్తున్నాడు ఏం చూస్తున్నాడు ఎలా ప్రవర్తిస్తున్నాడు ప్రయాణిస్తుందన్న విషయాలు వెంటనే తెలుసుకోవచ్చన్నారు. టెక్నాలజీ తో స్కిల్ డెవలప్మెంట్ చేసుకొని బాగా చదువుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించే దిశగా ప్రయాణించాలని సూచించారు. పిల్లలను కష్టపడి చదివించి ఐఏఎస్ లు ఐపీఎస్ లు సాధించిన వారు ఉన్నారన్నారు, ఆస్ట్రేలియా అమెరికా ఇతర దేశాలలో ఎంతోమంది కానిస్టేబుల్ కొడుకులు కూతుర్లు ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. అందరం ఒక కుటుంబం లాగా విధి నిర్వహించి జిల్లాకు మంచి పేరు తీసుకుని రావాలని సూచించారు. పిల్లలను ఉన్నతంగా చదివించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. విధి నిర్వహణలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఉన్నత అధికారులకు వెంటనే తెలియపరచాలని సూచించారు. ఆవేశంతో అనాలోచిత నిర్ణయాలు తీసుకోవద్దని జీవితాలు పాడు చేసుకోవద్దని సూచించారు. క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తున్న అధికారులకు సిబ్బందికి అవార్డులు రివార్డులు అందజేస్తామని తెలిపినారు. పోలీస్ ఉద్యోగ రిత్యా ఒత్తిడి వుంటుంది కాబట్టి ఆరోగ్యంగా ఉండడానికి సిబ్బంది ప్రతిరోజూ రన్నింగ్, వాకింగ్, యోగా, సైక్లింగ్ చేయాలని, సూచించారు. సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏసిపి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈజీ మనీకి అలవాటు పడవద్దని సూచించారు, ఏదైనా కస్టమర్ కేర్ నెంబర్ గురించి కానీ వివరాల గురించి కానీ గూగుల్లోసెర్చ్ చేయవద్దని తెలిపారు. క్రెడిట్ కార్డు ఆధార్ కార్డ్ అప్డేట్ గురించి వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని సూచించారు. బ్యాంకు అవసరాల గురించి నేరుగా బ్యాంకుకు వెళ్లి సమస్యను పరిష్కరించుకోవాలని తెలిపారు. ఆధార్ అప్డేట్ ఉంటే ఆధార్ కేంద్రాలకు వెళ్లాలని తెలిపారు. ఆన్లైన్ గేమ్స్ ఆన్లైన్ బెట్టింగ్ సెల్ ఫోన్లో డౌన్లోడ్ చేసుకుని ఆడుతూ డబ్బులు పోగొట్టుకొని జీవితాలు నాశనం చేసుకోవద్దని తెలిపారు. ఈరోజుల్లో చాలామంది యువకులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు చివరకు ఇన్వెస్టిగేషన్లో తేలింది ఏందంటే ఆన్లైన్ బెట్టింగ్ గేమ్స్ ఆడటం వల్ల డబ్బులు పోగొట్టుకొని ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలుస్తుంది. ఆన్లైన్ బెట్టింగ్ ఆన్లైన్ గేమ్స్ ద్వారా డబ్బులు పోయినప్పుడు మానసికంగా శారీరకంగా చాలా మనోవేదనకు గురై ఏం చేస్తున్నామో ఎవరికీ అర్థం కాని పరిస్థితుల్లో ఉంటుందని అందువల్ల వాటి తెరువు వెళ్లవద్దని తెలిపారు. ఈజీ డబ్బులకు అలవాటు పడవద్దని సూచించారు. ఆన్లైన్లో చూసే యాడ్స్ బెట్టింగ్ గేమ్స్ లో డబ్బులు పెట్టి మోసపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు చాలామంది ఉన్నారని తెలిపారు. మన డిపార్ట్మెంట్లో కూడా సైబర్ క్రైమ్ లో డబ్బులు పోగొట్టుకున్న వారు ఉన్నారని తెలిపారు. డెబిట్ కార్డ్, క్రెడిట్ కార్డ్, ఆధార్, ఎప్పుడు ఆన్లైన్లో అప్డేట్ చేసుకోవద్దని నేరుగా బ్యాంకులకు ఆధార్ కేంద్రాలకు వెళ్లి చేసుకోవాలని సూచించారు. ఉచితంగా డబ్బులు ఎప్పుడూ ఎవ్వరు కూడా ఇవ్వరు అనే విషయాన్ని గుర్తుతెరిగి నడుచుకోవాలని తెలిపారు. ఒక్క ఫోన్ నెంబర్ తో మీరు ఏం చేస్తున్నారు? ఏ గేమ్స్ ఆడుతున్నారు ఎక్కడికి వెళుచున్నారు మొత్తం తెలుసుకోవచ్చని సూచించారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించి డిపార్ట్మెంట్ కు మంచి పేరు తీసుకుని రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్,రిజర్వ్ ఇన్స్పెక్టర్లు పూర్ణ చందర్, ధరణి కుమార్, రాజేష్, కార్తీక్, ఆర్ఎస్ఐలు ఏఆర్ సిబ్బంది, హెూంగార్డులు తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట, యదార్థవాది ప్రతినిధి, జనవరి 17 : జనవరి 26 నుండి వ్యవసాయ యోగ్యమైన భూములు రైతు భరోసా, భూమిలేని ఉపాధి కూలీలకు 12 వేలు ఇస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా పట్టణంలోని నాఫెడ్, టిజి మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ లో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట మార్కెట్ లో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభ చేసుకున్నమని, కందుల మద్దతు ధర 7550 రూపాయలతో ప్రభుత్వం కందుల కొనుగోలు చేస్తుందని, రైతులు కందులను మద్దతు ధరకు అమ్ముకోవాలని, గతంలో వడ్లు, పత్తి, సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలు సమర్థ వంతంగా చేశాం.. వడ్ల కొనుగోలు చేసిన 48 గంటలలో పేమెంట్ చేశాం..సన్న వడ్ల కు 500 బోనస్ ఇచ్చామని అన్నారు. ప్రజా ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో ప్రతి నియోజ కవర్గానికి 3500 ఇళ్ళు మంత్రి తెలిపారు. జనవరి 26 నుండి వ్యవసాయ యోగ్యమైన భూములు రైతు భరోసా, భూమిలేని ఉపాధి కూలీలకు 12 వేలు ఇస్తున్నామని త్వరలోనే వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇక్కడ పర్యటించి అయిల్ ఫాం సాగు పై రైతులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. జిల్లా కలెక్టర్ మను చౌదరి, అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, ఆర్డీవో సదానందం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ వెంకటయ్య ఇతర అధికారులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దగట్టు చైర్మన్ కు సన్మానం

సూర్యాపేట, యదార్థవాది ప్రతినిధి, జనవరి 17 : పెద్దగట్టు చైర్మన్ పోలబోయిన నర్సయ్య యాదవ్ ను పబ్లిక్ క్లబ్ ఇసి మెంబర్ రాచకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రములో రెండవ అతిపెద్ద జాతర జరిగే పెద్దగట్టు లింగమంతుల దేవాలయం చైర్మన్ గా పోలబోయిన నర్సయ్య యాదవ్ నియామకానికి సహకరించిన మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డి, ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి, పిసిసి సభ్యులు పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, డిసిసి అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్ లకు ధన్యవాదములు తెలిపారు. పెద్దగట్టు చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా పోలబోయిన నర్సయ్య యాదవ్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. లక్షలాది మంది భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాతర ప్రశాంతగా జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ సీనియర్ నాయకులు కలకోట లక్ష్మయ్య, బిక్కుమళ్ల కృష్ణ, పబ్బతి వేణుమాధవ్, వెంపటి శభరినాథ్, గుండా శ్రీధర్ , బి మిట్టపల్లి రమేష్, బిలిదే శ్రీనివాస్, తెరటపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డిపేట్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

### - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



సిరిసిల్ల, యదార్థవాది ప్రతినిధి, జనవరి 17 : పోలీస్ అధికారులు స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న, నమోదైన కేసుల విషయంలో అలసత్వం విడనాడాలని సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డిపేట్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసి స్టేషన్ పరిసరాలను, స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న, నమోదైన కేసుల వివారలు స్టేషన్ రికార్డ్ లను తనిఖీ చేసి కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల పట్ల తక్షణమే స్పందించాలని,ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని ఎస్పీ సూచించారు. బ్లూ కోల్ట్ , పెట్రో కార్ సిబ్బంది 100 డయల్ కాల్స్ కి తక్షణమే స్పందిస్తూ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. పెట్రోలింగ్ సమయంలో పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను ప్రతి రోజు తనిఖీ చేయాలని, స్టేషన్ పరిధిలో సీసీటీవీల ఏర్పాటుపై దృష్టి సారించి సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా అధికారులు, విలేజ్ పోలీస్ అధికారులు తరచు గ్రామాలు పర్యటిస్తూ ప్రజలతో మమేకం అవుతు ప్రజలకు చట్టాల మీద,డయల్100, షీ టీమ్స్, సైబర్ నేరాలు,ట్రాఫిక్ నియమాలు తదితర అంశాల మీద అవగాహన కల్పించాలని అన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది అందరి కృషి చేయాలని సిబ్బంది, అధికారులు అందరూ విధులు సక్రమంగా విధులు నిర్వహించడం ద్వారానే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని సూచించారు. పోలీసుల గురించి ప్రజల అభిప్రాయాలను సేకరించడం కోసం తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ప్రారంభించిన క్యూఆర్ కోడ్ ఆఫ్ సిటిజెన్ ని జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్లలో ఏర్పాటు చేయడం జరిగిందని, ఇట్టి క్యూఆర్ కోడ్ ని స్కాన్ చేసి పిటిషన్, ఎఫ్ఐఆర్, ఇ-చలాన్, పాస్పోర్ట్ ధృవీకరణ పోలీస్ స్టేషన్ కి వెళ్ళినప్పుడు పోలీసు అధికారుల, సిబ్బంది ప్రతిస్పందన ప్రవర్తనపై ప్రజలు, బాదితులు సద్వినియోగం చేసుకోని పోలీస్ సేవలపై సలహాలు సూచనలు ఇవ్వాలని సూచించారు. ఈ తనిఖీలో సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ రమాకాంత్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమిదం

### -టిఎస్ జెఎ ఆధ్వర్యంలో శాంతి దీక్ష

### -మద్దతుగా నిలిచినా పలువురు సీనియర్ పాత్రికేయులు




సూర్యాపేట, యదార్థవాది ప్రతినిధి, జనవరి 17 : జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించే వరకు తమ ఉద్యమాలను విడతలవారిగా కొనసాగిస్తామని పోరాటాల పురిటిగడ్డ సూర్యాపేట జిల్లా కేంద్రంలో జర్నలిస్టు భవనం ఏర్పాటు ప్రక్రియ వెంటనే చేపట్టాలని, జిల్లా కేంద్రానికి చెందిన పలువురు సీనియర్ జర్నలిస్టు లు తెలిపారు. తెలంగాణ స్టేట్ జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక వాణిజ్య భవన్ సెంటర్ లో నిర్వహించిన శాంతిదీక్ష కార్యక్రమానికి మద్దతును ఇచ్చి సంఘీభావం ప్రకటించిన అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు లో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించిన సంగతి పాలకులు మరచిపోవద్దని అన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు ఉచితంగా సేవ చేస్తున్న జర్నలిస్టు లను విస్మరించి పాలకులు మాత్రం లబ్ది పొందుతున్నారని అన్నారు. జర్నలిస్టు లకు కనీస వేతనాలు, కొత్త వారికి అక్రిడేషన్ లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. వర్కుంగ్ జర్నలిస్టులు అందరికి ఎటువంటి ఆంక్షలు లేకుండా ఇంటి స్థలాలు ఇచ్చి, పక్కా ఇల్లు నిర్మాణం చేపట్టి ఇవ్వాలని తెలిపారు. జర్నలిస్టు భవనాలు లేకపోవడం వలన ప్రస్తుతం జర్నలిస్టలు రోడ్ల మీద గడిపే దయనీయమైన పరిస్థితి దాపురించిందని అన్నారు. అన్ని ప్రైవేటు ఆసుపత్రులలో చెల్లుబాటు అయ్యే విధంగా జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంకా తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్నారు. యూనియన్ లకు అతీతంగా జర్నలిస్టుల సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేపడతామని అన్నారు. తమ పిలుపును అందుకుని యూనియన్ లకు అతీతంగా వచ్చి శాంతి దీక్షకు మద్దతు ఇచ్చిన జర్నలిస్టలు అందరికి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కందుకూరి యాదగిరి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు గుండా శ్రీనివాస్ గుప్త, బంటు కృష్ణ, బూపతి రాములు, వేణుమాధవ్, పి. సైదిరెడ్డి, తొలిదశ ఉద్యమకారులు బొమ్మడి లక్ష్మినారాయణ, కొండ శ్రీనివాసరావు, బచ్చు పురుషోత్తం, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, మల్లికార్జున్, పల్లె మణిబాబు, కొండ్లె క్రిష్ణయ్య, జలగం మల్లేష్, గట్టు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీమంత్రి పొన్నాల నివాసంలో చోరీ

### ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, జనవరి17 : మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఫిలింనగర్‌లోని పొన్నాల ఇంట్లో లక్షన్నర నగదుతో పాటు భారీగా అభరణాలు అపహరణకు గురయ్యాయి. పొన్నాల సతీమణి అరుణా దేవి ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు. పొన్నాల ఇంటి పరిసరాల్లోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. అయితే ఈ చోరీ విషయం కాస్త ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సంఘటన జరిగిన సమయంలో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, కుటుంబసభ్యులు ఎవరూ ఇంట్లో లేదని తెలుస్తోంది. దొంగతనం జరిగిన రోజున పొన్నాల జనగాం జిల్లాలో ఉన్నట్లు సమాచారం. ఈ సంఘటనపై ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

## బాలల, మానసిక వికలాంగుల పరిరక్షణకు కృషి చేయాలి

సూర్యాపేట, యదార్థవాది ప్రతినిధి, జనవరి 17 : బాలల హక్కు ల పరిరక్షణ కొరకు న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోవర్ధన్ రెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యాలయంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన సభికులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల, బాలికలు మరియు మనో వైకల్యం ఉన్న బాలలకు కూడా హక్కులు ఉంటాయని మానసిక వికలాంగుల రక్షణకు ఎవరైనా విఘాతం కలిగిస్తే వెంటనే జిల్లా న్యాయ సేవా సంస్థ ను ఆశ్రయించాలని కోరారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి పి. శ్రీవాణి గారు మాట్లాడుతూ ప్రజలలో న్యాయ పరిజ్ఞానాన్ని పెంపొందించడం కొరకు జిల్లాలోని అనేక ప్రాంతాలలో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. బాల, బాలికల హక్కుల పరిరక్షణ కొరకు తమ సంస్థ ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ మెంబర్స్ సత్యనారాయణ పిళ్లే, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ బొల్లెద్దు వెంకటరత్నం, డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ బి. రవికుమార్, సి.డబ్ల్యు.సి. చైర్మన్ రమణారావు, జే.జే.బి. మెంబర్ జి. మోహన్ రావు, సైకియాట్రిస్ట్ డాక్టర్ ఎన్ .స్రవంతి, ఎన్. యాదగిరి ప్రిన్సిపల్ అరోరా లా కాలేజ్ , నల్గొండ, టూ టౌన్ ఎస్ఐ ఆంజనేయులు, తదితరులు వివిధ చట్టాల ద్వారా మైనర్ బాల బాలికలకు మరియు మానసిక వికలాంగుల కొరకు రూపొందించిన కమిటీ మెంబర్లకు అనేక హక్కులను వివరిస్తూ పారా లీగల్ వాలంటీర్లు, పానెల్ న్యాయవాదులకు ఆయా చట్టాలలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జ్యుడీషియల్ ఆఫీసర్ నరసింహ చారి, ప్యానల్ న్యాయవాదులు, లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ మెంబర్స్, పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ, యదార్థవాది ప్రతినిధి, జనవరి, 17 : గ్రామ కమిటీల ద్వారానే అభివృద్ధి సాధ్యమని దానికి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మెల్యే చేపట్టిన మన ఊరు మన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని శుక్రవారం మాడుగులపల్లి మండలంలోని పాములపాడు గ్రామంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఇస్తున్న పథకాలను, సంక్షేమ ఫలాలను నిరుపేదలకు , అసలైన లబ్ధిదారులకు అందించాల న్నారు. గ్రామాల్లో ప్రజలను, నాయకులను కలసి గ్రామ సమస్యలు తెలుసుకున్నారు.ఇప్పటి వరకు అందించిన సంక్షేమ పథకాలతో పాటు జనవరి 26 నుంచి అమలు చేస్తున్న రైతు భరోసా,రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు. పథకాలను,ప్రతిఒక్కరికీ అందించే లక్ష్యంగా , కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని అన్నారు. తెలంగాణలో కొనసాగుతున్న ప్రజా పాలనలో అనే లక్ష్యంతో, గతంలో జరిగిన పొరపాట్లను మరలా జరగకుండా ఉండాలన్న ఉద్దేశంతో నిర్వహిస్తున్న కార్యక్రమమే నన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల అభివృద్ధి పోస్టర్ ఆవిష్కరించారు.ప్రతీ గ్రామానికి వెళ్ళి కాంగ్రెస్ పార్టీ సంక్షేమాలను ప్రజలకు నేరుగా అందించడంతో పాటు చేస్తున్న అభివృద్ధిని వివరించాలన్నారు.ప్రతీ గ్రామంలో రిటైర్ ఉద్యోగులు, సీనియర్ నాయకులు, యువత, గ్రామ సమస్యలు, అభివృద్ధి పై అవగాహన ఉన్న కార్యకర్తలతో కలిపి గెలిచి ఈ స్థానంలో ఉన్నానన్నారు. అనంతరం మండల పరిధిలోని పాముల పాడు, చిరుమర్తి, చర్ల గూడెం, ఆగా మోత్కూర్, కల్వల పాలెం, బొమ్మకల్, గండ్రవాని గూడెం, కుక్కడం గ్రామాలలో. మండల వ్యాప్తంగా, 89 మందికి కళ్యాణ లక్ష్మి చెక్కులను అందచేసినట్లు, దాదాపు యనభై తొమ్మిది లక్షల పదివేల రూపాయలను పంపిణి చేసినట్లు తహసీల్దార్ శ్రీరామ్ సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్ రెడ్డి,మండల ఎమ్ పి డి ఓ తిరుమల స్వామి, ఏ ఈ లు, పంచాయతీ కార్యదర్శి లు, కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ యూత్ ప్రెసిడెంట్ చింత కాయల సురేష్,మీనా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,చింత కాయల సతీష్, మోహన్ రెడ్డి, అందెం యాదయ్య, వళ్ళోజు ప్రసాద్, భూపతి ఊషయ్య, చింత కుంట్ల శ్రీనివాస్ రెడ్డి, ఆర్ సి రెడ్డి, బట్టు మాధవ రెడ్డి, బొడ్డు బాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 3053 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్ ,గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 111, విద్యుత్ శాఖ కు సంబంధించి 100, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 55, ఇందిరమ్మ ఇండ్ల పథకం కోసం 2691 దరఖాస్తులు వచ్చాయి, ఇతర శాఖలకు సంబంధించి 96 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్.చిన్నారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్ కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.





మనకొండూర్ యదార్థవాది ప్రతినిధి, జనవరి 17 : రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26వ తేదీ నుంచి అమలు చేయనున్న పథకాలకు అర్హుల గుర్తింపు కోసం సర్వేను పకడ్బందీగా చేయాలని అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలో పాటు జంగారెడ్డి పల్లె, అనంతారంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శుక్రవారం ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నూతన రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇండ్లకు స్వయంగా వెళ్లి పరిశీలించి వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతు భరోసా పథకం పంపిణీ కోసం కొనసాగుతున్న సర్వేను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 26న నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల పథకాలు, నూతన రేషన్ కార్డుల జారీ చేసేందుకు ఇప్పటికే కార్యాచరణ, ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఆయా పథకాలు సంబంధించి గ్రామాల్లో సర్వేను పొరపాట్లు జరగకుండా బాధ్యతాయుతంగా పకడ్బందీగా చేయాలని అర్హులను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలోని పి హెచ్ సి ని కలెక్టర్ తనిఖీ చేశారు. అక్కడ అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. నూతన దవాఖాన నిర్మించే దాకా ప్రజలకు ఇబ్బంది కలగకుండా వైద్య సేవలను స్థానిక పల్లె దవాఖానలో అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత, ఎంపీడీఓ శశి కళ, తహసిల్దార్ ఫరూఖీద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనల ప్రకారం ఇసుక రవాణా

## -జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ



సిరిసిల్ల, యదార్థవాది ప్రతినిధి, జనవరి 17 : జిల్లాలో ప్రభుత్వ నిబంధనలు అనుసరించి మాత్రమే ఇసుక రవాణా జరిగే విధంగా అధికారులు పకడ్బందీ పర్యవేక్షణ ఉంచాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఇసుక రవాణ పై అధికారులతో జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాలో మానేరు నది పై మొత్తం 6 ఇసుక రీచ్లకు అవకాశం ఉందని అన్నారు. ముస్తాబాద్ మండలం కొండాపూర్ వద్ద 2 రీచ్, ఎల్లారెడ్డిపేట మండలం పదిర వద్ద 1, సిరిసిల్ల మండలం సర్దాపూర్ వద్ద 1, తంగలపల్లి మండలం చింతపల్లి వద్ద 1, మందపల్లి వద్ద 1 ఉన్నాయని అన్నారు. కాళేశ్వరం ప్యాకేజీ 17 కేనాల్ లైనింగ్ పనులను పరిశీలించి సమర్పించిన నివేదిక వివరాలను పరిశీలించి 35 వేల క్యూబిక్ మీటర్ల ఇసుక ను సిరిసిల్ల మండలం పెద్దాపూర్ గ్రామం, తంగళ్ళపల్లి మండలం ఓబులాపూర్ గ్రామంలోనే చెక్ డాం ముంపు ప్రాంతం నుంచి తరలించేందుకు అనుమతి అందించాలని కలెక్టర్ తెలిపారు. సిరిసిల్ల జిల్లాలో నూతనంగా నిర్మించే ప్రభుత్వ ప్రాజెక్టులు, ఇందిరమ్మ ఇండ్ల, పెండింగ్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి ఎక్కడ ఇసుక కొరత రాకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామం వద్ద ఇసుక రీచ్ ఏర్పాటు పై ఇసుక కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు సంయుక్తంగా పరిశీలించి రెండు మూడు రోజుల్లో నివేదిక అందించాలని, అధికారులు నిబంధనల ప్రకారం నివేదిక అందించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో సిరిసిల్ల ఆర్డీవో వెంకట ఉపేందర్ రెడ్డి, మైనింగ్ అధికారి క్రాంతి కుమార్, డీ.ఆర్డీ.ఓ శేషాద్రి, జిల్లా ఇరిగేషన్ అధికారి అమరేందర్ రెడ్డి, సర్వే ఏడీ వినయ్ కుమార్, మిషన్ భగీరథ ఈఈ జానకి, సిరిసిల్ల తహసిల్దార్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రిజేష్ ట్రిబ్యునల్ ఉత్తర్వులను స్వాగతిస్తున్నాం

## ఇది ముమ్మాటికీ నాటి కెసిఆర్ ప్రభుత్వ విజయం

## ప్రకటనలో వెల్లడించిన మాజీమంత్రి హరీష్ రావు



సిద్దిపేట, యదార్థవాది ప్రతినిధి, జనవరి 17 : కృష్ణా జలాల పంపిణీపై బ్రిజేష్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలు.. ముమ్మాటికీ కేసీఆర్ ప్రభుత్వ విజయమే అని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. మొదటి నుంచి సెక్షన్ 3 ప్రకారం నీళ్ల కేటాయించాలని కేసీఆర్ పట్టుబట్టారని పేర్కొన్నారు. తాజాగా ట్రిబ్యునల్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను స్వాగతిస్తున్నామని హరీష్ రావు తన ప్రకటనలో తెలిపారు. దీన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఘనతగా చెప్పుకోవడం సిగ్గు చేటు అని విమర్శించారు. అసలు ఏపీ పునర్విభజన చట్టం, సెక్షన్ 89 తెచ్చిందే కేంద్రంలోని కాంగ్రెస్ సర్కార్ అని గుర్తు చేశారు హరీష్ రావు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిందే కాంగ్రెస్ అని విమర్శించారు. ఆ తప్పిదాన్ని సరిదిద్దేందుకు బీఆర్ఎస్‌కు పదేళ్ల కాలం పట్టిందన్నారు. కృష్ణా నదిలో న్యాయమైన వాటా దక్కే వరకు బీఆర్ఎస్ రాజీలేని పోరాటం చేస్తుందని హరీష్ రావు మరోసారి స్పష్టం చేశారు.కృష్ణా జలాల వివాదంపై బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ కీలక ఉత్తర్వులిచ్చింది. కేంద్ర ప్రభుత్వం 2023లో అంతర్రాష్ట్ర జల వివాద చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం జారీ చేసిన తదుపరి టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్‌పై మొదట రెండు రాష్ట్రాల వాదనలు వినాలని ట్రిబ్యునల్ నిర్ణయించింది. దీనిపై వాదనలు పూర్తయిన తరువాత ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 89 ప్రకారం తుది వాదనలు వింటామని ట్రిబ్యునల్ ధర్మాసనం పేర్కొంది. తదుపరి వాదనలను ఫిబ్రవరి 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరుగనున్నాయి. ట్రిబ్యునల్ ఉత్తర్వుల ప్రకారం.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించిన నీటిలో ఎవరి వాటా ఎంత అన్నదానిపై వాదనలు విన్న తర్వాతే ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపుల అంశాన్ని ట్రిబ్యునల్ చేపట్టనుంది.

# నేరేడ్‌మెట్ పరిధిలో డ్రగ్స్ స్వాధీనం

## నిందితులు రాజస్థాన్‌కు చెందిన వారుగా గుర్తింపు

## రాచకొండ కమిషనరేట్ సీపీ సుధీర్ బాబు వెల్లడి

హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, జనవరి17: నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు అంతరాష్ట్ర నిందితులను అరెస్టు చేశారు. నిందితుల నుంచి 190 గ్రాముల హెరాయిన్, ద్విచక్రవాహనం, మొబైల్స్ సహా ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ. 23 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. మీడియాకు రాచకొండ కమిషనరేట్ సీపీ సుధీర్ బాబు వివరాలు తెలిపారు. నిందితులు రాజస్థాన్‌కు చెందిన మహేష్, మహిపాల్‌గా గుర్తించినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో అధిక ధరలకు నిందితులు హెరాయిన్ విక్రయిస్తున్నారని అన్నారు. నిందితులు రాజస్థాన్‌కు చెందిన వారైనా నేరేడ్‌మెట్ పరిధిలో స్థిరపడ్డారని అన్నారు. వినియోగదారులకు డ్రగ్స్ చేరవేయడంలో వివిధ పద్ధతులు వాడుతున్నారన్నారు. నిందితులు గ్యాస్ సిలిండర్ రిపేర్లు చేసే వారిగా పనిచేస్తున్నారని తెలిపారు. గ్యాస్ రిపేర్‌కు సంబంధించిన పరికరాల్లో ప్యాక్ చేసి డ్రగ్స్ సరఫరా చేస్తున్నారని అన్నారు. గ్యాస్ సిలిండర్ వాల్వ్‌లలో ప్యాక్ చేసి విక్రయిస్తున్నారని తెలిపారు. అనుమానం రాకుండా ఇలాంటి టెక్నిక్స్ వాడుతున్నారని చెప్పారు. ఓలా, ఊబర్, రాపిడో సహా ఇతర మార్గాల ద్వారా వీటిని కస్టమర్లకు చేరవేస్తున్నారన్నారు. 200 గ్రాముల హెరాయిన్ లక్ష రూపాయలకు కొనుగోలు చేసి... దానిని దాదాపు రూ. 23 నుంచి 25 లక్షల వరకు విక్రయిస్తున్నారన్నారు. రాజస్థాన్‌కు చెందిన శంషుద్దీన్ అనే డ్రగ్ పెడ్లర్ నుంచి నిందితులు డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. 2024 నుంచి ఇప్పటి వరకు రాచకొండ పరిదిలో దాదాపు రూ. 88 కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్ చేశామని తెలిపారు. కమిషనరేట్ పరిధిలో డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు నిరంతరం కృషి చేస్తూనే ఉంటామని చెప్పారు. పిల్లలు, యువత ఇలాంటి మత్తు పదార్థాలకు బలికావద్దంటే... ప్రజల సహకారం కూడా కావాలని చెప్పారు. డ్రగ్స్ సమాచారం ఉంటే తమకు తెలియజేయాలని అన్నారు. వీటిపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కళాశాలల్లోకి వెళ్లి యాంటీ ర్యాగింగ్, డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. నిన్న జరిగిన కాల్పుల ఘటనకు సంబంధించి తమ కమిషనరేట్ పరిధిలోని పోలీసులు కూడా వారిని పట్టుకునేందుకు చర్యలు చేపట్టారని సీపీ సుధీర్ బాబు తెలిపారు.

# గ్రామ సభల్లో ప్రభుత్వాన్ని ఎండగట్టాలి

**-కోటి మంది ఉంటే, 6లక్షల కూలీల కె ఆత్మీయ భరోసా వర్తింపు..**

**-ఆత్మీయ భరోసా, రైతు కూలీలందరికీ అమలు అయ్యేలా చూడాలి..**

**- అర్హులైన వారందరికీ ఇల్లు మంజూరు చేపించేల చూడాలి..**

**-సిద్దిపేట పార్టీ శ్రేణులతో కాన్ఫరెన్స్ లో ఎమ్మెల్యే హరీష్ రావు..**



సిద్దిపేట, యదార్థవాది ప్రతినిధి, జనవరి 17 : కాంగ్రెస్ ప్రభుత్వం 4 విషయాల్లో ప్రజలను గోరంగా మోసం చేస్తుందని గ్రామ సభల్లో ప్రభుత్వాన్ని ఎండగట్టాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. సిద్దిపేట నియోజకవర్గం పార్టీ శ్రేణుల తో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్బంగా మాట్లాడుతు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం వచ్చి 13 నెలలో ప్రజలను మోసం చేస్తుందని ఇప్పటికే 6 గ్యారంటీ లు ఆటకెక్కించందని, ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డ్స్, ఇండ్ల విషయం లో గోరం గా మోసం చేస్తుందని, గ్రామాల్లో వీటి ఫై గ్రామ సభలు నిర్వహిస్తున్నారని ఈ గ్రామ సభల్లో పార్టీ శ్రేణులు పాల్గొని నిజమైన, అర్హులైన పేదలకు రైతులకు న్యాయం జరిగేలా చూడాలని, ప్రజలకు ఇచ్చిన హామీల అమలు ఫై నిలదీయాలని, ఆత్మీయ భరోసా పేరు మీద రైతు లను ప్రభుత్వం మోసం చేస్తుందని, ఆత్మీయ భరోసా పథకాన్ని కోతలు విధించకుండా అమలుచేయాలని, రాష్ట్రంలో 50 లక్షల ఈజీఎస్ కార్డులు ఉంటే కోటి రెండు లక్షల మంది ఉపాధి హామీ కూలీలుగా పనిచేస్తున్నారని, సిద్దిపేట జిల్లాలో 2లక్షల మంది ఉపాధి హామీ కూలీలు ఉంటే ప్రభుత్వం తెచ్చిన నిబంధన లోతో 75000 మందికే వర్తిస్తుందని తెలిపారు. మిగతా లక్షా 25వేల మంది కూలీల సంగతి ఏందీ. వీరంతా కూలి పనికి వెళ్లే నిరుపేదలు. ఎస్సీ ఎస్టీ, బీసీ రైతుల ఎక్కువగా ఉంటారు. గుంట భూమి ఉన్న రైతులను ఉపాధి హామీ కూలీలుగా గుర్తించం అని ప్రభుత్వం చెప్పడం దురదృష్టకరమని, ఎకరం లోపు భూమి ఉన్న రైతు కు కుడా ఈ పథకం వర్తించాలని గ్రామ సభలో అడగాలి, ఒక్క సెంటు భూమి ఉన్నా కూలి కాదు అని చెబుతున్నది. ఉపాధి హామీ పథకంలో ఈ సంవత్సరం 20 రోజులు పని దినాలు ఉంటేనే కూలిగా గుర్తింపు అనే నిబంధన కూడా సరైనది కాదని, అనారోగ్య సమస్యలతోనూ ఇతర సమస్యలతోనూ 60 ఏళ్ళు నిండిన రైతు కు, పనికి వెళ్ళని కూలీలను ఉపాధి హామీ కూలీలుగా గుర్తించరు అని ప్రభుత్వం చెప్తున్నది. ఈజీఎస్ పథకంలో కూలీలు 60 సంవత్సరాల వయసు దాటితే కార్డు కోల్పోతారు. కాబట్టి ఈ పథకంలో ఈజీఎస్ నిబంధన విధించకుండా అమలు చేయాలి. రైతు కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలి. గ్రామాల్లో 60ఏళ్ళు వాల్లు కుడా ఉంటారు.. వ్యవసాయ కూలీలు కోటి మంది ఉంటారు కానీ మీరు 6లక్షల మంది కె ఈ పథకం వర్తించేల చేస్తున్నారు... హైదరాబాద్ సచివాలయం లో కూలీలను గుర్తించాల... గ్రామ సచివాలయం వద్ద గ్రామ సభల్లో గుర్తించాల...? అని గట్టిగ నిలదీయాలన్నారు.. రైతు భరోసా 10వేలు ను 15 వేలు చేస్తామని ఎన్నికల్లో ప్రగల్బాలు కల్పి కోతలు ఎరవేతలతో 12 వేలు ఇస్తున్నారు.. ఎగొట్టిన వానాకాలం 6 వేలు సంగతి ఏందీ అని వానాకాలం పైసలు ఇవ్వాలని గ్రామ సభలో తీర్మానం చేపించాలి... రైతు భరోసా లో ఏరివేతలు చేస్తున్నారు.. న్యాయం గా ఉండే వారికి రైతు భరోసా వచ్చేలా చుడాలని, అర్హులైన రైతులందరిని గుర్తించాలని, ఇందిరమ్మ ఇల్ల విషయం లో ఇంటి స్థలం ఉండి కిరాయి ఉన్నవారికి, గుడిసెల్లో ఉండే వారికి, కవర్ల కప్పి ఉన్న ఇళ్లకు, అనాథలకు, ఒంటరి మహిళలకు, వికలాంగుల కు ఇజ్రా లక స్థలం ఉంటే ఇది వర్తిస్తుంది.. ఇలాంటి వారిని గుర్తించి అర్హులైన వారికి అందేలా చూడాలన్నారు.రేషన్ కార్డు విషయంలో ఇప్పటికి గ్రామాల్లో, పట్టణం లో కుల గణన సంబంధం పెట్టి కొంతమంది కె వచ్చాయని, ప్రజా పాలన లో దరఖాస్తు చేసుకున్న వారి సంగతి, కెసిఆర్ గారి ప్రభుత్వం లో ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్న వారి సంగతి ఏంటి అని గ్రామ సభల్లో నిలదీయండన్నారు.. గ్రామ సభల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని ప్రజల వైపు నిలబడాలన్నారు.. నిజమైన, అర్హులైన పేదలందరికి న్యాయం జరిగేల చూడాలని.. ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

## విశాఖ స్టీల్‌కు ఆర్థిక ప్యాకేజీతో కేంద్రానికి కృతజ్ఞతలు

### ఎపి కేబినేట్‌లో పలు కీలక నిర్ణయాలు



అమరావతి, యదార్థవాది ప్రతినిధి, జనవరి 17 : నిషేధిత జాబితా నుంచి అక్రమంగా తొలగించిన భూములపై నిర్ణయం తీసుకునేందుకు మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటుకు ఎపి కేబినెట్ నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది. వైకాపా హయాంలో దాదాపు 7 లక్షల ఎకరాల భూములు నిషేధిత జాబితా నుంచి తొలగించారు. దీనిపై అధ్యయనం చేసి ఆయా భూములను ఏం చేయాలన్న దానిపై మంత్రుల కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. వచ్చే కేబినెట్ భేటీలోపు భూముల అవకతవకలపై నివేదిక ఇవ్వాలని ఆయా జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులను సీఎం ఆదేశించారు. రాష్ట్రంలోని సత్యసాయి, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో నిషేధిత జాబితా నుంచి భారీగా భూములు తొలగించినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. అలాగే కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ధాన్యం కొనుగోలు కోసం 700 కోట్ల రూపాయల రుణం తీసుకునేందుకు ఏపీ మార్క్‌ఫెడ్‌కు ప్రభుత్వ హామీ ప్రతిపాదనపై అనుమతి ఇచ్చింది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగవ్యవస్థపై చర్చించనుంది. ఇక, 62 నియోజకవర్గాల్లో అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు సంబంధించి నిర్ణయం తీసుకుంది. మరోవైపు.. ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు ఎలక్ట్రిసిటీ డ్యూటీ టారిఫ్ తగ్గింపు ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. నాగావళి నదిపై గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజ్ పై కుడి, ఎడమ వైపు మిని హైడల్ ప్రాజెక్టుల నిర్మాణం ప్రతిపాదనకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కడప జిల్లా సీకే దిన్నె మండలంలో ఏపీ ఇండస్ట్రియల్ కారిడార్ ఇన్ఫ్రా కార్పొరేషన్ కు కేటాయించిన 2,595 ఎకరాల బదిలీకి స్టాంపు డ్యూటీ మినహాయింపు ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే ప్రభుత్వ పథకాల అమలు, పోలవరం ప్రాజెక్టు, అమరావతి నిర్మాణ పనులు, పేదలకు భూమి పంపిణీ వంటి అంశాలపై ప్రధానంగా చర్చించారు. తల్లికి వందనం పథకం అమలు విషయంపై చర్చించారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి తల్లికి వందనం ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించింది. అలాగే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకం డబ్బులు వేసిన వెంటనే.. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్నదాత సుఖీభవ వేయాలని నిర్ణయించారు. ఇక పోలవరం డయాఫ్రామ్ వాల్‌ను వెంటనే ప్రారంభించాలని నిర్ణయించారు. రాధాజాని అమరావతి పనులు కూడా వెంటనే ప్రారంభమవుతానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కేబినెట్ భేటీలో చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు స్థలం పేదలకు ఇచ్చేందుకు వెంటనే ఏర్పాట్లు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. బడ్జెట్ సమావేశాలకు ముందు కలెక్టర్లు సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఇళ్ల స్థలాలకు పట్టణాల్లో స్థలం లేకపోతే ఇల్లు ఇవ్వాలని నిర్ణయించారు. ఇన్‌చార్జి మంత్రులు జిల్లాలో సమావేశం ఏర్పాటు చేసి స్థలాలు సేకరణపై నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. అమరావతి, పోలవరం, వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు నిధులు ఇవ్వడంపై కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపింది. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నిధులు ఇచ్చినా భవిష్యత్‌లో స్టీల్ ప్లాంట్ కొనసాగే విధంగా చర్యలు చేపట్టాలని కేబినెట్ భావించింది. విశాఖ ఉక్కు, ఆంధ్రుల హక్కు అనే సెంటిమెంట్ ఉందని, అందుకు అనుగుణంగా ప్లాంట్‌ను నడపాలని కేబినెట్ భావించింది. ఫ్రీ హోల్డ్‌లో ఉన్న 15 లక్షల 35 వేల ఎకరాల్లో 25 వేల ఎకరాలు రిజిస్ట్రేషన్ అయిందని మంత్రి మనోహర్ చెప్పారు. రాష్ట్రానికి కేంద్రం ఎంతో సహాయం చేస్తుందని అందువలన.. మనం కూడా కేంద్రానికి అదేవిధంగా సహాయం చేయాల్సిన అవసరం ఉందని సీఎం చెప్పారు. శనివారం సాయంత్రం కేంద్ర హోమంత్రి అమిత్ షా వస్తున్నారని, ఆయనతో డిన్నర్ మీట్‌లో మూడు పార్టీల నేతలు కలుస్తారని సీఎం చెప్పారు. ఇకపోతే పలు నిరణయాల్లో..గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల హేతుబద్ధీకరణకు ఆమోదం దక్కింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆర్‌టీజీఎస్ ఏర్పాటుకు ఆమోదం ఇచ్చింది. తోటపల్లి బ్యారేజీపై మినీ హైడల్ ప్రాజెక్టుల నిర్మాణాలకు ఆమోదం ఇచ్చారు. కడప జిల్లా సీకేదిన్నెలో 2,595 ఎకరాల బదిలీకి స్టాంప్ డ్యూటీ మినహాయింపుకు ఆమోదం అభించింది. అభ్యంతరం లేని ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణ ప్రతిపాదనలకు ఆమోదం ఇచ్చారు. ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు విద్యుత్ టారిఫ్ తగ్గింపు ప్రతిపాదనపై కేబినెట్ ఆమోదం. విద్యుత్ సుంకంలో టారిఫ్‌ల తగ్గింపును మార్చి వరకు పొడిగిస్తూ ఆమోదం ఇచ్చారు. 62 నియోజకవర్గాల్లో 63 అన్న క్యాంటీన్ల ప్రారంభానికి ఆమోదం ఇచ్చారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) ప్రారంభంలోనే పలు పథకాలకు శ్రీకారం చుట్టనున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. కేబినెట్ భేటీ అనంతరం పలు రాజకీయ అంశాలపై చంద్రబాబు చర్చించారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మత్స్యకార భరోసా పథకాల అమలుకు సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు చొప్పున ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ నిర్మాణం, రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు వెంటనే ప్రారంభమవుతాయని సీఎం వెల్లడించారు.




అమరావతి, యదార్థవాది ప్రతినిధి, జనవరి 17 : రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా దావోస్‌లో జరిగే ప్రపంచదేశాల ఆర్థిక సదస్సులో సిఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పాల్గొనబోతున్నారు. ఐదు సెషన్లలో ప్రధానవక్తగా మాట్లాడేందుకు రాష్ట్రం తరఫున అవకాశం దక్కింది. వాటిలో సీఎం చంద్రబాబు మూడు సెషన్లు.. మంత్రి లోకేశ్ రెండు సెషన్లలో మాట్లాడనున్నారు. అందుకు అనుగుణంగా వారి పేర్లతో 'వైట్‌పాస్'లు డబ్ల్యూఈఎఫ్ నుంచి అందాయి. ఆహ్వానితులకే సమావేశాల్లో పాల్గొనడానికి, మాట్లాడడానికి అవకాశం ఉంటుంది. ఈ సమావేశాల్లో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు శనివారం రాత్రి బయలుదేరి వెళ్లనున్నారు. ఈ నెల 20 నుంచి ఐదురోజుల పాటు దావోస్‌లో జరిగే సమావేశాల్లో ఆయన పాల్గొంటారు. ఈ వేదిక ద్వారా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను కంపెనీల ప్రతినిధులకు సీఎం వివరించనున్నారు. క్లీన్ ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్‌తో పాటు.. ఐటీ, పలు కీలకరంగాల్లో పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షించేందుకు దావోస్‌ను వేదికగా చేసుకోవాలన్నది ప్రభుత్వ ఆలోచన. ఇటీవల రాష్ట్రానికి వచ్చిన భారీ ప్రాజెక్టుల గురించి వివరించడం ద్వారా ప్రపంచ దృష్టిని ఆకర్షించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ సదస్సులో పాల్గొనడం ద్వారా రాష్ట్రానికి గరిష్ఠ పెట్టుబడుల ప్రయోజనాన్ని సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్రంలో పెట్టుబడులకున్న అవకాశాలను ప్రపంచ దేశాలకు వివరించేలా ప్రత్యేకంగా రాష్ట్ర పెవిలియన్‌ను ఏర్పాటుచేశారు. అందులో ఒకేసారి నాలుగు రౌండ్‌టేబుల్ సమావేశాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. వివిధ కార్యక్రమాల్లో సీఎం బిజీగా గడిపితే.. వీలైనన్ని రౌండ్‌టేబుల్ సమావేశాలను నిర్వహించే బాధ్యతలను అధికారులు, ఇతర ప్రతినిధులకు అప్పగించారు. ద్వైపాక్షిక సమావేశాల్లో 18 దేశాలకు చెందిన కంపెనీల సీఈవోలు, ప్రతినిధులతో సమావేశం కానున్నారు. సీఐఐ నిర్వహించే బ్రేక్‌ఫాస్ట్ సెషన్‌లో సీఎం, మంత్రులు, అధికారులు పాల్గొంటారు. రాష్ట్రప్రభు త్వం కూడా వివిధ దిగ్గజ కంపెనీల సీఈవోలతో సమావేశం ఏర్పాటుచేస్తోంది. రాష్ట్రం ఏర్పాటుచేసే పెవిలియన్‌ను సందర్శించాలని సదస్సుకు హాజరయ్యే వివిధ దేశాల ప్రభుత్వాలకు రాష్ట్ర ప్రభుత్వం లేఖలు రాసింది. దావోస్ వెళ్లే బృందంలో సీఎంతో పాటు మరో ఎనిమిది మందికి అవకాశం లభించింది. ప్రభుత్వ అధికారులు, మంత్రులు మాత్రమే బృందంలో సభ్యులుగా ఉండాలని కేంద్రం నుంచి ఆదేశాలు అందాయి. ఈ ప్రకారం మంత్రులు లోకేశ్, టీజీ భరత్, సీనియర్ అధికారులు కార్తికేయ మిశ్రా, పియూష్‌కుమార్, యువరాజ్, సీఎం ముఖ్య భద్రత అధికారి శ్రీకాంత్, ఈడీబీ సీఈవో సాయికాంత్ వర్మ, కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ పీడీ వికాస్ మర్మత్ ఈ బృందంలో ఉండేందుకు కేంద్రం నుంచి అనుమతులు వచ్చాయి. అధికారులు, మంత్రులకు సహాయకులుగా మరో 15మంది దావోస్ వెళ్లనున్నారు.రాష్ట్రంలో ఇటీవల ప్రకటించిన పారిశ్రామిక పాలసీలో ప్రత్యేకతలు వంటి అంశాలను వివరించడం ద్వారా పెట్టుబడిదారుల దృష్టి ఆకర్షించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

# విశాఖ ఉక్కు హామీని నిలబెట్టుకున్న కేంద్రం

### ప్లాంట్ పునరుద్ధరణకు రూ.11,440 కోట్ల ప్యాకేజీ

### మీడియా సమావేశంలో వెల్లడించిన కేంద్రమంత్రులు



న్యూఢిల్లీ, యదార్థవాది ప్రతినిధి, జనవరి 17 : విశాఖ ఉక్కు పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టు కుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించిన విషయాన్ని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి, మరో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మతో కలిసి రామ్మోహన్ నాయుడు మీడియాతో మాట్లాడారు. ప్యాకేజీ ప్రకటించిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి ఏపీ ప్రజల తరఫున ధన్యావాదాలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా నెలకొన్న స్టీల్ ప్లాంట్ సమస్యల పరిష్కారానికి అడుగులు పడ్డాయని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు నినాదాన్ని కేంద్రం కాపాడిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్యాకేజీపై రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. నష్టాలను అధిగమించేందుకు, ప్లాంట్ పూర్తి ఉత్పాదనతో లాభాల బాట పట్టేందుకు కేంద్ర ప్యాకేజీ దోహద పడుతుందన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజల ఆకాంక్షల పట్ల కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు. ఇకపోతే ప్రైవేటీకరన అంటూ సాగిన ప్రచారానికి తెరపడింది. విశాఖ ఉక్కుకు కేంద్ర ప్రభుత్వం కొత్త ఊపిరులూదింది. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న కర్మాగారాన్ని పునరుజ్జీవింపజేయడానికి ముందుకొచ్చింది. ఇందుకోసం రూ.11,440 కోట్ల ప్యాకేజీని ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ శుక్రవారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్యాకేజీకి గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశం ఆమోదముద్ర వేసినట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. 'ఇది భారీ రివైవల్ ప్యాకేజీ. స్టీల్ రంగంలో విశాఖ ఉక్కు ప్రధానమైన సంస్థ. విశాఖ ఉక్కు..పోర్టు ఆధారిత స్టీల్ ప్లాంట్. ఈ పరిశ్రమను ఏళ్ల తరబడి సమస్యలు వేధిస్తున్నాయి. విశాఖ ఉక్కుకు ప్రకటించిన ఆర్థిక ప్యాకేజీ తక్షణం అమల్లోకి వస్తుంది. త్వరలో రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు ప్రారంభమవుతాయి ఆగస్టు నాటికి 3 బ్లాస్ట్ ఫర్నేస్‌లు అందుబాటులోకి వస్తాయి. ముడి సరకు సరఫరా కోసం ఎన్‌ఎండీసీతో చర్చిస్తున్నాం. ఆత్మనిర్భర్ భారత్‌లో విశాఖ ఉక్కు కీలక పాత్ర పోషిస్తుంది. దేశ ఉక్కు అవసరాలు తీర్చడంలో విశాఖ స్టీల్ ఎ÷-లాంట్‌ది కీలక పాత్ర. స్టీల్ ఎ÷-లాంట్ యాజమాన్యం, కార్మికులకు శుభాకాంక్షలు' అని అశ్వినీవైష్ణవ్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారం చేపట్టిన రోజు నుంచి విశాఖ ఉక్కుపై ప్రత్యేక దృష్టి సారించారు. దిల్లీ వెళ్లిన ప్రతిసారి ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామిలతో సమావేశమై కర్మాగారం పునరుజ్జీవంపై చర్చలు జరుపుతూ ఉన్నారు. ఇటీవల ప్రధానిని మరోమారు కలిసి విశాఖ ఉక్కుకు అవసరమైన ఆర్థిక సాయం అందించాలని కోరారు. దీనిపై విభిన్న కోణాల్లో చర్చించిన అనంతరం కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఈ ప్యాకేజీకి ఆమోదం తెలిపింది. ఏటా 7.3 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యమున్న విశాఖ ఉక్కు కర్మాగారం 2023-24లో రూ.4,848.86 కోట్లు, 2022-23లో రూ.2,858.74 కోట్ల నష్టాన్ని మూటగట్టుకొంది. వర్కింగ్ క్యాపిటల్ కోసం చేసిన అప్పులు పెరగడం దీనికి ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడంతో స్టీల్ ఎ÷-లాంట్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ఎ÷-లాంటును సందర్శించారు. ఎ÷-లాంటు నిలదొక్కుకోవడానికి రూ.18 వేల కోట్లు అవసరమని విశాఖ ఎంపీ శ్రీభరత్, తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, కార్మిక సంఘాల నేతలు ఆయనకు విన్నవించారు. ఆ తర్వాత కొన్ని రోజులకే కేంద్ర ఉక్కుశాఖ ఎమర్జెన్సీ అడ్వాన్స్ ఫండ్ కింద, జీఎస్టీ చెల్లింపులకు రూ.500 కోట్లు, ముడిసరకుకు సంబంధించి బ్యాంకు అప్పుల చెల్లింపులకు రూ.1,150 కోట్ల చొప్పున రెండు విడతల్లో సాయం చేసింది. వర్కింగ్ క్యాపిటల్ కోసం చేసిన అప్పుల భారం, తగినంత ముడిసరకు లేకపోవడం, కోర్టు ఎటాచ్‌మెంట్లు, ఇన్‌సాల్వెన్సీ ప్రొసీడింగ్స్‌తో విశాఖ ఉక్కు కర్మాగారం తీవ్ర ఇబ్బందుల్లో ఉంది. వీటిని తీర్చడంతోపాటు భవిష్యత్తులో తలెత్తే కష్టాల నుంచి తప్పించడానికి ఒక సమగ్ర ప్రణాళికను తయారు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇదివరకే పార్లమెంటు స్థాయీసంఘానికి చెప్పింది. దానిపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఆ సంఘం పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో సిఫార్సు చేసింది. దాని ప్రకారమే కేంద్ర ప్రభుత్వం ఈ ప్యాకేజీకి ఆమోదముద్ర వేసినట్లు తెలుస్తోంది.

## ఉక్కు రెక్కల ఆయుధాలతో కొత్త శిఖరాలకు ఏపీ

### స్టీల్ ప్లాంట్‌కు నిధులపై సిఎం చంద్రబాబు హర్షం




అమరావతి, యదార్థవాది ప్రతినిధి, జనవరి17 : విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, కుమారస్వామికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 'ఇది ఏపీ ప్రజలు గర్వించదగ్గ విషయం. విశాఖ ఉక్కు అంటే కేవలం పరిశ్రమ మాత్రమే కాదు. విశాఖ ఉక్కుకు ఆంధ్రుల హృదయాల్లో ప్రత్యేక స్థానం ఉంది. రాష్ట్ర ప్రజలకు ఇకపై అన్నీ మంచి రోజులే. విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు' అని చంద్రబాబు అన్నారు. విశాఖ ఉక్కుకు కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ ప్రకటించడంపై మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఆయన స్పందిస్తూ.. 'ఉక్కు రెక్కల ఆయుధాలతో ఏపీ కొత్త శిఖరాలకు ఎదుగుతుంది. ఇది లక్షలాది జీవితాలను మార్చే మంచి నిర్ణయం. కూటమి ప్రభుత్వంలో సత్ఫలితాలు కనిపిస్తు?న్నాయి. విశాఖ ఉక్కుకు పూర్వవైభవనం వస్తుంది. విశాఖ ఉక్కును కాపాడుతామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆయన కృషిని దగ్గర నుంచి చూశా. లక్షల మందికి ఉపాధి కల్పించే ఎ÷-లాంట్‌ను కాపాడినందుకు ప్రధాని మోదీ, నిర్మలా సీతారామన్, కుమారస్వామికి నా కృతజ్ఞతలు' అని తెలిపారు.

## మా మేనిఫెస్టోను కాపీ కొట్టారు

### బిజెపి సంకల్ప్ పాత్రపై కేజ్రీవాల్ విమర్శలు



న్యూఢిల్లీ, యదార్థవాది ప్రతినిధి, జనవరి17 : అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో 'సంకల్ప్ పాత్ర-1'పై ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విమర్శలు గుప్పించారు. బీజేపీ ఇచ్చిన హామీలు 'ఆమ్ ఆద్మీ పార్టీ' నుంచి కాపీ కొట్టారని, తమ పార్టీ ఎంచుకున్న మార్గానే వాళ్లు అనుసరించేటప్పుడు ఏమాత్రం విజన్ లేని బీజేపీని ఎందుకు ఎన్నుకోవాలని ఆయన ప్రశ్నించారు. బీజేపీ 'సంకల్ప పాత్ర'ను ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా శుక్రవారం విడుదల చేశారు. మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఆర్థిక సాయం, గ్యాస్ సిలెండర్లపై రూ.500 సబ్సిడీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించారు. ఢిల్లీలో ఆప్ సర్కార్ అమలు చేస్తున్న పథకాలన్నింటినీ కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. దీనిపై కేజ్రీవాల్ నిశిత విమర్శలు చేశారు. 'కేజ్రీవాల్ తరహాలోనే ఉచితాలు ఇస్తామంటూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు ఈరోజు ప్రకటించారు. నేను ఒకటే అడుగుతున్నాను. ఉచితాలు మంచివి కావని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇంతవరకూ చెబుతూ వచ్చారు. ఇప్పుడు ఉచిత హామీలు గుప్పించడం ద్వారా గతంలో తాము చెప్పినది తప్పని, కేజ్రీవాల్ చేసింది సరైనదేనని ఒప్పుకున్నట్టు అయింది. ఉచితాలు హానికరం కాదని, దేశానికి భగవంతుని ప్రసాదమని మోదీ చెప్పాలి' అని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. కేజ్రీవాల్ పథకాలన్నింటినీ కొనసాగిస్తామని నడ్డా ఇప్పుడు చెబుతున్నారని, ఆ విషయాన్ని సంకల్ప్ పాత్రలోనూ చేర్చారని అన్నారు. ఢిల్లీలోని మొహల్లా క్లినిక్‌లను మూసేస్తామని నడ్డా చెబుతుండటంపై తాను ఈరోజు ఢిల్లీ ప్రజల వద్దకు వెళ్లి, మొహల్లా క్లినిక్‌కు కావాలా, వద్దా అని అడిగానని చెప్పారు. మొహల్లా క్లినిక్‌లకు అనుకూలంగా ఉన్న వారు ఆప్‌కు ఓటు వేయాలని, వద్దనుకునే వారు బీజేపీకి ఓటు వేయాలని అన్నారు. నా పని మరింత మెరుగ్గా ఎలా చేయాలో నాకు బాగా తెలుసు. కేజ్రీవాల్ చేసే పనే మీరు చేస్తే మిమ్మల్ని ఎందుకు ఎన్నుకోవాలని ప్రజలు బీజేపీని అడుగుతున్నారు' అని ఆయన చెప్పారు. బీజేపీ మేనిఫెస్టో క్లుప్లంగా చెప్పాలంటే, కేజ్రీవాల్ చేసిన పనిని బీజేపీ అభినందించిందని చెప్పారు. బీజేపీకి ఒక ఎ÷-లానింగ్ అంటూ ఏదీ లేదని, ఆప్ మేనిఫెస్టోపై, ఆప్ హామీలపై పోటీ చేయాలనుకుంటోందని విమర్శించారు. ఇంతకంటే దరుదృష్టం మరొకటి ఉండదన్నారు. ఎలాంటి విజన్ కానీ, ఆలోచనలు కానీ ఎ÷-లానింగ్ కానీ లేని పార్టీని తన జీవితంలో ఎన్నడూ చూడలేదని బీజేపీపై కేజ్రీవాల్ విమర్శించారు.



చొప్పదండి, యదార్థవాది ప్రతినిధి, జనవరి 17 : చొప్పదండి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఇంటిపై దాడి చేసిన యూత్ కాంగ్రెస్ రౌడీ షీటర్ గూండాల పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కరీంనగర్ రూరల్ ఎసిపికి ఫిర్యాధు చేసినట్టు చొప్పదండి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా ఇంటి పై యూత్ కాంగ్రెస్ నాయకులు రౌడీ షీటర్లు గూండాలు కలిసి నేను ఇంట్లో లేని సమయంలో సాయంత్రం వేలలో నా ఇంటికి వచ్చి వచ్చి నానా బూతులు తిడుతూ రారా బైటికి లంజాకొడకా అంటూ తీవ్ర అసభ్య పదజాలంతో తిట్టినారని తెలిపారు.బి.ఆర్.ఎస్ నాయకులు కార్యకర్తలు తలుచుకుంటే నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గ్రామల్లో తిరగలేరని హెచ్చరించారు. మునుముందు ఇట్లాంటి కవ్వింపు చర్యలకు కాంగ్రెస్ నాయకులు పాలుపడినట్టు అయితే మా బి.ఆర్.ఎస్ నాయకులు కార్యకర్తలు ప్రతిదాడులు చెయ్యడానికి సిద్దంగా ఉన్నారని హెచ్చరించారు.రాష్ట్రం లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీ పథకాలను అమలు చేసేదాకా ప్రజలకోసం నిరంతరము పోరాటం చేస్తామని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేసారు. ప్రజల కోసం కొట్లాడుతున్న బి.ఆర్.ఎస్ నాయకులపై కాంగ్రెస్ పార్టీ నాయకులు చిల్లర మల్లర మాటలు మాట్లాడితే ఊరుకోమని హెచ్చరించారు.

ప్రాణాలు కోల్పోయారు. ఈఘటనపై టీడీపీ చీఫ్, ముఖ్యమంత్రి చంద్రబాబు దూకుడు వైఖరిని ప్రదర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం టోకెన్ వ్యవస్థను ప్రవేశపెట్టిందని ఆరోపించారు. తొక్కిసలాట జరగడానికి కారణం ఇదేనని వ్యాఖ్యానించారు. కానీ.. ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ ఇందుకువిరుద్ధంగాస్పందించారు. ఈ విషాదా నికి కారణమైన వారు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

2.ఈ ఘటనపై ఆరాతీసిన ప్రభుత్వం.. అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. ఘటన జరిగినప్పుడు పర్యవేక్షించిన డీఎస్పీ రమణ కుమార్, టీటీడీ శ్రీ వెంకటేశ్వర గోసంరక్షణశాల డైరెక్టర్ కె.హరనాథ్ రెడ్డి ఇద్దరినీ సస్పెండ్ చేసింది. ఆ తర్వాత కూడా మరికొందరు అధికారులను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఇక్కడితో వివాదం ముగిసిందని అంతా అనుకున్నారు.

3.గతేడాది సెప్టెంబర్‌లో తిరుపతి లడ్డూ వివాదం జరిగింది, ఈ వివాదంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వును 'స్వచ్ఛమైన' నెయ్యితో కలపడానికి అనుమతించారని టీడీపీ, జనసేన ఆరోపించాయి. కచ్చితమైన ఆధారాలు లేనప్పటికీ.. పవన్ కళ్యాణ్ కాషాయ వస్త్రాలు ధరించి 11 రోజుల దీక్ష చేశారు. సనాతన ధర్మాన్ని అణగదొక్కడానికి జగన్, నకిలీ లౌకిక శక్తులు కుట్ర పన్నాయని ఆరోపించారు.

4. తాజాగా తన సొంత నియోజకవర్గం పిఠాపురంలో జరిగిన ఒక కార్యక్రమంలో కళ్యాణ్ మాట్లాడుతూ.. తొక్కిసలాట ఘటనకు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అయితే.. దేవాదాయ శాఖ మంత్రి, ముఖ్యమంత్రి సహా వేరే ఇతర టీడీపీ నాయకుల నుండి ఇలాంటి డిమాండ్లు రాలేదు.

5.కళ్యాణ్ డిమాండ్ గురించి అడిగినప్పుడు.. టీటీడీ ఛైర్మన్.. క్షమాపణ చెప్పడం వల్ల చనిపోయినవారు తిరిగి రారు. తాము బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటాము.. ఎవరో క్షమాపణ కోరారని తాను క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదన్నారు. అసలు వివాదం ఇక్కడే మొదలైంది.

6.బీఆర్ నాయుడు క్షమాపణ చెప్పడానికి నిరాకరించడంతో.. జనసేన, బీజేపీ, సంఘ్ పరివార్ – టీడీపీ మద్దతుదారుల మధ్య సోషల్ మీడియా యుద్ధం మొదలైంది. ఇది పెద్ద వివాదంగా మారకముందే.. టీడీపీ జాగ్రత్త పడింది. పవన్ డిమాండ్ చేసిన రెండు రోజుల తర్వాత.. బీఆర్ నాయుడు క్షమాపణలు చెప్పారు. ఆయన గతంలో ధిక్కార వైఖరిని ప్రదర్శించినప్పటికీ.. ప్రభుత్వ పెద్దల నుంచి ఆదేశాలు రావడంతో క్షమాపణలు చెప్పారని ప్రచారం జరుగుతోంది.

7.ఈ మొత్తం ఎపిసోడ్‌లో పవన్ కళ్యాణ్ రాజకీయ విజేత అనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనకు సంబంధించి నిందను పవన్ కళ్యాణ్ తెలుగుదేశం పార్టీపై విజయవంతంగా మోపారనే కామెంట్స్ వినిపిస్తున్నాయి.

8.పవన్ కళ్యాణ్ ఇలాంటి వ్యూహాన్ని అనుసరించడం ఇదే మొదటిసారి కాదు. గతంలో మహిళలపై పెరుగుతున్న నేరాలపై స్పందిస్తూ.. డీజీపీ, హోంమంత్రిని విమర్శించారు. బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుత హోంమంత్రి తన విధులను సమర్థవంతంగా నిర్వహించలేకపోతే.. తాను హోం మంత్రిత్వ శాఖను చేపట్టవలసి వస్తుందని హెచ్చరించారు.

9.సానుకూల పరిణామాలను పవన్ తన ఖాతాలో వేసుకుంటూ.. లోపాలను సమర్థవంతంగా టీడీపీ ఖాతాలోకి నెట్టేస్తున్నారనే రాజకీయ అభిప్రాయాయలు వ్యక్తం అవుతున్నాయి. ఇదే సమయంలో.. సనాతన ధర్మ రక్షకుడిగా పవన్ తనకు తాను ప్రాజెక్ట్ చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అటు బీజేపీ, ఇటు సంఘ్ పరివార్ పవన్‌కు సపోర్ట్‌గా నిలుస్తున్నాయనే అభిప్రాయాలు ఉన్నాయి.

10.తాజా పరిణామాలతో తెలుగుదేశం పార్టీలో ఆందోళన మొదలైందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో హిందూ ఓట్ల ఏకీకరకణ, పవన్ కళ్యాణ్, బీజేపీ ప్రభావం పెరగడం ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఈ పరిణామాలు భవిష్యత్తులో లోకేష్‌కు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందనే టాక్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో.. ఓ ప్రముఖ మీడియాలో 'ఉప ముఖ్యమంత్రి' సాంకేతికంగా రాజ్యాంగబద్ధమైన పదవి కాదని, కళ్యాణ్ మంత్రివర్గంలోని ఇతర మంత్రుల మాదిరిగానే ఉంటారనే కథనం వచ్చింది. దీనిపైనా జనసైనికులు గుర్రుగా ఉన్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో జనసేన వర్సెస్ టీడీపీ ఫైట్ జరుగుతుంటే.. జనసేనకు బీజేపీ, సంఘ్ పరివార్ మద్దతు ఇస్తున్నాయి. ఇందుకే కూటమిలో చీలిక వచ్చిందనే ప్రచారం జరుగుతోంది.

# ఐదు నెలల నుంచి జీతాల్లేవ్

విశాఖపట్టణం, యదార్ధవాది ప్రతినిధి, జనవరి 17 : ప్రతిష్ఠాత్మక వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు.. పండగ పూట కూడా పస్తులే ఉంటున్నారు. ఐదు నెలలు గా స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వటం లేదు. దీంతో ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. జీతాలు లేకపోతే పండగ ఎలా చేసుకోవాలంటూ.. కార్మికులు ప్రశ్నిస్తున్నారు.వైజాగ్ స్టీల్‌ప్లాం ట్‌లో 9,460 మంది శాశ్వత అధికారులు, ఉద్యోగులు, 12 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల? ఉన్నారు. వీరికి గత కొన్ని నెలలుగా జీతాలు ఇవ్వటం లేదు. సెప్టెంబర్‌లో 50 శాతం, అక్టోబర్ 25 శాతం, నవంబర్‌లో 25 శాతం, డిసెంబర్‌లో 35 శాతం మాత్రమే ఇచ్చారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు నాలుగైదు నెలల నుంచి పూర్తిస్థా యి జీతాలు ఇవ్వటం లేదు. హెఆర్‌ఏ, ఎల్‌టీసీ, ఎల్ఎల్‌టీసీ, దసరా, దీపావళి బోనస్‌ను పూర్తిగా ఆపేశారు. వేతన సవరణ జరగలేదు.కార్మికులను సాగనంపేందుకు యాజమాన్యం కుట్రకు తెరతీసింది. కార్మికులను సాగనంపేందుకు సిద్ధమైంది. వీఆర్ఎస్ పథకం అమలుకు ఆర్ఐఎన్ఎల్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఆ నోటిఫికేషన్‌లో 45 ఏళ్ల వయసు, 15 ఏళ్ల సర్వీస్ పూర్తి అయిన వారు వీఆర్ఎస్ దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేసింది. తద్వారా 2025 మార్చిలోపు వెయ్యి మందిని బయటకు పంపేందుకు యాజమాన్యం సిద్ధమైంది. గత ఐదేళ్ల నుంచి ప్రతి ఏడాది 1000 నుంచి 1,100 మంది ఉద్యోగులు రిటైర్ అవుతున్నారు. వారిస్థానం లో నియామకాలు జరగటం లేదని సీఐటీయూ నేత కేఎం శ్రీనివాస్ వివరించారు. జీతాల కోత విధింపు, ఉద్యోగులకు జీతాల కోత వంటి చర్యలతో కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు.మరోవైపు బలవంతగా వీఆర్ఎస్‌కు పంపిస్తున్నారు. ఇప్పటికి ఐదు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. పెండింగ్ జీతాలు చెల్లించాలని విశాఖ ఉక్కు కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. జీతాలు లేకపోతే పండగ ఎలా చేసుకోవాలంటూ కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఈ దౌర్భాగ్య పరిస్థితికి కేంద్రంలోని ఎన్‌డీఏ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలే కారణమని ఆరోపిస్తు న్నారు. కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్–ఆర్ఐఎన్ఎల్)ను ప్రైవేటీకరణ చేసేందుకు మొగ్గు చూపుతోంది. ఇప్పటికే కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలపడంతో చర్యలకు పూనుకుంటుంది. అందులో భాగంగానే స్టీల్‌ప్లాంట్‌లోని ఒక్కో భాగాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు సిద్ధపడింది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లోని వంద శాతం పెట్టుబడుల ఉపసంహరణకు సంబంధించి ప్రకటన వెలువడిన తరువాత ఒక్కొక్క చర్యలు చేపట్టిందిఇప్పటికే దాదాపు 2,000 మంది ఉద్యోగులను ఛత్తీస్‌గఢ్‌లోని నాగర్‌నర్ స్టీల్‌ప్లాంట్‌కు పంపడానికి సిద్ధపడింది. అలాగే 4,200 మంది స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ వర్కర్స్‌ను తొలగించేందుకు వారికి ఎంట్రీ, ఎగ్జిట్ పాస్‌లను ఇవ్వకుండా కుట్రలు చేసింది. కార్మికులు పోరాటంతో యాజమాన్యం వెనక్కి తగ్గింది. అలాగే బ్లాస్ ఫర్నేస్‌ను నిలిపివేసింది. ఆక్సిజన్ ప్లాంట్‌ను నిలిపివేసింది. మళ్లీ కార్మికుల ఆందోళనతో వెనక్కి తగ్గింది. ఇలాంటి కుట్రలతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తిపై ప్రభావం చూపే విధంగా యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం చర్యలకు పూనుకున్నాయి.తాజాగా స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఒక యూనిట్‌ను ప్రైవేట్ పరం చేసేందుకు రంగం సిద్ధం అయ్యింది. స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఫైర్ స్టేషన్ నడిపే బాధ్యతను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబందించి వైజాగ్ స్టీల్ యాజమాన్యం ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్ (ఈవోఐ)కు దరఖాస్తులు ఆహ్వానించింది. స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఆర్ఎంహెచ్‌పీ, సింటర్ ప్లాంట్, కోక్ ఓవెన్స్, స్టీల్‌మెల్ట్ షాప్, బ్లాస్ట్‌ఫర్నేస్, రోలింగ్ మిల్స్, ఎయిర్ సెపరేషన్ ప్లాంట్, సీఆర్ఎంపీ, థర్మల్ పవర్ ప్లాంట్, ఎల్‌పీజీ స్టోరేజ్ ట్యాంక్‌లు, వాటర్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్, గ్యాస్ హోల్డర్లు, ఎనర్జీ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్, స్టీల్‌ప్లాంట్‌లోని ఎలక్ట్రికల్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ తదితర కీలకమైన విభాగాల్లో ఫైర్ స్టేషన్ సేవలు అందిస్తుంది.వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కానివ్వబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో వాగ్ధానం చేశారు. కానీ ఇప్పుడు ఒక్కొక్కటి ప్రైవేట్ పరం అవుతుంటే కనీసం స్పందించడం లేదు. మరోవైపు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కానీ ఆయన కూడా మౌనం దాల్చడంపై స్టీల్‌ప్లాంట్ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎంపీ భరత్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై స్పందించడం లేదు. అలాగే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు కోరిన రామ్మోహన్ నాయుడు, కేంద్ర మంత్రి అయిన తరువాత.. స్టీల్‌ప్లాంట్ గురించి కనీసం పట్టించుకోవడం లేదని కార్మికులు విమర్శిస్తున్నారు.

# స్థానిక ఎన్నికలపై నజర్

## సంక్రాంతి పలకరింపులతో హల్‌చల్

నిజామాబాద్, యదార్థవాది ప్రతినిధి, జనవరి 17 : బీసీ గణనకు సంబంధించి కమిషన్ల రిపోర్టులు రాగానే రిజర్వేషన్లు పెంచి లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. గత ఫిబ్రవరిలోనే సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసింది. జులైలో ఎంపీటీసీ, జడ్పీటీసీలు కూడా మాజీలయ్యారు. ఈనెలలో మున్సిపల్ కార్పొరేషన్లు, కౌన్సిళ్ల టర్మ్ పూర్తికానుంది. దీంతో రూరల్, అర్బన్ లోకల్ బాడీలకు వరుసగా ఎన్నికలు జరగనున్నాయి. కొత్తగా 15 గ్రామ పంచాయతీలు ఏర్పడడంతో జిల్లాలో పంచాయితీల సంఖ్య 545 పెరిగింది. ఈ క్రమంలో జిల్లాలో అప్పుడే స్థానిక హడావిడి మొదలయ్యింది. ముఖ్యంగా పంచాయితీ సర్పంచ్ పదవులకు పోటీ చేసే వారంతా ఇప్పటి నుంచే గ్రామాల్లో కరచాలనాలు మొదలు పెట్టారు. పలకరింపులు చేస్తున్నారు. బాగున్నావా అని ఆత్మీయంగా చూస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో ఇదే సందడి కనిపించింది. వాడు సర్పంంకు పోటీ చేస్తున్నాడనే కామెంట్స్ కూడా బాగానే వినిపించాయి. ఇకపోతే జిల్లాలో మహిళా ఓటర్లు అధిక సంఖ్యలో ఉన్నారు. జిల్లా పరిధిలో ఐదు అసెంబ్లీ నియోజక వర్గాలతో పాటు బాన్సువాడ సెగ్మెంట్‌లోని కొన్ని మండలాలున్నాయి. తుది ఓటర్ల జాబితాను అధికారులు ఇటీవల ప్రకటించారు. తాజాగా జిల్లాలో 14,35,214 మంది ఓటర్లుండగా పురుషులకన్నా 80,875 మంది మహిళా ఓటర్లు ఎక్కువ ఉన్నట్టు లెక్క తేలింది. మహిళల తర్వాత యువ ఓటర్లే కీలకం కానున్నారు. కొత్తగా ఓటు హక్కు పొందినవారు 26 వేల వరకు ఉన్నారు. మొత్తం ఓటర్లలో యువతీయువకులే దాదాపు సగం వరకు ఉన్నారు. కొత్త జాబితా ప్రకారం 18 నుంచి 39 ఏండ్ల మధ్య వయస్సున్న ఓటర్ల సంఖ్య 6, 96,014. దీంతో రానున్న లోకల్? బాడీ ఎన్నికల్లో మహిళలు, యువతే కీలకం కానున్నారు. దీంతో యువతలో కూడా సర్పంచ్ పదవులపై ఆశ కనిపిస్తోంది. పంచాయితీలతో పాటు వాటి పరిధిలోని 5,022 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. బ్యాలెట్ బాక్స్ లతో పాటు పేపర్ బ్యాలెట్ రెడీ చేశారు. జిల్లాలో 31 మండలాలున్నాయి. పంచాయతీ ఎన్నికల తర్వాత ఈ మండలాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలన్నింటిలోనూ యువత, మహిళలే నిర్ణేతలు కానున్నారు. వారు ఎవరివైపు మొగ్గు చూపితే వాళ్లే అందలమెక్కే చాన్స్‌ఉందని అంటున్నారు.

# కౌలు రైతుపై క'రుణ' ఏదీ..?



## రుణాల మంజూరులో ప్రభుత్వ నిర్లక్ష్యం

## అప్పుల పాలవుతున్న అన్నదాతలు

కాకినాడ, యదార్థవాది ప్రతినిధి, జనవరి 17 : 'అర్హులైన కౌలు రైతులందరికీ రుణాలు అందించాలి. వడ్డీ వ్యాపారుల చేతిలో వారు చిక్కుకుపోకుండా చర్యలు తీసుకుంటాం' అంటూ పాలకులు పదే పదే హామీలు ఇస్తున్నారు. కానీ ఆ హామీలు అమలు చేయడంలో పాలకులు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు.. వైసిపి పాలనలో కౌలు రైతులు రుణాల కోసం పడరాని పాట్లు పడ్డారని, బ్యాంకు నుంచి రుణాలందక, కష్టకాలంలో సాయమందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని కూటమి నాయకులు చెప్పుకొస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 నెలలు కావస్తున్నా గత సర్కారు బాటలో తమ పయనం అన్నట్లుగా ఉంది. కాకినాడ జిల్లాలో ఈ ఏడాది 2.19 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఇందులో 2.12 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుంది. 1.50 లక్షల మంది రైతులు ఉండగా వీరిలో లక్ష మందికి పైగా కౌలు రైతులే వాస్తవ సాగుదారులుగా ఉన్నారు. అయితే వ్యవసాయ శాఖ అధికారులు ఈ ఏడాది 68,890 మందికి మాత్రమే కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా తీసుకుని 59,967 మందికి జారీ చేశారు. జిల్లాలో ప్రధానంగా వరి, చెరకు, పొగాకు, మొక్కజొన్న, అరటి, పామాయిల్ తదితర పంటలు పండిస్తారు. ఇందులో 80 శాతానికి పైగా కౌలు రైతులే ఉన్నారు. ఏటా పంట కోత, నూర్పిడికి వచ్చే నవంబరు, డిసెంబరు నెలల్లో తుపాన్లు, వాయుగుండాల ప్రభావంతో రూ. లక్షల్లో నష్టపోతున్నా ప్రభుత్వం వారిని పట్టించుకోవడం లేదు. అరకొరగానే: వాస్తవానికి ఖరీఫ్ సాగు మొదలైన వెంటనే రుణాలు మంజూరు చేయాల్సి ఉంది. ఇప్పుడు రబీ పంట సాగులో ఉంది.దాదాపుగా అన్ని ప్రాంతాల్లో నాట్లు ప్రక్రియను పూర్తి చేశారు. అయితే బ్యాంకర్లు మాత్రం రుణాలు పూర్తిస్థాయిలో నేటికీ ఇవ్వని పరిస్థితి. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అరకొర ఋణాలే ఇచ్చారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిబంధనల ప్రకారం ఎకరాకు రూ.35 నుంచి రూ.38 వేల వరకూ రుణాలు ఇవ్వాలని జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో నిర్ణయించారు. ఈ ఏడాది రూ.275 కోట్లు రుణాల ఇచ్చేందుకు లక్ష్యంగా తీసుకున్నారు. కానీ ఇప్పటి వరకు కేవలం 15,020 మందికి రూ.63.30 కోట్లు మాత్రమే ఋణంగా ఇచ్చారు.ఇలా కౌలు రైతుల సంఖ్యకు, ఇస్తున్న గుర్తింపు కార్డులకు, వారిలో రుణం ఇచ్చే సంఖ్యకు ఎటువంటి సంబంధం ఉండడం లేదు. పాలకులు మాత్రం కౌలు రైతులపై అమితమైన ప్రేమ చూపిస్తున్నట్లుగా, ఎన్నో ప్రయోజనాలు కల్పిస్తున్నట్లుగా ప్రకటనలు ఇస్తున్నప్పటికీ వాస్తవ రూపంలో మాత్రం రుణాలు సక్రమంగా ఇవ్వని పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో ఏటా ఈ రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. భూ యజమాని అంగీకారం లేనిదే సాగుదారు హక్కు పత్రాలు (సిసిఆర్‌సి) లభించడం లేదు. ఈ కార్డులు లేక, ప్రభుత్వ ప్రయోజనాలు పొందలేక కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రయివేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పుల పాలవుతున్నారు. రుణాల కోసం ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది.

# ఎరుకల హక్కుల సాధనకు ఐక్యతతో ముందుకు సాగాలి



పెద్దపల్లి, యదార్థవాది ప్రతినిధి, జనవరి 17 : ఏకలవ్య ఉద్యమ స్ఫూర్తి, నాంచారమ్మ ఆశీస్సులతో ఎరుకల హక్కుల కోసం ఐక్యతతో హక్కుల సాధన కు ఎరుకలు ముందుకు రావాలని తెలంగాణ ఎరుకల ప్రజా సమితి పెద్దపల్లి జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. శుక్రవారం ఎరుకల ప్రజా సమితి పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మానుపాటి రవి, కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు దాసరి కిష్టయ్య ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరుకల ప్రజా సమితి జిల్లా అధ్యక్షులు మానుపాటి రవి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు దాసరి కిష్టయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు మానుపాటి శ్రీనివాస్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రేవల్లి తిరుపతి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నివసిస్తున్న ఎరుకల ప్రజలు దాదాపు 90 శాతం పందులపై జీవనోపాధి చేసుకుంటూ జీవిస్తున్నారని, ప్రభుత్వం వారిని గుర్తించి పందులు పెంచుకునే ప్రతి కుటుంబానికి 5 గంటల స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ప్రతి మండల కేంద్రంలో ఏకలవ్య కమిటీ హాల్ కోసం ఐదు గంటల స్థలం కేటాయించాలని, జిల్లా కేంద్రంలో 10 గుంటల స్థలం కేటాయించాలని కోరారు. ఎరుకల నిరుద్యోగ యువతీ యువకుల కోసం ప్రత్యేక స్వయం ఉపాధి ఏర్పాటు చేసి, జిల్లాలో తెల్ల పందుల పెంపకం కోసం ప్రభుత్వమే శాస్త్రీయ పద్ధతిలో శిక్షణ ఇప్పించాలన్నారు. బ్యాంకుల తో సంబంధం లేకుండా 10 లక్షల రుణం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. పెద్దపల్లి జిల్లా పరిధిలో ఉన్న మున్సిపాలిటీలలో ఎరుకల ప్రజలకు చెందిన పందులు చంపివేయబడ్డ కుటుంబాలను అదుకొని వారికి అవుట్సోర్సింగ్ ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఏకలవ్య ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేసినట్లయితే ఎరుకల విద్యార్థి–విద్యార్థులకు ఉన్నత విద్యకు ఉపయోగపడుతుందన్నారు. ప్రత్యేకంగా ఏకలవ్య సంస్కృతి తెలిసే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రతి ఎరుకల మహిళా సంఘాలకు పది లక్షలు వడ్డీ లేని ఋణం, మున్సిపల్ కేంద్రంలో నిర్మించి ఉన్న షెటర్లలో పంది మాంసం అమ్ముకోవడం కోసం షెటర్లు కేటాయించాలని కోరారు. జిల్లా కేంద్రంలో ఏకలవ్య విగ్రహం కోసం స్థలం కేటాయించాలన్నారు. ఎరుకల ప్రజా సమితి బలోపేతంలో భాగంగా త్వరలో పెద్ద ఎత్తున జిల్లా సభ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా పాఠశాలలో కళాశాలలో దాదాపు 100 మంది ఎరుకల విద్యార్థి–విద్యార్థులకు ఉచిత విద్యను అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎరుకల మహిళలు స్వయంకృషిగా ఎదగాలంటే కుట్టు శిక్షణ కేంద్రాలు బ్యాంగిల్ షాపు సారీ సెంటర్ల కోసం 100% సబ్సిడీతో ఎరుకల మహిళలకు రుణాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ ఎరుకల ప్రజా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మానపాటి శ్రీనివాస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రేవెల్లి తిరుపతి కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు దాసరి కిష్టయ్య జిల్లా అధ్యక్షులు మానుపాటి రవి పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి అలెపు సది పెద్దపెల్లి జిల్లా ఉపాధ్యక్షులు రేవెల్లి శ్రీనివాస్, అల్లెపు ఆంజనేయులు కుర్ర ఆకాష్ సార్ల రాజయ్య పెద్దపెల్లి జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సాధారణంగా అందరి వంటింట్లో మసాలా దినుసులు తప్పకుండా ఉంటాయి. ఇవి వంటలకు రుచి అందించడమే కాకుండా ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగిస్తాయి. మసాలా దినుసుల్లో ఒకటి గసగసాలు. ఇవి మంచి పోషక విలువలను కలిగి ఉంటాయి. రోజు వారి ఆహారంలో భాగంగా గసగసాలను చేర్చుకోవడం అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి. శరీరంలోని కణాల వాపు తగ్గడానికి, గుండె ఆరోగ్యం పనితీరు మెరుగుపరచడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. ఇన్ని లాభాలు ఉన్న గసగసాల గురించిన మరిన్ని ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

భారతీయులు గసగసాల ప్రత్యేకత తెలుసు. వంట రుచిని ఇవి మార్చేస్తాయి. గసగసాలతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. వంటగదిలో గసగసాలు అందరికీ సుపరిచితమే. కానీ గసగసాలు వంట చేయడానికి మాత్రమే ఉపయోగపడతాయనుకుంటాం.. కానీ గుండె జబ్బులు, జీర్ణక్రియ, జుట్టు, చర్మ సమస్యలు, నిద్రలేమి, మధుమేహం, ఎముక అసాధారణతలు, నరాల సమస్యలు వంటి అనేకవ్యాధులకు చికిత్స చేసే ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగి ఉంటాయి గసగసాలలో అనేక ఆరోగ్య ప్రయోజనాలు, పోషకాహారాలు ఉన్నాయి. 100 గ్రాముల మొత్తం గసగసాలలో కింది పోషకాలు ఉంటాయి.. పోషకాల మొత్తం శక్తి 536 కేలరీలు, ప్రోటీన్ 21.43 గ్రాములు, లిపిడ్ (కొవ్వు) 39.29 గ్రా, కార్బోహైడ్రేట్ 28.57 గ్రాములు, ఫైబర్ 25 గ్రాములు, చక్కెర 3.57 గ్రాములు, కాల్షియం 1,250 మిల్లీగ్రాములు, ఐరన్ 9.64 మి.గ్రా, మెగ్నీషియం 357 మి.గ్రా, జింక్ 8.04 మి.గ్రా ప్రధానంగా 3 రకాల గసగసాలు ఉన్నాయి. అవి తెల్ల గసగసాలు (వంట కోసం ఉపయోగించే ఆసియా లేదా భారతీయ గసగసాలు అని పిలుస్తారు), బ్లూ గసగసాలు (యూరోపియన్ గసగసాలుగా పిలుస్తారు, బ్రెడ్, ఇతర మిఠాయిలో ఒత్తిడి ఉపశమనం, ప్రశాంతమైన నిద్రకు దారితీస్తుంది. పడుకునే ముందు పాలలో గసగసాల టీ లేదా గసగసాల పేస్ట్ వేసి తాగడం వల్ల శరీరంలో మెటబాలిజం పెరిగి నిద్ర వస్తుంది. ఇది నిద్రలేమి వంటి సమస్యను నయం చేస్తుంది.

**మహిళల్లో వంధ్యత్వం :** స్త్రీలలో వంధ్యత్వాన్ని నివారించడంలో గసగసాలు, దాని నూనె చాలా మేలు చేస్తాయి. ట్రైడ్ ఫెలోపియన్ ట్యూబ్స్ ఫలదీకరణ గుడ్డు గర్భాశయ గోడకు అటాచ్ చేయకుండా నిరోధిస్తుంది. గసగసాలతో ఫెలోపియన్ ట్యూబ్‌లను ఫ్లష్ చేయడం ద్వారా,ఏదైనా శిధిలాలు లేదా శ్లేష్మ కణాలు కరిగి, అడ్డంకిని తొలగిస్తాయి. తద్వారా సంతానోత్పత్తి అవకాశాలు పెరుగుతాయి. గసగసాలలోని నార కామోద్దీపన లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది లిబిడోను పెంచుతుంది. లైంగిక జీవితాన్ని మెరుగుపరుస్తుంది.

**జీర్ణక్రియలో సహకరిస్తుంది :** ఫైబర్ పుష్కలంగా ఉండే గసగసాలు జీర్ణక్రియను ప్రోత్సహించడానికి చాలా ఉపయోగకరంగా ఉంటాయి. ఇది ఆహారం నుండి పోషకాలను గ్రహించడాన్ని పెంచుతుంది. ఇది మలబద్ధకాన్ని నయం చేస్తుంది. మలద్వారం ద్వారా వ్యర్థ పదార్థాలను సులభంగా వెళ్లేలా చేస్తుంది.

**గ్రహణ సామర్థ్యాన్ని పెంపొందించడం:** గసగసాలలో ఐరన్ పుష్కలంగా ఉన్నందున, అవి సహజంగా రక్తాన్ని శుద్ధి చేస్తాయి. రక్తంలో ఎర్ర రక్త కణాలు,హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచుతాయి. మెదడుకు ఆక్సిజన్, ఎర్ర రక్త కణాల తగినంత సరఫరా న్యూరోట్రాన్స్మిటర్ల ఉత్పత్తిని నియంత్రించడానికి, అభిజ్ఞా శక్తిని పెంచడానికి సహాయపడుతుంది. దీని ద్వారా మతిమరుపు వంటి సమస్యలు తగ్గుతాయి.

**గుండెను ఆరోగ్యంగా ఉంచడం:** గసగసాలు చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి.మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. ఇందులోని ఒలీక్ యాసిడ్ రక్తపోటును తగ్గిస్తే, ఒమేగా-6 ఫ్యాటీ యాసిడ్ గుండెకు మరింత మేలు చేస్తుంది. ఇది గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

**ఎముకల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం:** గసగసాలలో ఖనిజాలు, జింక్ కాపాడుతుంది.

**చర్మం, జుట్టు ఆరోగ్యం :** గసగసాలలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. చర్మం, జుట్టు మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. అలాగే చర్మం మంట, స్కాల్ప్ ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. గసగసాలలోని అధిక మొత్తంలో లినోలిక్ యాసిడ్ దురద, కాలిన గాయాలు, స్క్రాప్‌ల చికిత్సలో చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. గసగసాల పేస్ట్‌ను ఫేస్ మాస్క్‌గా ముఖానికి అప్లై చేయడం వల్ల మొటిమలు తొలగిపోయి, శుభ్రమైన, మెరిసే చర్మాన్ని అందిస్తాయి. మీ అందాన్ని మెరుగుపరుస్తుంది.

బరువు తగ్గేందుకు..బరువు తగ్గాలనుకునే వారు కచ్చితంగా గసగసాలు తినాలి.గసగసాలలో ప్రొటీన్, ఫైబర్, ఎనర్జీ, కార్బోహైడ్రేట్స్, ఐరన్, కాల్షియం, జింక్, విటమిన్ బి-6, ఒమేగా-6 ఫ్యాటీ యాసిడ్స్, మెగ్నీషియం, ప్రొటీన్ వంటి పోషకాలు ఉన్నాయి. గుండె, జీర్ణవ్యవస్థ, జుట్టు, చర్మం, నిద్రలేమి, మధుమేహం, ఎముకలు, నరాల సమస్యలతో సహా అనేక వ్యాధులలో ఇది ప్రభావవంతంగా ఉంటుంది.

**ఎముకల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది:** గసగసాలలో కాల్షియం ,కాపర్ ఎక్కువగా ఉంటాయి. మీ ఎముకలు బలహీనంగా ,నొప్పిగా ఉంటే గసగసాలు తినడం మంచిది. గసగసాలు ఎముకలను బలపరుస్తాయి. ఇందులోని మాంగనీస్ ప్రొటీన్ కొల్లాజెన్ ఏర్పడటానికి సహాయపడుతుంది. ఇది తీవ్రమైన ఎముక నష్టాన్ని నివారించవచ్చు.

**రోగనిరోధక శక్తిని పెంచుతుంది :** గసగసాలలో బయోయాక్టివ్ పదార్థాలు ,యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. అనేక రకాల ఇన్ఫెక్షన్ల నుండి శరీరాన్ని రక్షిస్తుంది. బలమైన యాంటీ బాక్టీరియల్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్ లక్షణాలతో, జింక్ జ్వరం, చలి, గొంతు నొప్పి ,ఇతర శ్వాసకోశ ఇన్ఫెక్షన్‌లను నివారించడంలో అత్యంత ప్రభావవంతమై నది. జీర్ణక్రియను మెరుగుపరచడానికి కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. గసగసాలలో డైటరీ ఫైబర్ పుష్కలంగా ఉంటుంది, ఇది జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది.

నుండి వ్యవసాయ రంగాన్ని కాపాడేందుకు శక్తివంతమైన ఉద్యమాలకు రైతులు సమయత్వం కావాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు దొండపాడు రమేష్ పిలుపునిచ్చారు శుక్రవారం రాందాస్, అధ్యక్షతన జరిగిన బోడియ తండ రైతు సంఘం శాఖ మహాసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు 75% శాతం వ్యవసాయ రంగం మీద ఆధారపడి ఉన్న దేశంలో పరిపాలించే పరిపాలకులు వ్యవసాయ రంగానికి 50 శాతం నిధులు కేటాయించడంలో పక్షపాతం చూపించడం వల్ల వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభంలో ఉన్నది అని ఆరోపించారు ప్రభుత్వాలువ్యవసాయరంగాన్ని కాపాడకపోతే దేశంలో ఆహార ఉత్పత్తులు తగ్గే ప్రమాదం ఉందని వారు తెలిపారు రైతులను రాజకీయాల చుట్టూ తిప్పుకుంటూ అధికారాల కోసం ఆర్భాటాలు తప్ప రైతులకు పాలకులు వరగబెట్టిందేమీ లేదని వారు రైతు సమస్యల కోసం నిరంతరం పోరాడే తెలంగాణ రాష్ట్ర రైతు సంఘాన్ని గ్రామ గ్రామాన బలోపేతం చేయాలని వారు పిలుపునిచ్చారు తనికెళ్ళ రెవిన్యూ పరిధిలో ఉన్న బోడతండ గ్రామానికి చెందిన వీధుల చెరువును బోడియా తండ గ్రామపంచాయతీ పరిధిలోకి తీసుకోవాలని పంట పొలాల పోయే రహదారులు అభివృద్ధి చేయాలని సాగర్ జలాలతో వీధులు జరుగును నింపుటకు ప్రత్యేక తూము ఏర్పాటు చేయాలని హెల్త్ సబ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ పాఠశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు ఈ మహాసభలో వడిత వీరన్న ధరావత్ రవి బానోతు వెంకన్న జర్పుల భీమ్లా హనుమ తేజావత్ రవి తావు రాందాస్ తదితరులు పాల్గొన్నారు. రైతు సంఘం బోడియ తండా గ్రామ అధ్యక్షుడిగా ధరావత్ రవి ప్రధాన కార్యదర్శిగా వడిత విరన్న తోపాటు తొమ్మిది మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

# నగర అభివృద్ధికి చిత్తశుద్ధితో చర్యలు

**రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు**

**30 కోట్లతో ఖమ్మం ఖిల్లా రోప్ వే పనులు**

**ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి తుమ్మల**





ఖమ్మం, యదార్థవాది ప్రతినిధి, జనవరి 17 : నగర అభివృద్ధికి చిత్తశుద్ధితో చర్యలు చేపట్టామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. శుక్రవారం మంత్రి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్ బల్లేపల్లి జయనగర్ కాలనీలో ఎల్.ఆర్.ఎస్. నిధులు 2 కోట్లతో చేపట్టిన సైడ్ డ్రైన్ నిర్మాణం, ఖమ్మం ఇల్లందు ఆర్ అండ్ బి రోడ్డు నుండి ఎస్సి కాలని చర్చి వరకు జయనగర్ కాలనిలో రోడ్డు పురోగతి పనులు, టి.యు.ఎఫ్.ఐ.డి.సి.నిధులు ఒక కోటి 25 లక్షలతో 3 వ డివిజన్ నందు సి.సి.రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అభివృద్ధి పనులు జరుగుతున్న సమయంలో దివంగత కార్పొరేటర్ జగన్ మన మధ్య లేకపోవడం చాలా బాధాకరమని, ఆయన డివిజన్ లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. గతంలో ఖానాపురం, బల్లెపల్లి, బాలాపేట్ నుంచి ఖమ్మం పట్టణంలో వచ్చిన వరద నివారణకు 200 కోట్లతో సర్ ప్లస్ నీరు ధంసలాపురం మీదుగా మళ్ళీ మున్నేరు వెళ్ళే విధంగా కాలువ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామని అన్నారు. ఖమ్మం ఖిల్లా, వెలుగుమట్ల అర్బన్ పార్క్ అభివృద్ధికి చర్యలు ప్రణాళికలు చేపట్టామని, ఈ రోజు వెలుగుమట్ల అర్బన్ పార్క్ కు 3 కోట్లు మంజూరు చేశామని అన్నారు. ఖమ్మం ఖిల్లా రోప్ వే ద్వారా సందర్శకులు వెళ్లేందుకు, పర్యాటక కేంద్రంగా తయారు చేసేందుకు 30 కోట్లతో పనులు చేపట్టామని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జనవరి 26 నుంచి అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, నూతన రేషన్ కార్డుల జారీ కార్యక్రమాలను ప్రారంభిస్తామని అన్నారు. మొదటి దశలో అత్యంత పేదలకు ప్రభుత్వ సహాయం అందుతుందని, తరువాత దశలవారీగా అర్హులందరికీ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటామని, ఎవరు కంగారు పడాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. ఉగాది నుండి రేషన్ కార్డుల క్రింద సన్న బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఈ సంవత్సరం మన జిల్లాలో లక్ష టన్నులు అధికంగా ధాన్యం సేకరణ జరిగిందని అన్నారు. సన్న రకం ధాన్యానికి 500 రూపాయలు బోనస్ అందించామని అన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నూతన వైద్య కళాశాల జిల్లాకు రావడంతో పాటు జిల్లా ఆసుపత్రిలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటు న్నామని, అలాగే మన పి.హెచ్.సి. లు, ఏరియా ఆసుపత్రిలను మంత్రి చొరవ వల్ల అభివృద్ధి చేసుకుంటూ పోతున్నామని అన్నారు. విద్యా రంగంలో మన పిల్లలు అద్భుతంగా ఎదగాలనే ఆకాంక్షతో జిల్లాలో 60 ఉన్నత పాఠశాలలో స్పోకెన్ ఇంగ్లీష్ కోర్సులు ప్రవేశ పెట్టామని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ఎప్పటికప్పుడు అవసరమైన మౌళిక వసతులు కల్పించుకుంటూ పోతున్నామని అన్నారు. జిల్లాలో 575 కోట్ల రూపాయలతో 2.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, 160 కోట్ల బోనస్ ఇచ్చామని అన్నారు. భక్త రామదాసు, నాగార్జున సాగర్, ఇతర ఎత్తిపోతల పథకాల క్రింద సాగు సజావుగా అందేలా చర్యలు చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర రావు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఆర్ అండ్ బి ఇఇ యుగంధర రావు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

# మళ్లీ పడిపోయిన యూరప్ జీడీపీ

న్యూఢిల్లీ, యదార్థవాది ప్రతినిధి, జనవరి 17 : జర్మనీ ఆర్థిక వ్యవస్థ బాహ్య షాక్‌లు, దేశీయ సమస్యలతో బాధపడుతోంది. వీటిలో రెడ్ టేప్, నైపుణ్యం కలిగిన కార్మికుల కొరత ఉన్నాయి. దీనిని ఎలా పరిష్కరించాలో రాజకీయ నాయకులు పలుపలు విధాలుగా ఆలోచిస్తున్నారు. ఆర్థిక వ్యవస్థను ఎలా పునరుద్ధరించాలనే దానిపై భిన్నాభిప్రాయాల మధ్య తన ఆర్థిక మంత్రిని తొలగించిన తర్వాత ఛాన్సలర్ ఓలాఫ్ స్కోల్జ్ మూడు పార్టీల సంకీర్ణ ప్రభుత్వం నవంబర్‌లో కూలిపోయింది జర్మనీ ఆర్థిక వ్యవస్థ వరుసగా రెండవ సంవత్సరం క్షీణించింది. బుధవారం విడుదల చేసిన ప్రాథమిక అధికారిక డేటా నుండి ఈ సమాచారం అందింది. ఆర్థిక వ్యవస్థ ప్రధాన సమస్యగా ఉన్న జర్మనీ ఎన్నికలకు కొన్ని వారాల ముందు ఈ గణాంకాలు విడుదలయ్యాయి. జర్మనీ ఆర్థిక వ్యవస్థ ఐరోపాలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. 2023లో తగ్గుదల తర్వాత జర్మనీ స్థూల దేశీయోత్పత్తి (ఉఆఖ) గత సంవత్సరం 0.2 శాతం తగ్గిందని ఫెడరల్ స్టాటిస్టికల్ ఆఫీస్ తెలిపింది.జర్మనీ ఆర్థిక వ్యవస్థ బాహ్య షాక్‌లు, దేశీయ సమస్యలతో బాధపడుతోంది. వీటిలో రెడ్ టేప్, నైపుణ్యం కలిగిన కార్మికుల కొరత ఉన్నాయి. దీనిని ఎలా పరిష్కరించాలో రాజకీయ నాయకులు పలుపలు విధాలుగా ఆలోచిస్తున్నారు. ఆర్థిక వ్యవస్థను ఎలా పునరుద్ధరించాలనే దానిపై భిన్నాభిప్రాయాల మధ్య తన ఆర్థిక మంత్రిని తొలగించిన తర్వాత ఛాన్సలర్ ఓలాఫ్ స్కోల్జ్ మూడు పార్టీల సంకీర్ణ ప్రభుత్వం నవంబర్‌లో కూలిపోయింది. దీని కారణంగా, ఫిబ్రవరి 23న షెడ్యూల్ కంటే ముందుగానే ఎన్నికలు జరుగుతాయి. తదుపరి ప్రభుత్వానికి నాయ కత్వం వహించే పోటీదారులు ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడానికి విరుద్ధమైన ప్రతిపాదనలను ముందుకు తెచ్చారు.

జర్మనీ ఆర్థిక వ్యవస్థ ఎందుకు సంక్షోభంలో ఉంది?: యూరప్‌లో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన జర్మనీ ఈ రోజుల్లో ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కొంటోంది. దీనికి ప్రధాన కారణాలు ప్రపంచ ఆర్థిక మందగమనం, ఇంధన సంక్షోభం, అంతర్గత నిర్మాణ సమస్యలు. ఇంధన సంక్షోభం: రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తర్వాత సహజ వాయువు సరఫరాలు తగ్గాయి. ఇంధన ధరలు పెరగడం వల్ల పరిశ్రమల ఉత్పత్తి ఖర్చులు పెరిగాయి, వాటి పోటీతత్వం తగ్గింది. ప్రపంచ డిమాండ్ తగ్గుదల: జర్మనీ ఆర్థిక వ్యవస్థ ఎక్కువగా ఎగుమతులపై ఆధారపడి ఉంది. కానీ ప్రపంచ మందగమనం, చైనా వంటి ప్రధాన మార్కెట్లలో తక్కువ డిమాండ్ కారణంగా ఆటోమొబైల్, యంత్రాలు, ఎలక్ట్రానిక్స్ రంగాలు ప్రభావితమయ్యాయి. సరఫరా గొలుసు సమస్యలు: ఊాఎఆ-19 మహమ్మారి నుండి ముడి పదార్థాల సరఫరాలో జాప్యం, పెరుగుతున్న ఖర్చులు పరిశ్రమలను దెబ్బతీశాయి. జనాభా సంక్షోభం: వేగంగా వృద్ధాప్యం చెందుతున్న జనాభా శ్రమశక్తిని తగ్గిస్తోంది. కొత్త తరం కొరత, పెరుగుతున్న సామాజిక సంక్షేమ వ్యయం ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడిని పెంచాయి. ద్రవ్యోల్బణం, వినియోగదారుల వ్యయం తగ్గుదల: ఇంధనం, నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం వినియోగదారుల డిమాండ్‌ను బలహీనపరిచింది. దీనికి పరిష్కార మార్గాలు: జర్మనీ తన ఇంధన వనరులను వైవిధ్యపరచాలి, పునరుత్పాదక ఇంధనంలో పెట్టుబడులను పెంచాలి. కొత్త సాంకేతికతలు, నైపుణ్య అభివృద్ధిపై దృష్టి పెట్టడం ద్వారా పరిశ్రమలను బలోపేతం చేయవచ్చు. అలాగే, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించాల్సి ఉంటుంది. అంతర్గత డిమాండ్‌ను పెంచాల్సి ఉంటుంది...ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడానికి, ఆర్థిక స్థిరత్వాన్ని కొనసాగించడానికి జర్మనీ ఆర్థిక వ్యవస్థకు దీర్ఘకాలిక సంస్కరణలు అవసరం.

# ప్రజల దృష్టిని మళ్లించేలా రాజకీయ ఎత్తుగడలు

**కేసులపై ప్రజలను తప్పదోవ పట్టిస్తున్న కెటీఆర్**

**రైతుభరోసాపైనా రాజకీయ ధర్నాలు**

**బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ జీవన్ రెడ్డి**

హైదరాబాద్, జనవరి17 : ప్రజల దృష్టిని మళ్లించడమే లక్ష్యంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ రాజకీయ ఎత్తుగడలు వేస్తున్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మండిపడ్డారు. బిఆర్ఎస్ పోరాటం చేయడంతోనే కాంగ్రెస్ రైతుభరోసా ఇచ్చిందని చెప్పడానికి ప్రయత్నాలు చేస్తున్నారని చురకలంటించారు. అందుకే బిఆర్ఎస్ నేతలు రైతు దీక్ష చేపట్టారని దుయ్యబట్టారు. రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ పాటుపడు తోందని, ఈ నెల 26 నుంచి రైతు భరోసా అమలు చేస్తామని స్పష్టం చేశారు. రైతు కూలీలకు ఆత్మీయ భరోసా కింద రూ.12 వేలు ఇస్తామని జీవన్‌రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేటీఆర్‌పై విచారణ జరుగుతోందని, అయితే తనపై వచ్చిన ఆరోపణలను కేటీఆర్ వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఫార్ములా కేసు రేసు నుంచి దృష్టి మరల్చే ఎత్తుగడలను కేటీఆర్ చేస్తున్నారని ఆక్షేపించారు.శుక్రవారం సీఎల్పీ మీడియా పాయింట్‌లో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. తాము దీక్ష చేస్తేనే కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా అమలు చేస్తుందని చెప్పుకోవడానికి బీఆర్ఎస్ నేతలు ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏడాదిలో దేశంలో ఎక్కడ లేని విధంగా రైతు సంక్షేమం కోసం పాటు పడుతుందని తెలిపారు. రైతు భరోసా పేరుతో ఈనెల 26వ తేదీ నుంచి రైతుకు ప్రోత్సహం కింద ఎకరాకు రూ.12 వేలు ఇస్తామని జీవన్‌రెడ్డి చెప్పారు. రైతు కూలీలకు ఆత్మీయ భరోసా కింద రూ.12 వేల ఆర్థిక సహాయం అందజేస్తామని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో రైతు బంధు పేరుతో ఏడాదికి రూ.8వేల నుంచి రూ.10 వేలు ఇచ్చిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.10 వేల నుంచి రూ.12 వేలు ఇస్తుందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో రూ.14వేలు కూడా కాంగ్రెస్ ఇవ్వబోతోందని అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా ఎకరాకు రూ.500 బోనస్ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు. రేషన్ కార్డుల పక్రియ కూడా ఈనెల 26వ తేదీ నుంచి ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు. బీఆర్ఎస్ హౌసింగ్ స్కీంను మర్చిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లు ఇస్తుందని అన్నారు. బీఆర్ఎస్ 2023 ఎన్నికల సమయంలో రైతు రుణమాఫీ ఎత్తివేసిందన్నారు. బీజేపీ రుణమాఫీ మాట ఊసే ఎత్తలేదని చెప్పారు. కాంగ్రెస్ రుణమాఫీ చేస్తుంటే కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా ఉండి నీతి ఆయోగ్‌లో ప్రస్తావిస్తే బాగుండేదని తెలిపారు. రైతాంగానికి ఉచిత విద్యుత్ మొదటగా కాంగ్రెస్ ప్రభుత్వమే ఇచ్చిందని జీవన్‌రెడ్డి



గుర్తుచేశారు.సన్నాలు పండిస్తే తెలంగాణలో రైతులకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తెలిపారు. దేశంలో ఎక్కడా రూ.500 బోనస్ ఇవ్వట్లేదని చెప్పారు. రేషన్ కార్డుల జారీని గత ప్రభుత్వం మర్చిపోయిందని విమర్శించారు. ఈ నెల 26 నుంచి వీటి జారీ కార్యక్రమం జరుగుతుందని వివరించారు.'గత ప్రభుత్వం రుణమాఫీ చేయలేదు.. వడ్డీ మాఫీ చేసింది. వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన మాట ప్రకారమే రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశాం. రుణమాఫీ కోసం కేంద్రం నుంచి రూ.10 వేల కోట్లు సాయం చేసి ఉంటే ప్రభుత్వానికి ఉపయోగపడేది' అని జీవన్‌రెడ్డి తెలిపారు.



కరీంనగర్, యదార్థవాది ప్రతినిధి, జనవరి 17 : కాగల కార్యం కౌశిక్ రెడ్డి తీర్చుతుంటే.. రేవంత్ రెడ్డి ఎందుకు తొందర పడుతున్నట్టు?ఇప్పటికే చాలా అరెస్టులు జరిగిపోయాయి.. మున్ముందు జరిగే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీకి వచ్చిన ఉపయోగం లేదు. భారత రాష్ట్ర సమితికి జరిగిన నష్టం కూడా లేదు. ఇలా అరెస్టు జరుగుతుంటే.. అలా బెయిల్ వచ్చేస్తోంది. అంత వీక్ గా పోలీసులు కేసులు పెడుతున్నప్పుడు.. ప్రభుత్వం ఇంత హంగామా చేయడం నిజంగా ఎందుకని ప్రశ్న సగటు కాంగ్రెస్ కార్యకర్త నుంచి వినిపిస్తోంది.: ప్రస్తుత ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేస్తున్న తీరు.. వారు బెయిల్ మీద బయటికి వస్తున్న తీరు ఒకింత హైడ్ అండ్ సీక్ గేమ్ ను తలపిస్తోంది. సహజంగా ఈ పరిణామాన్ని ప్రజల్లో సానుభూతిగా మలచుకోవడానికి భారత రాష్ట్ర సమితి రకరకాల ప్రయత్నాలు చేస్తోంది.. అందువల్లే జనంలోకి అక్రమ కేసులు అంటూ బీఆర్ఎస్ ప్రచారం చేస్తోంది. ఈ కేసులతో తమకు ఏమి కాదని గులాబీ నేతలకు కూడా తెలుసు. కాకపోతే వారికి కావాల్సింది ప్రచారం.. ప్రజల్లో పెంచుకోవలసిన ఇమ్యూనిటీ.. దానివల్లే తాము బలపడతామని వారికి కూడా తెలుసు.. అందువల్లే ప్రభుత్వం పెట్టే ఏ చిన్నపాటి కేసునైనా సరే గులాబీ నేతలు పెద్దగా ప్రచారం చేసుకుంటున్నారు. సొంత మీడియా, సోషల్ మీడియాలో యోధులు లాగా ప్రజెంట్ చేసుకుంటున్నారు. రేవంత్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 13 నెలలు దాటిపోయింది. ఈరోజుకు కూడా గులాబీ అగ్ర నేతలు కేటీఆర్, హరీష్ రావు, కవితను ఫిక్స్ చేసే ఒక కేసును కూడా గట్టిగా పెట్టలేకపోయాడు.. ఆరోపణల వరకు మాత్రమే పరిమితమవుతున్న ఆయన.. ఏ కేసులను బలమైన సాక్ష్యాలను బయట పెట్టలేకపోయారు. అందువల్లే లొట్ట పీస్ కేసు అని కేటీఆర్ అంటున్నాడు. ఏం పీక్కుంటావో పీక్కో అంటూ సవాల్ ఎన్నికల బాండ్లు చట్టబద్ధమైనప్పుడు.. గ్రీన్ కో కంపెనీ పై ప్రభుత్వం తీసుకునే చర్యలు ఎలా ఉంటాయనేది ఆసక్తికరం.క్యాబినెట్ ఆమోదం లేకుండానే.. సర్కారు సమ్మతి తెలపకుండానే నిధులు ఇచ్చారనే విషయంపై కేసు పెట్టారు. ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ కూడా ఇందులో ప్రవేశించింది. కానీ విధానపరమైన లోపాలు వేరు.. అవినీతి అనేది వేరు.. ఈ కేసులో అవినీతిని నిరూపించడం చాలా కష్టమని అధికారులు అంటున్నారు.. కవిత మీద ఆమధ్య ఢిల్లీ మద్యం ముడుపుల కేసు నమోదయింది. చివరికి ఆమెకు బెయిల్ వచ్చింది. అయితే అన్ని రోజులు ఆమె జైల్లో ఉండడం రేవంత్ ఘనత కాదు.. కానీ ఆ కేసు తర్వాత.. బెయిల్ మీద వచ్చి విడుదలైన తర్వాత కవిత మరింత బలోపేతమైంది. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో తిరుగుతోంది. ఇలా కేసులు పెట్టడం ద్వారా గులాబీ నేతల మీద క్షేత్రస్థాయిలో ప్రజల్లో సానుభూతి పెరుగుతుంది అంటే.. ఈ ప్రశ్నకు సమాధానం లభించడం కష్టమే.ఉదాహరణకు పాడి కౌశిక్ రెడ్డి ఉదంతాన్ని పరిగణలోకి తీసుకుంటే.. పోలీసులు అరెస్టు చేసి హడావిడి చేశారు.. అత్యంత వీక్ గా రిమాండ్ రిపోర్ట్ రెడీ చేశారు. ఈ మాత్రం దానికి రచ్చ రచ్చ చేశారు.. బెయిల్ ఇచ్చే కేస్ అయితే.. ఎందుకు అరెస్ట్ చేశారో పోలీసులకే తెలియాలి. కౌశిక్ రెడ్డి దారుణంగానే మాట్లాడుతున్నాడు. దురుసుగా వ్యవహరిస్తున్నాడు. అలాంటి వాళ్ళ జోలికి రేవంత్ వెళ్లకపోవడమే మంచిది. ఐనా కాగల కార్య కౌశిక్ రెడ్డి తీర్చుతుంటే రేవంత్ రెడ్డి తొందరపడటం నిజంగా హాస్యాస్పదం. స్థూలంగా చెప్పాలంటే నేటికి రేవంత్ రెడ్డికి అధికారుల మీద పట్టు దొరకలేదు. ఎప్పటికప్పుడు కేసులు వివరాలు గులాబీ నేతలకు వెళ్లిపోతున్నాయి. ఈ లెక్కన చూస్తే రేవంత్ ఎలాంటి అడుగులు వేసినా.. కష్టమే.. ఎందుకంటే ఇంటిగుట్టు లంకకు చేటు.

ఆర్థిక సంవత్సరంలో 290 రోజుల్లో 200 మిలియన్ టన్నుల సరుకు లోడింగ్ చేయడం ద్వారా ఈస్ట్ కోస్ట్ రైల్వే గత రికార్డులను బద్దలు కొట్టిందని రైల్వే అధికారులు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. దేశంలోని ఏ రైల్వే జోనూ సాధించని విధంగా 2025 జనవరి 15 నాటికి ఈ మైలు రాయిని చేరుకుందని పేర్కొన్నారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే 2023- 24 ఆర్థిక సంవత్సరంలో ఇదే మైలురాయిని చేరుకోవడానికి 295 రోజులు పట్టగా, ఈ ఏడాది 5 రోజుల ముందుగానే ఆ మైలురాయిని అందుకుందని తెలిపారు. గతంలో 200 మెట్రిక్ టన్నుల సరుకు లోడింగ్‌కు 300 రోజులు పైనే పట్టేదని పేర్కొన్నారు. గతంతో పోలిస్తే 1.6 శాతం సరుకు రవాణా పెరిగిందని తెలిపారు. ఈ రవాణాలో 119.637 మెట్రిక్ టన్నుల బొగ్గు, 7.67 మెట్రిక్ టన్నుల ఉక్కు కర్మాగారాలకు ముడిసరుకులు, 15.991 మెట్రిక్ టన్నుల పిగ్ ఐరన్ అండ్ ఫినిష్డ్ స్టీల్, 24.426 మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజం, 0.88 మెట్రిక్ టన్నుల సిమెంట్, 2.226 మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు, 5.477 మెట్రిక్ టన్నుల ఎరువులు, 2.317 మెట్రిక్ టన్నుల మినరల్ ఆయిల్, 4.372 మెట్రిక్ టన్నుల సరుకులు రవాణా జరిగినట్లు వివరించారు. ఈ సరుకు రవాణా ద్వారా ఈస్ట్ కోస్ట్ రైల్వే ఆదాయం రూ.20.288 కోట్లు ఆదించిందనిపేర్కొన్నారు. ప్రధానంగా డబ్లింగ్ మూడు, నాలుగవ లైన్ ప్రాజెక్టులతో కొత్త రైలు మార్గాల నిర్మాణం, కనెక్టివిటీ, మౌలిక సదుపాయాల ద్వారా పరిశ్రమలను- ఒడరేవులను అనుసంధానం, కీలకమైన సరుకు రవాణా కేంద్రంగా జోన్‌ను బలోపేతం చేయడం, సకాలంలో సరుకు రవాణా, పరిశ్రమలతో నిరంతరం సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లడం వంటి అంశాలు కీలక పాత్ర పోషించాయని వివరించారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు




కమాన్‌పూర్, యదార్థవాది ప్రతినిధి, జనవరి 17: రామగిరి మండలం వేంకట్రావుపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ బుర్ర శశికళ ముత్యాలు గౌడ్ సహకారంతో లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటీనరీకాలని వారి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రేకుర్తి కంటి ఆసుపత్రి, కరీంనగర్ వారి ఆధ్వర్యంలో డాక్టర్ ప్రభాకర్ మరియు డాక్టర్ శరణ్య ఆధ్వర్యంలో పరీక్షలు చేసి ఆపరే షన్ అవసరం ఉన్న వారిని ఎంపిక చేసి ఉచిత రవాణా సౌకర్యం కల్పించి రేకూర్తి హాస్పిటల్ తీసుకెళ్లడం జరిగింది. అనంతరం క్లబ్ అధ్యక్షుడు మొలుమురి శ్రీనివాస్,మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ హాస్పిటల్ ధీటుగా కంటి ఆపరేషన్ రెకుర్తి హాస్పటల్లో అన్ని సౌకర్యాలు కల్పించి ఉచితంగా ఆపరేషన్ చేయడం జరుగుతుంది. భవిష్యత్తులో ఇంకా ఎంతో మంది పేదవారికి సహాయం చేయడం లక్ష్యంగా లయన్స్ క్లబ్ ముందుకు వెళ్తుందని తెలిపారు. మీ గ్రామంలో కూడా వైద్య శిబిరం ఏర్పాటు చేయాలనుకుంటే లయన్స్ క్లబ్ ను సంప్రదించాలని కోరారు.ఇట్టి కార్యక్రమానికి సహకరించిన రేకుర్తి హాస్పిటల్ చైర్మన్ కొండ వేణుమూర్తి, వైస్ చైర్మన్ సిదుర సురేష్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు మేకల మారుతి యాదవ్, పరంకుసం శ్రీనివాస్ చారి మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ట్రిపుల్ఆర్ సౌత్‌పై గందరగోళం!



### రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై ఎన్‌హెచ్ఏఐ విస్మయం
### వికసిత్ భారత్‌లో చేపడతామని చెప్పిన కేంద్రం
### అయినా డీపీఆర్ పేరుతో రాష్ట్ర సర్కారు హడావుడి

హైదరాబాద్, యదార్థవాది ప్రతినిధి, జనవరి 17 : రాష్ట్ర ప్రభుత్వ వైఖరితో ప్రాంతీయ రింగు రోడ్డు (ట్రిపుల్ ఆర్) దక్షిణ భాగం వ్యవహారం గందరగోళంగా మారింది. వికసిత్ భారత్-2047 కార్యక్రమంలో భాగంగా జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) ఆధ్వర్యంలో చేపట్టనున్నట్టు కేంద్రం ఇదివరకే ప్రకటించింది. అయినా దీనిపై డీఆర్ఎస్ తయారీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం హడావుడి చేస్తున్నది. తాము చేపట్టే ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్ ఎందుకు తయారు చేయిస్తున్నదని ఎన్‌హెచ్ఏఐ అధికారులు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ట్రిపుల్ ఆర్‌కు అంకురార్పణ జరగ్గా, అప్పటి కేసీఆర్ సర్కారు విజ్ఞప్తిమేరకు కేంద్రం పచ్చజెండా ఊపింది. ఇందులో భాగంగా సంగారెడ్డి నుంచి నర్సాపూర్, మాసాయిపేట్, తూప్రాన్, గజ్వేల్, ప్రజ్ఞాపూర్, యాదాద్రి, వలిగొండ మీదుగా చౌటుప్పల్ వరకు 158.65 కిలోమీటర్ల మేర ఉత్తర భాగం, చౌటుప్పల్ నుంచి సంస్థాన్ నారాయణపూర్, చండూరు, మర్రిగూడ, ఆమన్‌గల్లు, కేశంపేట్, షాద్‌నగర్, షాబాద్, చేవెళ్ల, నవాబ్‌పేట మీదుగా సంగారెడ్డి వరకు 189 కిలోమీటర్ల మేర దక్షిణ భాగాన్ని నిర్మించాలని గతంలో ప్రణాళికలు సిద్ధం చేసి కేంద్రానికి సమర్పించారు. రోడ్డును ఉత్తర, దక్షిణ భాగాలుగా కేంద్రం విభజించింది. ట్రాఫిక్ అధ్యయనం ప్రకారం దక్షిణ భాగానికి ఇప్పుడే తొందరేమీలేదని నిర్ణయించి ఉత్తర భాగం పనులను 'భారత్ మాల' కార్యక్రమంలో మంజూరు చేసింది. భూసేకరణలో సమస్యల కారణంగా ఇంతకాలం జాప్యం జరగ్గా, ఇటీవలే ఉత్తర భాగం పనులను ఐదు ప్యాకేజీలుగా విభజించి టెండర్లను ఆహ్వానించారు. డీపీఆర్ రూపకల్పన సందర్భంగా ఉత్తర భాగం పొడవు 158.65 నుంచి 161.5కి పెరిగింది. ఉత్తర భాగం పనులతోపాటే దక్షిణ భాగం పనులను కూడా పూర్తిచేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం విజ్ఞప్తి చేయగా, వికసిత్ భారత్-2047లో చేపడతామని కేంద్రం ఆనాడే హామీ ఇచ్చింది. పనులపై ద్వంద్వ వైఖరి: కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక దక్షిణ భాగం పనులను తామే చేపడతామని ప్రకటించింది. ఈ మేరకు ఆర్అండ్‌బీ శాఖ ముఖ్య కార్యదర్శి నేతృత్వంలో అధికారుల కమిటీని ఏర్పాటుచేయడమే కాకుండా కన్సల్టెంటు ద్వారా మరో అలైన్‌మెంట్‌ను రూపొందించింది. కొత్త అలైన్‌మెంటు ప్రకారం పొడవు 189 కిలోమీటర్ల నుంచి 195కి పెరిగింది. ఈ అలైన్‌మెంట్ ప్రకారం రహదారి నిర్మాణంపై సీఎం అధ్యక్షతన పలుమార్లు సమావేశాలు కూడా నిర్వహించారు. రహదారి వెళు న్న ప్రాంతాల్లో వివిధ శాఖల అధికారులతో సామాజిక ఆర్థిక సర్వేను కూడా నిర్వహించారు. భూసేకరణ సహా రహదారి నిర్మాణానికి దాదాపు రూ.20 వేల కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనాలను రూపొందించారు. ఎన్‌హెచ్ఏఐ ఆధ్వర్యంలో రహదారిని నిర్మిస్తే.. భూసేకరణ ఖర్చులో రాష్ట్ర ప్రభుత్వం సగం భరిస్తే సరిపోతుంది. రహదారి నిర్మాణం పూర్తిగా కేంద్రం ఆధ్వర్యంలోనే నిర్మిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మిస్తే ఖర్చు మొత్తం రాష్ట్రమే భరించాల్సి ఉంటుంది. దీంతో రాష్ట్ర సర్కారు ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం నిర్మించాలనే ఆలోచనను విరమించుకున్నది. అంతేకాదు, దక్షిణ భాగం పనులు త్వరలో చేపట్టాలని కేంద్రానికి లేఖ రాసింది. డీపీఆర్ రూపకల్పన ఎందుకో?: త్వరగా దక్షిణభాగం పనులు చేపట్టాలని కోరుతున్న రాష్ట్రం.. ఇదే దక్షిణ భాగం కోసం డీపీఆర్ రూపకల్పనకు టెండర్లను ఆహ్వానించడంపై గందరగోళం నెలకొన్నది. ఎన్‌హెచ్ఏఐ చేపట్టిన ప్రాజక్టు కోసం అలైన్‌మెంట్ నుంచి డీపీఆర్‌ల తయారీ, టెండర్ల ప్రక్రియను అంతా ఆ సంస్థయే చూసుకుంటుంది. డీపీఆర్ ఖరారయ్యాక రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏవైనా అభ్యంతరాలున్నా, మార్పులు, చేర్పులు ఉన్నా సూచించవచ్చు. ఇక్కడ ఏకంగా రాష్ట్ర ప్రభుత్వమే డీపీఆర్ రూపొందించడం వెనుక కారణం ఏమిటనేది ఎవరికీ అంతుబట్టడం లేదు. ఎన్‌హెచ్ఏఐ వద్ద మాత్రం ఇప్పటికీ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూపొందించిన ముసాయిదా అలైన్‌మెంట్ మాత్రమే ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మార్చిన అలైన్‌మెంట్ ఇంకా ఎన్‌హెచ్ఏఐకి చేరనేలేదు. రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్ రూపొందిస్తున్న విషయం కూడా తమకు తెలియని ఎన్‌హెచ్ఏఐ అధికారులు చెప్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ డీపీఆర్‌ను ఎన్‌హెచ్ఏఐ ఏ మేరకు పరిగణనలోకి తీసుకుంటుందనేది కూడా తేలాల్సి ఉన్నది.

# సంక్రాంతి బరిలో 3 వేల కోట్ల పందేలు



విజయవాడ, యదార్థవాది ప్రతినిధి, జనవరి 17 : తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. ఓవైపు పిండి వంటలు, రంగవల్లులు, గొబ్బెమ్మలు, పూజలు, భోగి మంటలు జరుపుకున్నారు. మరోవైపు కోడి పందాలు, గుండాటలతోపాటు అనేక క్రీడా పోటీలు కొనసాగాయి. కోడి పందాలు జరిగిన ప్రాంతాలు మినీ స్టేడియం నే తలపించాయి. ఎటు చూసినా టెంట్లు, కుర్చీలు, ఎల్ఈడి స్క్రీన్లు, గ్యాలరీలు, కామెంట్రీ లు? ఇలా ఒకటేమిటి అన్ని చిత్ర విచిత్రాలు కొనసాగాయి.ముఖ్యంగా ఉభయగోదావరి జిల్లాలతో పాటు కోస్తా జిల్లాల్లో కోడి పందాలు కొనసాగాయి. భారీగా బరులు ఏర్పాటు చేశారు. మూడు రోజులపాటు రెండు వేల కోట్ల రూపాయల వరకు బెట్టింగ్ కొనసాగినట్లు ప్రచారం నడుస్తోంది. కోనసీమ నుంచి మొదలుపెడితే రాయలసీమ వరకు పంద్యాలు కొనసాగినట్లు తెలుస్తోంది. సంక్రాంతి తొలి రోజు అయిన భోగినాడు 350 కోట్ల రూపాయల సాగగా? ఆ తరువాత సంక్రాంతి రోజున ఏకంగా 600 కోట్ల రూపాయల బెట్టింగ్ సాగినట్లు తెలుస్తోంది. కనుమ రోజు ఒక్క రోజే వెయ్యికోట్ల పందాలు జరిగినట్లు సమాచారం. పశ్చిమగోదావరి జిల్లాలో ఒక్క కోడిపందమే రికార్డు స్థాయిలో కోటి 25 లక్షలు పలికినట్లు చెబుతున్నారు. తాడేపల్లిగూడెం బైబోయిన వెంకటరామయ్య తోటలో భారీగా బెట్టింగ్ సాగినట్లు తెలుస్తోంది. ఏపీలోనే ఇది హైలెట్ అన్నట్లు సమాచారం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో.. ఉమ్మడి తూర్పుగోదావరి( జిల్లాలోని కోనసీమ, కాకినాడ జిల్లాల్లో 500 కోట్ల రూపాయల మేర బెట్టింగ్ సాగినట్లు ప్రచారం నడుస్తోంది. కోడిపందాలతో సమానంగా గుండాట కూడా నడిచింది. ప్రధానంగా కాకినాడ జిల్లాలో మూడు రోజుల్లో 250 కోట్లకు పైగా పందాలు జరిగినట్లు సమాచారం. తూర్పుగోదావరి జిల్లాలో 150 కోట్లు, కోనసీమ జిల్లాలో 100 కోట్లు సాగగా.. గుండాట రూపంలో మరో 50 కోట్ల రూపాయలు బెట్టింగులు సాగాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 500 కోట్ల రూపాయలు చేతులు మారినట్లు తెలుస్తోంది. కాకినాడ జిల్లాలో.. కాకినాడ జిల్లాలో గుండాట వ్యాపారులకు కాసులు పంట పండించినట్లు తెలుస్తోంది. ఒక్కో గ్రామంలో రెండు నుంచి నాలుగు గుండాట బోర్డులను ఏర్పాటు చేశారట. అక్కడ లక్షల్లో లావాదేవీలు జరిగాయట. ప్రత్తిపాడు మండలంలోని ఓ గ్రామంలో సంక్రాంతి మూడు రోజులు కలిపి ఓ గుండాట నిర్వాహకుడు ఏకంగా కోటి 20 లక్షల బిజినెస్ సాగించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఓ వ్యాపారి అయితే 25 లక్షల రూపాయలు సంపాదించినట్లు తెలుస్తోంది. మురమళ్ళ, కరప లో సైతం భారీగా గుండాట సాగినట్లు సమాచారం. ఉమ్మడి కృష్ణాజిల్లాలో.. ఉమ్మడి కృష్ణాజిల్లాలో కోడిపందాలు, పేకాట శిబిరాలు భారీగా నడిచినట్లు సమాచారం. తెలంగాణ సరిహద్దు అయిన జగ్గయ్యపేట నుంచి మచిలీపట్నం, హనుమాన్ జంక్షన్ వరకు బరులను ఏర్పాటు చేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో సాగిన కోడిపందాలలో 400 కోట్ల రూపాయలు చేతులు మారినట్లు స్థానికులు చెబుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఒక్కో పందెం లక్ష నుంచి 7 లక్షల వరకు సాగినట్లు తెలుస్తోంది. వీఐపీ వరుణ్ లో అయితే మూడు నుంచి ఐదు లక్షలకు పైగానే పందాలు కాసినట్లు స్థానికులు చెబుతున్నారు. మొత్తానికి అయితే కోడిపందాల రూపంలో దాదాపు రెండు వేల కోట్ల రూపాయలు బెట్టింగ్ జరగడం విశేషం.




# ఊహించని న్యూస్..సాయి పల్లవి



సౌత్ ఇండస్ట్రీలో న్యాచురల్ స్టార్ సాయి పల్లవి పాపులారిటీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తెలుగు, తమిళం, మలయాళం సినిమాల్లో వరుస హిట్లతో క్రేజ్ సంపాదించుకున్న ఈ టాలెంటెడ్ బ్యూటీ, ఇప్పుడు బాలీవుడ్‌లో అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం హిందీలో తెరకెక్కుతున్న 'రామాయణం' సినిమాలో సాయి పల్లవి కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రంలో రణబీర్ కపూర్, యష్ వంటి స్టార్ హీరోలు కూడా ఉన్నారు.గత ఏడాది 'అమరన్' సినిమాతో సాయి పల్లవి పెద్ద విజయాన్ని అందుకున్నారు. శివకార్తికేయన్ హీరోగా నటించిన ఈ సినిమాకు రాజ్ కుమార్ పెరియసామి దర్శకత్వం వహించారు. ఇక ఇప్పుడు ఆమె అక్కినేని నాగచైతన్య సరసన 'తండేల్' అనే చిత్రంలో నటిస్తున్నారు. తమిళనాడు కోయంబత్తూరు జిల్లాలో జన్మించిన సాయి పల్లవి, జార్జియాలో వైద్య విద్యను పూర్తి చేసిన తర్వాత మలయాళంలో 'ప్రేమమ్' సినిమాతో ఎంట్రీ ఇచ్చారు. తొలి సినిమాతోనే ప్రేక్షకులను ఆకట్టుకున్న సాయి పల్లవి, వెండితెరపైకి రాకముందు బుల్లితెరపై డ్యాన్స్ పోటీల్లో చురుగ్గా పాల్గొన్నారు.'ప్రేమమ్' సినిమా సూపర్ హిట్ కావడంతో, మలయాళంలో వరుస సినిమాల్లో అవకాశాలు అందుకున్న సాయి పల్లవి, 2018లో 'కరు' సినిమా ద్వారా కోలీవుడ్‌లో హీరోయిన్‌గా అడుగుపెట్టారు. తెలుగు ప్రేక్షకులను మాత్రం 'ఫిదా' సినిమాతో కనువిందు చేశారు. ఆ తర్వాత బ్యాక్ టూ బ్యాక్ హిట్లతో స్టార్ స్టేటస్‌ను దక్కించుకున్నారు.ఇప్పటికే స్టార్ హీరోల సరసన నటించిన సాయి పల్లవి, ఇప్పుడు లేడీ ఓరియెంటెడ్ కథలపైన ఆసక్తి చూపుతున్నట్లు టాక్. త్వరలోనే ఆమె మహిళా ప్రాధాన్య కథా చిత్రాల్లో నటించబోతున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్ట్‌ను తెలుగు ప్రేక్షకులకు కూడా అందించేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. సాయి పల్లవి కొత్త ప్రయాణం ఎలా ఉండబోతుందో చూడాలి.

## ఏం గురాయించి చూస్తున్నవ్.. వీరమల్లు మాట వినాలి..

### పవన్ కల్యాణ్ హరిహరవీరమల్లు ఫస్ట్ సింగిల్ వీడియో




టాలీవుడ్ యాక్టర్ పవన్ కల్యాణ్ పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ హరిహరవీరమల్లు. జ్యోతికృష్ణ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ మూవీ రెండు పార్టులుగా రానుండగా.. హరిహరవీరమల్లు పార్ట్ 1 మార్చి 28న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఫస్టి సింగిల్ వినాలి.. వీరమల్లు మాట వినాలి ప్రోమో కూడా విడుదల చేయగా.. నెట్టింట వైరల్ అవుతోంది. తాజాగా ఫుల్ లిరికల్ వీడియో సాంగ్ లాంచ్ చేశారు. ఏం గుల్పామ్ ఏం గురాయించి చూస్తున్నవ్ భయపెట్టనీకా..? ఓహో చాలా మందిని చూసినాంలే బిడ్డా. హే మునిమాణిక్యం చూసినవా.. గురాయించి చూస్తుండు బేటా.. మన లెక్క తెల్వదు.. వినాలి.. వీరమల్లు మాట చెబితే వినాలి.. అంటూ తెలంగాణ యాసలో పవన్ కల్యాణ్ స్టైల్‌లో సాగుతున్న లిరిక్స్ ఆకట్టుకుంటూ.. అభిమానులను థ్రిల్ చేస్తున్నాయి. పెంచల్ దాస్ రాసిన ఈ పాటను ఎంఎం కీరవాణి కంపోజిషన్‌లో పవన్ కల్యాణ్ పాడాడు. ఈ సాంగ్ సినిమాకే హైలెట్‌గా నిలువనుందనడంలో ఎలాంటి సందేహం లేదు. పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీలో బాలీవుడ్ నటుడు, దర్శక నిర్మాత అనుపమ్ ఖేర్, అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని మేఘ సూర్య ప్రొడక్షన్ బ్యానర్‌పై ఏ దయాకర్‌రావు నిర్మిస్తున్నారు. ఏఎం రత్నం సమర్పికుడిగా వ్యవహరిస్తున్నారు. క్లైమాక్స్‌లో వచ్చే రెడ్ డ్రెస్ ఫైట్‌ను 42 రోజులపాటు చిత్రీకరించారని ఇన్‌సైడ్ టాక్. ఇక ఈ చిత్రంలో ఇంట్రో సాంగ్, టైగర్ ఫైట్, మహల్ యాక్షన్ పార్ట్, కుస్తీ ఫైట్ సీన్, చార్మినార్ యాక్షన్ సన్నివేశాలు, ప్రీ ఇంటర్వెల్, ఇంటర్వెల్ భారీ యాక్షన్ సీక్వెన్స్, క్లైమాక్స్ వార్ సీన్ అభిమానులకు గూస్ బంప్స్ తెప్పించబోతున్నాయట.

## ఎంపీ ప్రియా సరోజ్‌తో రింకు సింగ్ నిశ్చితార్థం..?



టీమిండియా యువ బ్యాట్స్‌మెన్ రింకు సింగ్ ఓ ఇంటివాడు కాబోతున్నాడని.. సమాజ్‌వాదీ పార్టీకి చెందిన మచిలీషహర్ ఎంపీ ప్రియా సరోజ్‌తో నిశ్చితార్థం ప్రచారం జరిగింది. ఈ విషయంలో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పెద్ద సంఖ్యలో నెటిజన్లు వారికి శుభాకాంక్షలు తెలుపుతూ వచ్చారు. అయితే, నిశ్చితార్థం వార్తలపై ఎంపీ ప్రియా సరోజ్ తండ్రి తుఫానీ సరోజ్ మీడియాతో మాట్లాడారు. నిశ్చితార్థం వార్తలు వట్టి పుకార్లేనని స్పష్టం చేశారు. వాటిని ఎవరూ నమ్మొద్దని.. అందులో ఏమాత్రం నిజం లేదన్నారు. టీమిండియా యువ ఆటగాడు రింకు సింగ్ గత రెండేళ్లుగా బ్యాట్‌తో రాణిస్తున్నాడు. త్వరలో ఇంగ్లాండ్‌తో జరుగనున్న టీ20 సిరీస్‌లో పాల్గొననున్నాడు. ఈ నెల 22 నుంచి ఇంగ్లాండ్‌తో సిరీస్ జరుగనున్న విషయం తెలిసిందే. ఇక ప్రియా సరోజ్ గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందారు. బీజేపీ అభ్యర్థిపై 35వేలకుపైగా ఓట్ల తేడాతో గెలిచి పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. పార్లమెంట్‌కు ఎన్నికైన రెండో పిన్న వయస్కురాలిగా నిలిచింది. ఆమె వసయు 26 సంవత్సరాలు మాత్రమే. ఆమె యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ నుంచి బీఏ డిగ్రీతో పాటు నోయిడాలోని అమిటీ యూనివర్సిటీ నుండి ఎల్‌ఎల్‌బీ పట్టా అందుకున్నారు. ఆమె స్వస్థలం యూపీలోని వారణాసి. ప్రియా సరోజ్ తండ్రి తుఫానీ సరోజ్ సైతం మూడుసార్లు ఎంపీగా ఎన్నిక కాగా.. ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

## పుష్పరాజ్‌కు చైన్ ఇచ్చిన అన్నయ్య

### 20 నిమిషాల నిడివిని యాడ్ చేసిన సినిమా బృందం



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రధాన పాత్రలో నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ చిత్రం 'పుష్ప 2 ది రూల్'. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో రష్మిక కథానాయికగా నటించింది. డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే రూ.1850 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం రూ.2000 కోట్ల దిశగా దూసుకెళుతుంది. అయితే ఈ సినిమాకి సంబంధించి రీలోడెడ్ వెర్షన్ విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సినిమాలో విడుదలకు ముందు డిలీట్ చేసిన 20 నిమిషాలను మేకర్స్ శుక్రవారం యాడ్ చేశారు. ముందుగా జనవరి 11న యాడ్ చేద్దామనుకున్నా అనుకోని కారణాల వలన జనవరి 17కి వాయిదా వేసింది. తాజాగా 20 నిమిషాల డిలీటెడ్ సీన్స్ థియేటర్ వెర్షన్‌లో కలిపింది. అయితే ఈ సీన్స్‌లో ఒక హైలెట్ సీన్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ సీన్ ఎంటంటే.. పుష్ప పార్ట్ 1లో.. పుష్ప రాజ్(అల్లు అర్జున్) మెడలో ఉన్న లాకెట్‌ను అతడి అన్నయ్య (అజయ్) కోపంతో తీసుకోని వెళతాడు. అయితే అదే చైన్‌ను తీసుకువచ్చి పార్ట్ 2 క్లైమాక్స్‌లో పుష్పరాజ్ మెడలో వేస్తాడు అజయ్. ఈ సన్నివేశాన్ని విడుదల ముందు కట్ చేశారు మేకర్స్. మరోవైపు సుకుమార్ ఈ విషయం ఎలా మార్చిపోయాడు అంటూ విడుదల తర్వాత దీనిపై చర్చ కూడా జరిగింది. అయితే కొత్తగా యాడ్ చేసిన వాటిలో ఈ సీన్ కూడా ఉండడంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుషి అవుతున్నారు.

## తెలుగు ప్రజల ఆరాధ్య నటుడు, నాయకుడు నందమూరి తారక రామారావు

### -నేడు ఆయన వర్ధంతి



**( పెండ్యాల రామ్ కుమార్,మంథని ):** రాముడు, కృష్ణుడు, రావణుడు, దుర్యోధనుడు లాంటి పౌరాణిక పాత్రల్లో నటించి తెలుగు వారి గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచిన యుగపురుషుడు ఎన్‌టిఆర్. జానపదం, సాంఘికం, పౌరాణికం అనే తేడా లేకుండా అన్ని పాత్రల్లో జీవించిన విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు నందమూరి తారక రామారావు కృష్ణా జిల్లా నిమ్మకూరులో 1923 మే 28న జన్మించారు. ఆయన తల్లిదండ్రులు లక్ష్మయ్య చౌదరి, వెంకట రామమ్మ.ఎన్‌టిఆర్ పాఠశాల విద్య విజయవాడ మున్సిపల్ హై స్కూల్‌లో పూర్తి చేసి ఎస్ ఆర్ ఆర్ కాలేజీలో చేరాడు. కళాశాల విద్య కొనసాగుతుండగానే మేనమామ కూతురు బసవ తారకంను వివాహమాడి గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కాలేజీలో బిఎ చేశారు. ఎన్‌టిఆర్‌కు మొదటి నుంచి నాటక రంగంపై మక్కువ ఎక్కువ. విజయవాడ ఎస్ ఆర్ ఆర్ కాలేజీలో చదువుతున్నప్పుడు నాగమ్మ పాత్ర వేశారు. నూనూగు మీసాలు తీసేందుకు ససేమిరా అనడంతో ఆ పాత్రకు మీసాల నాగమ్మ అని పేరు తగిలించారు. గుంటూరు క్రిస్టియన్ కళాశాలలో చదువుతున్నప్పుడు నేషనల్ ఆర్ట్ థియేటర్‌ను ఏర్పాటు చేసి జగ్గయ్య, ముక్కామల, నాగభూషణం తదితరులతో "చేసిన పాపం" వంటి నాటకాలు ఆడారు. సినిమా రంగంపై మక్కువతో మంగళగిరిలో సబ్ రిజిస్ట్రార్‌గా చేస్తోన్న ఎన్‌టిఆర్ చెన్నై ట్రేన్ ఎక్కేశారు. తొలి అవకాశం 'పల్లెటూరి పిల్ల' సినిమాకు వచ్చినా విడుదలైంది మాత్రం 'మనదేశం' చిత్రం. షావుకారు చిత్రం తరువాత నివాసాన్ని చెన్నై థౌజండ్ లైట్స్ ప్రాంతానికి మార్చుకున్నారు. విజయావారి బ్యానర్‌పై వచ్చిన పాతళభైరవి, మల్లీశ్వరి, పెళ్లిచేసి చూడు, చంద్రహారం చిత్రాలు ఎన్‌టిఆర్‌ను తిరుగులేని నటుడిగా నిరూపించాయి. మాయాబజార్, లవకుశ, శ్రీకృష్ణార్జున యుద్ధం, భీష్మ, భూకైలాష్, నర్తనశాల, పాండవ వనవాసం, శ్రీ వెంకటేశ్వరస్వామి మహత్యం, మహామంత్రి తిమ్మరుసు, దానవీరశూరకర్ణ చిత్రాలు విశ్వ విఖ్యాత ఎన్‌టిరామారావును మకుటం లేని మహారాజుగా నిలబెట్టాయి. కన్యాశుల్కం, గుండమ్మకథ, అడవిరాముడు, వేటగాడు, గజదొంగ, డ్రైవర్ రాముడు, సర్దార్ పాపారాయుడు, కొండవీటి సింహం, జస్టిస్ చౌదరి, బొబ్బిలిపులి చిత్రాల్లో ఆయన విలక్షణ నటనను ప్రేక్షకులు ఎప్పటికీ మరిచిపోరు. ఎన్‌టిఆర్ నటించిన చివరి చిత్రం మేజర్ చంద్రకాంత్. తన కెరీర్లో ఆయన దాదాపు 320కి పైగా చిత్రాల్లో నటించారు.చిత్ర సీమలో నెంబర్ వన్‌గా నిలిపిన అభిమానులకు, ప్రజలకు సేవ చేయాలని తలిచిన ఎన్‌టిఆర్ తెలుగుదేశం అనే రాజకీయపార్టీ స్థాపించారు. పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల కాలంలోనే వటవృక్షం లాంటి కాంగ్రెస్ పార్టీని మట్టికరిపించి ఆంధ్రప్రదేశ్‌లో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. తెలుగువాడి ఆత్మగౌరవం పేరుతో ప్రచార రథంపై సుడిగాలి పర్యటన చేశారు. అంతర్గత కుమ్ములాటలో కొట్టుమిట్టాడే కాంగ్రెస్ నాయకులు ఢిల్లీ అధిష్టానం చేతిలో కీలుబొమ్మలుగా మారడాన్ని ప్రచారాస్త్రాలుగా చేసుకుని ఆయన చేసిన ప్రసంగాలు తెలుగువారి గుండెల్లో పౌరుషాగ్నిని నిలిపాయి. పేదవాడి కడుపు నింపే రెండు రూపాయలకు కిలోబియ్యం, సగం ధరకే చేనేత వస్త్రాలు, రైతన్నకు సబ్సిడీపై విద్యుత్ తదితర ప్రజాకర్షక, ప్రజాసంక్షేమ పథకాలు తిరుగులేని విజయాన్ని అందించాయి. ఆడిన మాట తప్పని "అన్న"ఎన్‌టిఆర్ అధికారంలో కొనసాగినంత కాలం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారు. నాదేండ్ల బాస్కర రావు నుంచి వెన్నుపోటు ఎదుర్కొన్న ఎన్‌టిఆర్ మరోసారి ప్రజా తీర్పు కోరి తిరుగులేని మెజార్టీ సాధించి అధికారాన్ని కైవసం చేసుకున్నారు. 1985 ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఆయన 1989 ఎన్నికల్లో ఓటమి చెందారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు చుక్కలు చూపించిన ఎన్‌టిఆర్ దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలను ఐక్యపథంలో నడిపించి నేషనల్ ఫ్రంట్ ఏర్పాటు చేశారు. కేంద్రంలో తొలి సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటు చేయించారు.తిరిగి 1994లో రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక అసెంబ్లీ స్థానాల్లో విజయ దుందుబి మోగించి అఖండ మెజార్టీతో అధికారం చేపట్టారు. తెలుగు దేశం పార్టీలో అంతర్గత పరిస్థితుల కారణంగా ఎన్‌టిఆర్ నుంచి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి పీఠాన్ని హస్తగతం చేసుకున్నారు. 1996 జనవరి 18న ఎన్‌టిఆర్ గుండెపోటుతో మరణించారు. భౌతికంగా ఆయన దూరమైనా ప్రజలు, అభిమానుల గుండెల్లో చిరస్మరణీయమైన స్థానాన్ని సంపాదించుకున్నారు.

## లోకల్ చానల్‌లో గేమ్‌ఛేంజర్ నిందితుడి అరెస్టు

రాంచరణ్ నటించిన గేమ్ ఛేంజర్ విడుదల రోజే పైరసీ విషయంలో చిత్రయూనిట్‌కు బెదిరింపులు వచ్చాయని తెలిసిందే. పలు చోట్ల ఆన్‌లైన్‌లో సినిమా ప్రింట్ షేరింగ్స్ కూడా జరిగాయి. పైరసీ కావడంపై మూవీ టీం సైబర్ క్రైమ్ విభాగాన్ని కూడా ఆశ్రయించింది. విడుదల రోజే పైరసీ రావడంపై గేమ్ ఛేంజర్ టీం సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా గేమ్ ఛేంజర్ ఏకంగా లోకల్ టీవీ ఛానెల్‌లో ప్రసారం కావడం గేమ్ ఛేంజర్ టీంను ఆందోళనకు గురి చేసింది. ఈ సినిమా వచ్చి వారం కూడా కాకుండానే లోకల్ ఛానల్‌లో ప్రసారం అయ్యింది. దీనికి సంబంధించిన స్క్రీన్ షాట్‌లను సోషల్ మీడియాలో షేర్ కూడా చేశారు నెటిజన్లు. ఏపీలోని కాకినాడ ప్రాంతంలో సినిమాను లోకల్ ఛానెల్‌లో ప్రసారం చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో అప్పలరాజు అనే వ్యక్తిని గాజువాకలో అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈ విషయమై ఇప్పటికే టాలీవుడ్ నిర్మాత శ్రీనివాస కుమార్ (ఎస్‌కేఎన్) ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ఒక సినిమా వెనక కొన్ని వేల మంది శ్రమ దాగి ఉంటుందని తెలిపారు. ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఒక సినిమా విడుదలై 4 నుంచి 5 రోజులు కాకుండానే లోకల్ కేబుల్ ఛానల్‌తో పాటు బస్సుల్లో ప్రసారం చేస్తున్నారు. ఈ విషయం తీవ్ర ఆందోళనకు గురి చేస్తుంది. సినిమా అంటే కేవలం దర్శకుడు, హీరో, నిర్మాతలే కాదు. ఇది నాలుగేండ్ల కృషి. ఇలా ఆన్‌లైన్ పైరసీ చేస్తున్నప్పుడు సినిమా విజయంపై ఆధారపడి జీవిస్తున్న డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్ల గురించి ఆలోచించండి. ఇలా చేయడం వలన చిత్ర పరిశ్రమ భవిష్యత్తుకు కూడా ముప్పు ఉంటుంది. ఈ చర్యలపై ప్రభుత్వం సీరియస్ యాక్షన్ తీసుకునే టైం వచ్చిందంటూ ట్వీట్ చేశాడు.

EDITOR, PRINTED, PUBLISHED AND OWNER, BINGI SATHAIAH YAADHARTHAVAADHI TELUGU DAILY, PRINTED AT MEGHA PRINTERS, H NO.11-52, INDIRA NAGAR, SIDDIPET-502103, YAADHARTHAVAADHI@GMAIL.COM TELTEL/02022, RNI/2023/85376 # 11-52, INDIRA NAGAR PRASHANTH NAGAR, SIDDIPET-502103, PUBLISHED FROM: H NO.11-52, INDIRA NAGAR, SIDDIPET-502103, TELANGANA STATE. CELL:8500765666, 9491330519.